


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★




ఉత్తర అఫ్గానిస్థాన్‌లో భారీ భూకంపం 02

సంపుటి 28, సంచిక: 134 | మంగళవారం | 04-11-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00



# దూసుకొచ్చిన మృత్యువు

## ఆర్‌టిసి బస్సును ఢీకొన్న టిప్పర్

## 19 మంది దుర్మరణం, 24 మందికి గాయాలు

- రంగారెడ్డి జిల్లా మీర్జాగూడ సమీపంలో ఘటన
- పలు కుటుంబాల్లో పెను విషాదం
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతి
- అనాధలైన చిన్నారులు
- మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.5లక్షలు, ఆర్‌టిసి నుంచి రూ.2లక్షలు ఎక్స్‌గ్రేషియా
- కేంద్ర సర్కార్ నుంచి మరో రూ.2లక్షలు ఆర్థిక సాయం
- ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు దిగ్భ్రాంతి





మృత్యుశకటమై దూసుకొచ్చి, ఆర్‌టిసి బస్సును ఢీకొన్న కంకర టిప్పర్ 19 మంది ప్రాణాలు కబళించింది. 24 మందిని క్షతగాత్రులుగా మార్చింది. బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. మృతుల్లో ఎక్కువ మంది ఉద్యోగులు, విద్యార్థులే. గమ్యాలకు చేరాలన్న వారి ఆశలు ఆవిరయ్యాయి. ఏం జరిగిందో తెలుసుకునేలోపే చాలా మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. క్షతగాత్రుల రోదనలు... వేదనలు.. వెరసి, ఘటనా స్థలం ఓ హృదయ విదారక దృశ్యం. ప్రాణాలతో బయటపడిన వారి కళ్లలో భయం.. అంతకు మించిన బాధ. అది కేవలం ఒక ప్రమాదం కాదు.... కొన్ని జీవితాల నిశ్శబ్ద ఆర్తనాదాల సమాహారం. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం, మీర్జాగూడ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఆవిష్కరించిన హృదయవిదారక దృశ్యమిది.

ప్రజాపక్షం/రంగారెడ్డి

హైదరాబాద్– బీజాపూర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్163)పై రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో వికారాబాద్ జిల్లా తాండూరు ఆర్‌టిసి డిపోకు చెందిన టిఎస్ 34 టిఎ 6354 బస్సు ప్రమాదానికి గురైంది. తాండూరులో ఉదయం 4.40 గంటలకు 30 మం దికి పైగా ఉద్యోగులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో బయలుదేరగా మార్గమధ్యలో మరికొంత మంది చేరటంతో మొత్తం 72 మంది ప్రయాణికులతో బస్సు వెలుతోంది. ఈ క్రమంలో ఉదయం 6:15 గంటలకు ఎదురుగా కంకర లోడుతో వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు కుడి భాగం 5 సీట్ల వరకు పూర్తిగా నుజ్జు నుజ్జయ్ కంకర లోడు పడిపోవడంతో పలువురు ప్రయాణికులు అందులో కూరుకుపోయారు. ఈ ప్రమాదంలో 19 మంది అక్కడికక్కడే మృతి చెందగా.. 24 మంది తీవ్రంగా గాయడ్డారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి గాయపడిన వారిలో 14 మంది చేవెళ్ల పట్నం మహేందర్ రెడ్డి ఆస్పత్రిలో, 10 మంది వికారాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతి చెందిన వారిలో ఆర్‌టిసి బస్సు డ్రైవర్ దస్తగిరి బాబా (38), తాండూరులోని గాంధీ నగర్‌కు చెందిన తనూష, సాయి ప్రియ, నందిని అనే ముగ్గురు అక్క చెల్లెల తో పాటు తాలియా బేగం, తబస్సుమ్ జహాన్, షేక్ ఖాలీద్ హుషేన్, దౌల్తాబాద్‌కు చెందిన తరువాయి 2లో

## కుటుంబాల్లో అంతులేని విషాదం



తాండూరు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఎల్లయ్య గౌడ్ ముగ్గురు కూతుళ్లు నందిని(డిగ్రీ ఫస్టియర్),సాయిప్రియ (డిగ్రీ థర్డ్ ఇయర్), తనూష (ఎంబిఎ) హైదరాబాద్‌లో చదువుతున్నారు. ముగ్గురు అక్కాచెల్లెళ్లు తమ అక్క పెళ్లి వేడుకలు ముగించుకొని హైదరాబాద్‌లో విద్య అభ్యసించేందుకు వెళ్తుండగా బస్సు ప్రమాదంలో మృతి చెందడం అందర్నీ కలిచి వేసింది. తల్లి రోదన అందర్నీ కన్నీరు పెట్టించింది. అదేవిధంగా దౌల్తాబాద్ కు చెందిన హనుమంతు తన కుమారుడికి చెవి నొప్పి చికిత్స కోసం కోఠిలోని ఇ ఎన్‌టి ఆసుపత్రికి తీసుకువస్తూ తాను మృతి చెందడంతో ఆయన కొడుకు, భార్య కన్నీరు మున్నీరయ్యారు ట్రైన్ మిస్ కావడంతో బస్సు ఎక్కి మమ్ములను విడిచి వెళ్ళావా అంటూ రోధించడం అందరినీ కలిచివేసింది. ప్రమాద ఘటనలో తాండూర్‌కు చెందిన ఓ తల్లి తన ఒల్లో 15 నెలల పసిపాపను అదిమి పట్టుకుని తనువు చాలించింది. ఈ ఘటన అందర్నీ కలిసివేసింది. రోడ్డు తరువాయి 2లో




# టిప్పర్ బీభత్సం

- 12 వాహనాలను ఢీకొట్టిన డంపర్
- 13మంది దుర్మరణం
- రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఘటన

**జైపూర్ :** రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హర్మారా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని లోహా మండీ రహదారిపై వేగంగా వస్తున్న టిప్పర్ బీభత్సం సృష్టించింది. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 12 వాహనాలు ఢీకొట్టింది. తొలుత ఒక కారును బలంగా ఢీకొట్టింది. ఆ తర్వాత మరో 16 వాహనాలను బలంగా తాకింది. ఈ ప్రమాదంలో 13 మంది మరణించారు. మరో 11 మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే చౌమున్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రొబేషనరీ అధికారిణి ఉషా శర్మ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఈ ఘటనపై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, డిప్యూటీ సిఎంలు దియా కుమారి, ప్రేమ్‌చంద్ బైర్వా, మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ విచారం వ్యక్తం చేశారు. జైపూర్‌లోని హర్మదా రోడ్డులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణనష్టం జరిగడం చాలా బాధాకరం. గాయపడిన వారికి నాణ్యమైన వైద్య చికిత్స అందించడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించాం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని కోరుకుంటున్నాను' అని ఉపముఖ్యమంత్రి ప్రేమ్ చంద్ బైర్వా పేర్కొన్నారు. కాగా, ఈ ప్రమాదానికి సంబంధించి జైపూర్ అదనపు కమిషనర్ రాజీవ్ పచార్ స్పందించారు. 'సమాచారం అందుకున్న హర్మదా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు స్థానికులు సహాయంతో వాహనాలలో చిక్కుకున్న వారికి బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు' అని తెలిపారు. అయితే ప్రమాదంలో తరువాయి 12లో

# ఎస్ఎల్‌బిసి టన్నెల్‌ను పూర్తిచేసి తీరుతాం



- ప్రపంచంలోనే ఎక్కడాలేని టెక్నాలజీతో పనుల నిర్వహణ
- టన్నెల్ పూర్తయితే 30టిఎంసిలతో 3 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు,
- నల్లగొండ జిల్లాలో 30లక్షలమందికి తాగునీరు
- తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

## హెలీ మాగ్నటిక్ సర్వే పరిశీలించిన సిఎం, మంత్రుల బృందం



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్

శ్రీశైలంలెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టు (ఎస్ఎల్‌బిసి) సొరంగ మార్గంలో పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తిచేసి తీరుతామని ముఖ్యమంత్రి రేంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యాధునిక టెక్నాలజీతో టన్నెల్ పనులు చేపడుతున్నామన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా మన్నేవారిపల్లిలో హెలీ మాగ్నటిక్ సర్వేకు సంబంధించిన సర్వే హెలికాప్టర్‌తోపాటు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న వివరాలు, పరికరాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు పరిశీలించారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్ తవ్వకం పనుల పునరుద్ధరణలో మాగ్నటిక్ జియోఫిజికల్ సర్వే వివరాలను ముఖ్యమంత్రి, మంత్రుల బృందానికి అధికారులు వివరించారు. ఎన్‌జిఆర్ఐ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో హెలికాప్టర్‌కు ప్రత్యేకంగా అమర్చిన ట్రాన్స్‌మీటర్‌తో సర్వే నిర్వహించడం జరుగుతుందని అధికారులు వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్‌బిసి టన్నెల్ పనుల పురోగతిని పరిశీలించామని, టన్నెల్‌ను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. ఈ ప్రాజెక్టు 1983లో మంజూరైందని, ఇప్పటికీ పూర్తికాకపోవడం బాధాకరమని అన్నారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్ బోర్ మిషన్‌తో పనులు చేయడం కష్టంగా మారిందని, పనులపై బిఆర్ఎస్ నేతలు రాజకీయం చేయడం తగదని సిఎం హితవు పలికారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎస్ఎల్‌బిసి టన్నెల్ పనులు పూర్తి చేసి తీరుతామని అన్నారు. ప్రాజెక్టు మంజూరు చేసినప్పుడు టన్నెల్ పనుల అంచనా విలువ రూ.1,968 కోట్లు అని, 2 దశాబ్దాలుగా సాగుతున్న టన్నెల్ పనుల్లో ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడే నాటికి 30 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. కెసిఆర్ ప్రభుత్వం పది సంవత్సరాల్లో మిగతా 10 కి.మీ టన్నెల్ పూర్తి చేయలేదని అన్నారు. పెద్దగా కమీషన్లు రావని ఈ ప్రాజెక్టును పక్కకు పెట్టారని, ఎపిలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పోతిరెడ్డిపాడును విస్తరిస్తుంటే కెసిఆర్ చూస్తూ ఊరుకున్నారని ఆరోపించారు. రూ.2 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నీరు తరువాయి 2లో

# జనగణన.. పూర్తయితేనే రిజర్వేషన్‌లు తేలుతాయ్!



- కవిత - కెసిఆర్ వివాదం 'డాడీ - డాటర్' ఇష్యూ
- జూబ్లీహిల్స్ త్రిముఖపోటీలో బిజెపిదే గెలుపు
- మీడియా ప్రతినిధుల ఇష్టాగోష్టిలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ :

దేశవ్యాప్తంగా జనగణన పూర్తయిన తర్వాత తాము రిజర్వేషన్‌లు అమలు చేస్తామని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం కిషన్ రెడ్డి మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బిసి రిజర్వేషన్‌ల అమలుకు 9వ షెడ్యూల్‌లో చేర్చడం అవసరమన్నారు. కాంగ్రెస్ ఇన్నేళ్లుగా పాలించింది, అప్పుడు ఎందుకు చేయలేదని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. కవిత కెసిఆర్ కుటుంబ వివాదంపై ఆయన స్పందిస్తూ అది 'డాడీ డాటర్' ఇష్యూ అన్నారు. వారిద్దరూ తేల్చుకోవాలి. వారిపై కామెంట్లు చేయడం అవసరం లేదు' అని కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదన్నారు. అధికారాన్ని కోల్పోయాక కెసిఆర్ ప్రజల్లో కనిపించడం లేదన్నారు. ప్రజల్లో కనిపించని కెసిఆర్ తిరిగి సిఎం అవుతారని కెటిఆర్ తరువాయి 2లో

# పత్తి రైతులకు నష్టం చేసే.... సిసిఐ నిబంధనలు సవరించండి

## కేంద్ర టెక్స్ టైల్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు మంత్రి తుమ్మల లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల అంశంలో సిసిఐ విధించిన నిబంధనలను సవరించాలని కేంద్ర టెక్స్ టైల్ శాఖ మంత్రి గిరి రాజ్ సింగ్, సిసిఐ ఎండి లలిత్ కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కోరారు. సిసిఐ కొత్త నిబంధనలు పత్తి రైతులకు నష్టం చేసే విధంగా ఉన్నదని, తేమ శాతం విషయంలో కూడా 20 శాతం వరకు తేమ ఉన్న పత్తిని కొనుగోలు చే యాలన్నారు. ఈమేరకు కేంద్ర టెక్స్ టైల్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్, సిసిఐ ఎండి లలిత్ కుమార్‌లకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సోమవారం లేఖ రాశారు. ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలనే సిసిఐ కొత్త నిబందన రైతులకు ఇబ్బందికరంగా ఉంటుందని, ఇప్పటి వరకు ఎకరాకు 12 క్వింటాలు పత్తి తరువాయి 2లో

# మరో ఆరు నెలల పాటు కాల్పుల విరమణ


## మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రకటన

ప్రజాపక్షం/ ఖమ్మం

తెలంగాణ రాష్ట్రంలో మరో ఆరు నెలల పాటు కాల్పుల విరమణను పాటిస్తున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ తెలిపారు. ఈ మేరకు ఒక లేఖ విడుదల చేశారు. గత ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక వర్గాలు శాంతి కోసం ఉద్యమాలు చేశారని వారి ఆకాంక్షలకు అనుగుణంగా ఆరు నెలల పాటు కాల్పుల విరమణ ప్రకటించామని తరువాయి 2లో

# రూ.3వేల కోట్ల దోపిడీ!

- వృద్ధులు సహా బాధితుల నుండి కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన సైబర్ నేరస్తులు
- డిజిటల్ అరెస్టులపై సుప్రీం కోర్టు దిగ్భ్రాంతి
- మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ




**న్యూఢిల్లీ :** దేశంలో సైబర్ నేరాల స్థాయిపై సోమవారం సుప్రీంకోర్టు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. వృద్ధులు సహా బాధితుల నుండి రూ.3,000 కోట్లకు పైగా దోపిడీకి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. డిజిటల్ అరెస్ట్ కేసులను ఉక్కుహస్తంతో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. డిజిటల్ అరెస్ట్ అనేది ఒక పెరిగిపోతున్న సైబర్ నేరం. దీనిలో మోసగాళ్లు చట్టం అమలు అధికారులు లేదా కోర్టు అధికారులు లేదా ప్రభుత్వసంస్థల సిబ్బందిగా నటిస్తూ ఆడియో, వీడియో కాల్స్ ద్వారా బాధితులను బెదిరిస్తూ ఉంటారు. వారు బాధితులను బందీలుగా ఉంచి డబ్బు చెల్లించమని వారిపై ఒత్తిడి చేస్తుంటారు. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్, జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం హోంమంత్రిత్వ శాఖ, కేంద్ర దర్యాప్తు సంస్థ సమర్పించిన రెండు సీల్డ్ కవర్ నివేదికలను పరిశీలించింది. 'దేశవ్యాప్తంగా సీనియర్ సిటీజన్లు సహా బాధితుల నుండి రూ.3,000కోట్లకు పైగా వసూలు చేయడం దిగ్భ్రాంతి కరం. మనం కఠినమైన ఆదేశాలు జారీ చేస్తే ఈ సమస్య మరింత పెరుగుతుంది. న్యాయపరమైన తరువాయి 12లో

## భారత మహిళా క్రికెట్ జట్టు విజయోత్సాహం



నవీ ముంబయి వేదికగా జరిగిన ఐసిసి మహిళల ప్రపంచ కప్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించిన ఈ జట్టు మొట్టమొదటి సారి విశ్వవిజేతగా నిలిచింది. 1973లో మొదలైన ఈ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకోవాలన్న భారత్ కల 43 సంవత్సరాలకు నెరవేరింది.

# నేడు 12 రాష్ట్రాలు, యుటిల్లో 'సర్'



**న్యూఢిల్లీ :** ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)ను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ కేంద్ర ఎన్నికల సంఘం మాత్రం ఏ మాత్రం ఖాతరు చేయకుండా ముందుకు వెళ్తోంది. ఇప్పటికే బిహార్ సర్‌ను చేపట్టగా మంగళవారం నుంచి తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. 51 కోట్ల మంది ఓటర్లు ఉన్న ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఫిబ్రవరి 7, 2026న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో సర్ ముగుస్తుంది. బిహార్ తరువాత సర్‌ను రెండవ విడతగా ప్రారంభిస్తుంది. బిహార్‌లో దాదాపు 7.42 కోట్ల ఓటర్లతో తుది జాబితాను సెప్టెంబర్ 30న ప్రచురించింది. కాగా, రెండవ విడతలో సర్‌ను నిర్వహించే 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అండమాన్ అం డ్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. వీటిలో, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో 2026లో ఎన్నికలు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## భారత మత్స్యకారుల అరెస్టు

**కొలంబో :** నిబంధనలకు వ్యతిరేకంగా రాత్రి వేళల్లో కూడా చేపలు పడుతున్నారని ఆరోపిస్తూ, 35 మంది భారత మత్స్యకారులను శ్రీలంక నావికాదళ అధికారులు అరెస్టు చేశారు. జాఫ్నా జిల్లాకు ఉత్తరాన ఉన్న కన్కేశాంథురై ప్రాంతంలో వీరిని అదుపులోకి తీసుకున్నట్టు నేవీ అధికార ప్రతినిధి కమాండర్ బుద్ధిక సంపత్ తెలిపారు. మత్స్యకారులను అరెస్టు చేసి, వారికి చెందిన ఆనలుగు బోట్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కాగా, భారత్–శ్రీలంక దేశాల మధ్య మత్స్యకారుల సమస్య చాలాకాలంగా కొనసాగుతున్నది. ఇరు దేశాల అధికారులు మత్స్యకారులను నిర్బంధించడం సామాన్యమైంది.



## నైజీరియాపై సైనిక చర్య

### హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**అబుజా :** నైజీరియాలో క్రైస్తవులపై జరుగుతున్న వేధింపులను అరికట్టడంలో అక్కడి ప్రభుత్వం విఫలమైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. ఆ దేశంపై సైనిక చర్యకు ప్రణాళికలు రూపొందించాలని పెంటగాన్‌ను ఆదేశించినట్టు తెలిపారు. అంతేగాక, నైజీరియాకు ఇచ్చే అన్ని రకాల సహాయం, ఆర్థిక సహాయాలను వెంటనే నిలిపివేస్తానని కూడా ఆయన తన సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. 'క్రైస్తవుల హత్యలను నైజీరియా ప్రభుత్వం అనుమతిస్తూ కొనసాగిస్తే, అమెరికా వెంటనే ఆ దేశానికి ఇచ్చే సహాయం మొత్తాన్ని నిలిపివేస్తుంది. అంతేకాదు, ఆ దేశంలోకి దూసుకెళ్లి, ఆ భయంకరమైన దాడులు చేస్తున్న ఇస్లామిక్ ఉగ్రవాదులను పూర్తిగా నిర్మూలిస్తాం. నేను మా యుద్ధ విభాగానికి వెంటనే సన్నద్ధత ఆదేశిస్తున్నాను. మేము దాడి చేస్తే అది వేగంగా, క్రూరంగానూ ఉంటుంది' అని వ్యాఖ్యానించారు. ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో జర్నలిస్టులతో మాట్లాడుతున్నప్పుడు 'నైజీరియాలోకి అమెరికా సైన్యాన్ని పంపాలనుకుంటున్నారా?' అన్న ప్రశ్నకు ట్రంప్ నేరుగా సమాధానం ఇవ్వలేదు. ఏదైనా జరగవచ్చని వ్యాఖ్యానించారు. నైజీరియాను ఆయన మత అసహన దేశంగా అభివర్ణించారు. కాగా ట్రంప్ వ్యాఖ్యలను నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు తిరస్కరించారు. ఈ ఆరోపణలు వాస్తవ విరుద్ధమని అన్నారు. మత స్వేచ్ఛ, సహనశీలత మన దేశపు సామూహిక గుర్తింపులో అంతర్భాగమని అన్నారు. మత వేధింపులను నైజీరియా ప్రోత్సహించదని, మత స్వేచ్ఛను రాజ్యాంగం ద్వారా రక్షిస్తుందని వివరించారు. సుమారు 220 మిలియన్ల జనాభా కలిగిన నైజీరియా దేశంలో క్రైస్తవులు, ముస్లింలు దాదాపు సమానంగా ఉన్నారు. ఆ దేశం సంవత్సరాలుగా బోకో హరామ్ వంటి ఉగ్రవాద గ్రూపుల నుండి భద్రతాపరమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ సంస్థ తమ కఠిన ఇస్లామిక్ చట్టాలను అమలు చేయాలని లక్ష్యంతో క్రైస్తవులతో పాటు, ఇస్లామిక్ సూత్రాలకు కట్టుబడి లేరని ఆరోపిస్తూ కొంత మంది ముస్లింలపైన కూడా దాడులు చేస్తున్నది. అయితే, నైజీరియాలోని దాడులకు మతపరమైన కారణాలే కాకుండా భూసంబంధిత వివాదాలు, సామాజిక కలహాలు, జాతి ఘర్షణలు, విడిపోతామనే ఉద్యమాలు వంటి పలు కారణాలు ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. క్రైస్తవులు కూడా లక్ష్యంగా ఉన్నప్పటికీ, ముస్లిం మెజారిటీ ఉన్న ఉత్తర నైజీరియాలో జరిగిన దాడుల్లో బాధితులలో ఎక్కువ మంది ఆ వర్గానికి చెందిన వారేనని నిపుణులు గుర్తుచేస్తున్నారు. 2020లో నైజీరియాను మత స్వేచ్ఛకు వ్యవస్థాత్మక ఉల్లంఘన చేస్తున్న దేశంగా గుర్తించిన అమెరికా 'ప్రత్యేక ఆందోళన కలిగించే దేశాల జాబితా'లో చేర్చింది. అయితే, 2023లో అప్పటి విదేశాంగ కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్ నైజీరియా పర్యటనకు ముందు ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపర్చే ప్రయత్నంలో ఈ గుర్తింపును తొలగించారు.

# ఉత్తర అఫ్గానిస్థాన్‌లో భారీ భూకంపం

### కనీసం 20 మంది మృతి, 300 మందికి పైగా గాయాలు







**కాబూల్ :** అఫ్గానిస్థాన్ ఉత్తర ప్రాంతాలను సోమవారం తెల్లవారుజామున 6.3 తీవ్రతతో కూడిన భారీ భూకంపం కుదిపేసింది. ఈ ప్రమాదంలో కనీసం 20 మంది ప్రాణాలు కోల్పోగా, 320 మందికి పైగా గాయపడ్డారని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. యుఎస్ జియోలాజికల్ సర్వే (యుఎస్‌జిఎస్) ప్రకారం, ఈ భూకంపం కేంద్రబిందువు ఖుల్మ్ పట్టణం నుండి 22 కిలోమీటర్ల దూరంలో, భూమి లోపల 28 కిలోమీటర్ల లోతులో ఏర్పడింది. దీనిపై అఫ్గానిస్థాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి షరాఫత్ జమాన్ కూడా మృతులు, గాయపడిన వారి వివరాలను ధ్రువీకరించారు. కాగా, గాయపడిన వారిలో చాలామందికి స్వల్ప గాయాలే ఉండడంతో, ప్రాథమిక చికిత్స అనంతరం వారిని డిశ్చార్జ్ చేసినట్టు అఫ్గాన్ విపత్తు నిర్వహణ సంస్థ ప్రతినిధి యూసఫ్ హమ్మద్ చెప్పారు. బాల్ఖ్, సమంగాన్ ప్రావిన్స్‌లలో ఎక్కువ నష్టం సంభవించిందని రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటనలో తెలిపింది. రక్షణ బృందాలు అక్కడకు చేరుకుని శిథిలాల మధ్య చిక్కుకున్న వారిని రక్షించడం, గాయపడినవారిని ఆసుపత్రులకు తరలించడం, ప్రభావిత కుటుంబాలకు సహాయం అందించడం వంటి సహాయక చర్యలు చేపట్టాయని వివరించింది. ఈ భూకంపం తాలిబాన్ ప్రభుత్వ ప్రధాన ప్రతినిధి జబి హుల్లా ముజాహిద్ తెలిపారు. భారీగా ఆస్తి నష్టం సంభవించిందని ఆయన తన 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు. బాధితులకు, వారి కుటుంబాలకు ఆయన సంతాపం వ్యక్తం చేశారు. సంబంధిత ప్రభుత్వ విభాగాలు సహాయ చర్యల్లో నిమగ్నమై ఉన్నాయని తెలిపారు. కాగా, ఈ భూకంపం మజార్‌ఇషరీఫ్ నగరంలో కూడా తీవ్ర ప్రభావం చూపినట్టు సమాచారం. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వీడియోల్లో, చారిత్రాత్మక బ్లూ మసీదు (నీలి మసీదు) గోడల నుండి ఇటుకలు కూలిన దృశ్యాలు కనిపించాయి. అయితే, మసీదు భవనం మొత్తంగా దెబ్బతినలేదని అంటున్నారు. శతాబ్దాలనాటి ఈ మసీదు అఫ్గానిస్థాన్‌లో అత్యంత పవిత్ర స్థలాలలో ఒకటి. మరోవైపు, కాబూల్–మజార్‌ఇషరీఫ్ ప్రధాన పర్వత రహదారిపై భారీగా రాళ్లు పడ్డాయి. దీనితో కొంత సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. అయితే, అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి, రాళ్లను, ఇతర అడ్డంకులను తొలగించారి. ఈ ఘటనల్లో రహదారిపై చిక్కుకున్న కొంతమంది గాయపడగా, వారిని ఆసుపత్రికి తరచారు. కొన్ని వారాల క్రితం తూర్పు అఫ్గానిస్తాన్‌లో సంభవించిన ప్రాణాంతక భూకంపం తరువాత, తాజా భూకంపం చోటు చేసుకున్నట్టు ఐక్యరాజ్యసమితి అఫ్గానిస్థాన్ మిషన్ (యుఎన్‌ఎఎంఎ) ఒక ప్రకటనలో తెలిపింది.

తమ బృందాలు ప్రాంతంలోనే ఉండి అవసరాలను అంచనా వేస్తున్నాయని, అత్యవసర సహాయం అందిస్తున్నాయని వివరించింది. కాగా, గత కొన్నేళ్లుగా అఫ్గానిస్థాన్ వరుస భూకంపాలతో తల్లడిల్లుతోంది. పేదరికంతో బాధపడుతున్న ఈ దేశం, ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో, ఇలాంటి విపత్తులకు సమర్థంగా స్పందించడంలో తరచుగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దేశంలోని పలు ప్రాంతాల్లో అత్యధిక శాతం మట్టితో నిర్మించిన ఇళ్లు ఉన్నాయి. ఇటుకలతో నిర్మించిన బహుళ అంతస్తు భవనాలు చాలా తక్కువ.

భూకంపాలు సంభవించినప్పుడు, మట్టి ఇళ్లు సులభంగా కూలిపోతున్నాయి. చాలా సందర్భాల్లో ప్రాణ నష్టం తప్పడం లేదు. 2024 ఆగస్టు 31న తూర్పు అఫ్గానిస్తాన్–పాకిస్తాన్ సరిహద్దు సమీపంలో సంభవించిన 6.0 తీవ్రత గల భూకంపంలో 2,200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అదేవిధంగా, 2023 అక్టోబర్ 7న సంభవించిన 6.3 తీవ్రత గల భూకంపం, దాని తరువాయి వచ్చిన శక్తివంతమైన 'ఆఫ్టర్ షాక్' కారణంగా కనీసం 4,000 మంది మృతి చెందినట్లు తాలిబాన్ ప్రభుత్వం ప్రకటించింది.

## అబుధాబిలో ఆయిల్ సదస్సు ప్రారంభం

### 2026 తొలి త్రైమాసికానికి ఉద్దేశించిన ఉత్పత్తి పెంపును నిలిపివేసిన ఒపెక్+

**అబు ధాబి :** అత్యంత కీలకమైన మూడు రోజుల ఆయిల్ సదస్సు అబు ధాబిలో సోమవారం ప్రారంభమైంది. అబూ ధాబి అంతర్జాతీయ పెట్రోలియం ఎగ్జిబిషన్ అండ్ కాన్ఫరెన్స్ (ఎడిఐపిఇసి)లో, శక్తి రంగ నిపుణులు కృత్రిమ మేధస్సు (ఎఐ), అంతర్జాతీయ విమానయాన రంగం కారణంగా ప్రపంచవ్యాప్తంగా విద్యుత్, ఇంధన అవసరాలు పెరగడం వల్ల ఎనర్జీ ధరలు మరింత పెరగవచ్చనన్న అంచనాలు ఉన్నాయి. వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలో ఉత్పత్తి పెంపు ప్రణాళికలను నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్న కొన్ని గంటల వ్యవధిలోనే ఈ అంచనా ప్రకటన వెలువడడం గమనార్హం. ఈ పరిణామం గ్లోబల్ ఎనర్జీ మార్కెట్‌లోని విరుద్ధ ధోరణులను స్పష్టంగా చూపిస్తున్నది. ముఖ్యంగా, 2023లో సంయుక్త రాజ్యసమితి వాతావరణ సదస్సు కాప్28 (సిఒపి 28)ను నిర్వహించిన అబుధాబి వంటి ప్రధాన చమురు ఉత్పత్తిదారు దేశానికి ఇది ఒక ప్రతికూలమైన అంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే, శక్తి మార్కెట్‌కి మార్పు కాదు, మరింత మద్దతు అవసరమని అబుధాబీ నేషనల్ ఆయిల్ కంపెనీ (ఎడిఎన్ఒసి) అధిపతి, కాప్28 చైర్మన్ సుల్తాన్ అల్‌జాబర్ వ్యాఖ్యానించారు. ఒపెక్+ దేశాలు ఆదివారం సమావేశమై, డిసెంబర్ నుండి రోజుకు 1,37,000 బ్యారెల్స్ ఉత్పత్తి పెంచాలని నిర్ణయించాయి.

అయితే, జనవరి, ఫిబ్రవరి, మార్చి 2026లో జరగాల్సిన మరిన్ని పెంపులను రుతుపరమైన వాతావరణ పరిస్థితుల కారణంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. ఒపెక్+లో ప్రధాన సభ్య దేశాలతో పాటు రష్యా నేతృత్వంలోని ఇతర దేశాలు కూడా ఉన్నాయి. సోమవారం నాటికి బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 65 అమెరికన్ డాలర్లుగా ఉంది. ఇది రష్యా–ఉక్రేన్ యుద్ధం ప్రారంభమైన తరువాత నమోదైన 115 డాలర్ల గరిష్ఠ స్థాయి కంటే చాలా తక్కువ. ఇటీవల మార్కెట్లో అధిక సరఫరాపై ఆందోళనలతో ధర 60 డాలర్ల వరకు పడిపోయింది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలో చమురు ఉత్పత్తులను తగ్గించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం తీసుకున్న కొద్దిసేపటికే, విద్యుత్‌కు పెరుగుతున్న డిమాండ్‌పై ప్రకటన వెలువడడం గమనార్హం. అంటే, విద్యుత్ ఉత్పత్తి కోసం చమురు ఉత్పత్తులను తగ్గించరాదనే అభిప్రాయం ఆయిల్ సమ్మిట్ ఆరంభంలోనే వ్యక్తమైంది. ఇక దీనిపై మూడు రోజుల సదస్సు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

## రోడ్డు ప్రమాదం – ప్రధాని, సిఎం, మంత్రుల తీవ్ర దిగ్భ్రాంతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క,మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతులకు సంతాపాన్ని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి – కేంద్రం నుంచి రూ.2 లక్షల ఆర్థిక సాయం**

చేవెళ్లలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పట్ల ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగ్రాతులు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు.

**బస్సు ప్రమాదం తీవ్రంగా కలిచి వేసింది : సిఎం రేవంత్ రెడ్డి ఆర్‌టిసి బీమాతో పాటు బాధిత కుటుంబాలకు భరోసా నిచ్చే చర్యలు చేపట్టాలని సిఎం ఆదేశం**

చేవెళ్ల మండలంలో మీర్జాగూడ వద్ద జరిగిన బస్సు ప్రమాదం తీవ్రంగా కలిచి వేసిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద ఘటనా స్థలంలో దృశ్యాలు బాధ కలిగించాయని సిఎం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన పరిహారంతో పాటు అన్ని రకాలుగా సాయం అందించే చర్యలు చేపట్టాలని మంత్రులు, అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు జరిగినపుడు ఆర్‌టిసి తరపున అందించే బీమాతో పాటు బాధిత కుటుంబాలకు భరోసా నిచ్చే చర్యలు వేగంగా చేపట్టాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు.

**సిఎస్, డిజిపి పర్యవేక్షణ**

ఘటనతో పాటు వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు, మృతుల పోస్టుమార్టం వద్ద సహాయ చర్యలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి బి.శివధర్‌రెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షించారు. ఘటనా స్థలికి పలువురు మంత్రులు స్వయంగా వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంపై కూనంనేని తీవ్ర విచారం

చేవేళ్లలోని మీర్జాగూడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 19 మంది మరణించడం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారిని ప్రభు త్వం పూర్తి వైద్య ఖర్చులను భరించి మెరుగైన వైద్యం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ప్రమాదంలో ఆర్‌టిసి డ్రైవర్ తప్పు లేదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చేవెళ్ల సమీపంలోని ఇందిరా రెడ్డి నగర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు దుర్ఘటనపై టిజిఎస్ ఆర్‌టిసి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఈ సంఘటన దురదృష్టకరమైనదిగా భావిస్తూ, ప్రాణాలు కోల్పోయిన 19 మందికి తమ సంతాపం తెలిపింది. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. క్షతగాత్రులైన ప్రయాణికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. ఈ ఘటనకు సంబంధించిన ప్రాథమిక విచారణ అనుసారం ప్రమాదానికి ఆర్‌టిసి బస్సు కానీ, బస్సు డ్రైవర్‌కు కానీ కారణం కాదని తెలుస్తోందని ఆర్‌టిసి యాజమాన్యం సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రకటించింది. 'బస్సు పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నట్లు, డ్రైవర్ సర్వీసు రికార్డు ప్రకారం ఎలాంటి యాక్సిడెంట్ రికార్డు లేనట్టు తేలింది.

రోడ్డు మలుపు వద్ద అతి వేగంతో ఉన్న టిప్పర్ డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారని ఆర్‌టిసి యాజమాన్యం చెప్పింది. ఈ సంఘటన జరిగిన వెంటనే టిజిఎస్ ఆర్‌టిసి యాజమాన్యం స్పందించి, సమీపంలోని డిపో మేనేజర్లను అప్రమత్తం చేసింది. తాండూరు, వికారాబాద్, పరిగి డిపో మేనేజర్లు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి, హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రో షా ఖాన్, ఇన్‌చార్జ్ ఇ.డి (ఆపరేషన్స్) శ్రీధర్, రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత సీనియర్ అధికారులు అక్కడికి వెళ్లి, సహాయక చర్యలు ముమ్మరం చేశారు. గాయపడిన 25 మందికి మెరుగైన చికిత్స అందించాలని అధికార బృందం, అక్కడి డాక్టర్లను కోరారు.

## రిజర్వేషన్‌లు తేలుతాయ్!

(మొదటి పేజీ తరువాయి)

పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ బిఆర్‌ఎస్ మధ్య ఢిల్లీలో ఒప్పందం కుదిరిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. బిజెపిని అడ్డుకునేందుకు కాంగ్రెస్ బిఆర్‌ఎస్ పైకి కొట్లాడుతున్నట్లు నటిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ వైఫల్యంతో ఢిల్లీలో బిజెపి గెలిచిందని కెటిఆర్ చేసిన వ్యాఖ్యలే దీని నిదర్శనమన్నారు. తెలంగాణలో బిజెపిని అడ్డుకునేందుకు కాంగ్రెస్‌కు అనుకూలంగా మజ్లిస్ ఏడుకంటే ఎక్కువ శాసనసభ స్థానాలకు పోటీ చేయదని తెలిపారు. బీహార్ ఎన్నికల్లో బిజెపి వందకు వంద శాతం గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపి విజయం ఖాయం..**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బిజెపి విజయం ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తాము కింగ్ మేకర్లు కాదని, బిజెపి కింగ్ అవుతుందని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన పైవిధంగా స్పందించారు. టిడిపి, జనసేన సానుభూతి పరులు తమకు మద్దతుగా వస్తున్నారని చెప్పారు. ఇక్కడ వారి యూనిట్‌లు లేకపోవడంతో వారితో పార్టీకి ఎలాంటి పొత్తు లేదని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో త్రిముఖ పోరు జరుగుతుందని తెలిపారు. అజారుద్దీన్‌కు ముస్లింల ఓట్ల కోసమే మంత్రి పదవి ఇచ్చారని విమర్శించారు. ఆయనపై ఇంకా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం తమకు సానుకూలంగా మారుతుందన్నారు.

**మెట్రోరైల్‌ను ఇంకా రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనమే చేసుకోలేదు..**

మెట్రోరైల్ ఫేజ్2 డిపిఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కేంద్రానికి పంపలేదన్నారు. మెట్రో నడపబోమని ఎల్ అండ్ టి చెబుతోందని, ఎల్ అండ్ టి నుంచి రాష్ట్ర ప్రభుత్వం మెట్రోను స్వధీనం చేసుకోవాలని, మారిన ఆలైన్‌మెంట్‌లకు డిపిఆర్ తయారుచేసి, కేంద్రానికి పంపించాలన్నారు. ఇలాంటివి ఏమి చేయకుండానే కేంద్రాన్ని విమర్శించడం సరికాదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులే నష్టపోతున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వమంటే రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ దాడుల పేరిట బెదిరించడం సరికాదన్నారు. యాజమాన్యాలు నిబంధనలు పాటించడం లేదని అనిపిస్తే చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ బెదిరింపులకు ఎవరూ భయపడరన్నారు.

## ప్రమాద ఘటనపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు

### ఫోన్ నంబర్లు: 9912919545, 9440854433

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని దగ్గరుండి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆర్‌టిసి ఎండి, రవా ణా కమిషనర్, ఫైర్ డిజిలను అదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర సచివాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రమాదానికి సంబంధించి సమాచారం, క్షతగాత్రులు, బంధుమిత్రులు, ఇతర కుటుంబ సభ్యుల కోసం కంట్రోల్ రూమ్‌లో 9912919545, 9440854433 నంబర్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు తీసుకోవాలని అధికారులతో ఆదేశించారు. ఈ దుర్ఘటనలో క్షతగాత్రులను వెంటనే హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్య చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలను ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన వారికి అత్యవసర వైద్య సేవలు అందించేందుకు గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను అదేశించారు.

**కొంప ముంచిన కంకర**

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మోటర్ వాహనాల చట్టం ప్రకారం ప్రమాదానికి గురైన టిప్పర్‌లో 27 టన్నులు మాత్రమే తీసుకెళ్లాలి. అయితే ప్రమాద సమయంలో టిప్పర్‌లో 60 నుంచి 65 టన్నుల వరకు కంకర ఉందని సమాచారం. నిబంధనల ప్రకారం టిప్పర్‌తో సహా 27 టన్నులు ఉండాలి. టిప్పర్ బరువు మినహా కంకర సుమారు 20 టన్నులు మాత్రమే ఉండాలి. నిబంధనల మేరకు టిప్పర్‌లో కంకర ఉండి ఉంటే ప్రమాద సమయంలో మృతుల సంఖ్య భారీగా తగ్గే అవకాశాలు ఉండేవి. ప్రమాదం జరిగిన సమయంలో టిప్పర్‌లో మూడింతలు అధికంగా ఉండడంతో కంకరలో సుమారు 45 టన్నుల కంకర ప్రయాణికులపై కుప్పగా పడిపోయింది. దీంతో ఊపిరాడక మృతి చెందారు.

## సవరించండి (మొదటి పేజీ తరువాయి)

కొనుగోలు చేశామని మంత్రి తుమ్మల వివరించారు. ఎకరాకు 11.74 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు ఉన్నట్టు జిల్లా కలెక్టర్ల నివేదిక తెలిపిందని పేర్కొన్నారు. ప్రస్తుత ఏడాది అధిక వర్షాల వల్ల పత్తి రైతులకు నష్టం వాటిల్లిందని, కపాస్ కిసాన్ యాప్‌తో అవగాహన లేక పత్తి రైతులకు ఇబ్బందులు తలెత్తాయని వివరించారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని 7 క్వింటాళ్ల నిబంధన ఎత్తి వేసి, పాత పద్ధతిలోనే పత్తి కొనుగోళ్లు చేయాలని, తేమ శాతం 20 వరకు ఉన్న పత్తిని సిసిఐ కొనుగోలు చేయాలని, విన్నింగ్ మిల్లర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు విజ్ఞప్తి చేశారు. కాగా ఈ అంశాలపైన రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి, మార్కెటింగ్ డైరక్టర్ లక్ష్మి బాయి తదితర అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సమీక్ష నిర్వహించారు.

## విషాదం (మొదటి పేజీ తరువాయి)

ప్రమాదం ఇద్దరు చిన్నారులను అనాథలను చేసింది. ఈ ఘటనలో వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం హాజీపూర్‌కు చెందిన భార్యాభర్తలు బండప్ప, లక్ష్మి మృతి చెందారు. దీంతో వారి కుమార్తెలు భవానీ, శివలీల ఒంటరిగా మిగిలిపోయారు. తల్లిదండ్రుల మృతితో కన్నీరుమున్నీరయ్యారు. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. చిన్నారుల రోదనతో పలువురి కళ్లు చెమ్మగిల్లాయి.

## దూసుకొచ్చిన మృత్యువు

(మొదటి పేజీ తరువాయి)

మల్ల గండ్ల హనుమంతు, బోరబండకు చెందిన గోగుల గుణమ్మ, కల్ప(45),యాలాల్‌కు చెందిన గుర్రాల అంకిత, దన్నారం తండాకు చెందిన హేమావతి తాలిభామ్, భానూరుకు చెందిన బాచ్చన్ నాగమణి, మరి కొంతమంది మృతి చెందిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

**మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి పొన్నం**

చేవెళ్ళ బస్సు ప్రమాద మృతులకు ప్రభుత్వం నుండి రూ.5 లక్షలు, ఆర్‌టిసి నుండి రూ.2 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు ప్రభుత్వం రూ.2 లక్షల పరిహారం చెల్లించాలని రవాణా శాఖ, సిఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తదితరులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ళ బస్సు ప్రమాద బాధితులకు పట్నం మహేందర్ రెడ్డి మెడికల్ కాలేజీలో పరామర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్ వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బస్సు ప్రమాద దుర్ఘటనలో చనిపోయిన మృతదేహాలకు చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్ మార్టం నిర్వహణపై అధికారులతో మాట్లాడారు ఎప్పటికప్పుడు ఆర్‌టి, పోలీస్, వైద్యశాఖ అధికారులతో మాట్లాడుతూ సమన్వయం చేశారు. ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

**ఘటన దురదృష్టకరం : మంత్రి శ్రీధర్ బాబు**

సోమవారం చేవెళ్ల ఏరియా ఆసుపత్రిలో చిక్సిత పొందుతున్న బస్సు ప్రమాద ఘటన క్షతగాత్రులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఏరియా ఆసుపత్రి దగ్గర శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. ఇదొక దురదృష్టకర ఘటన. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాని బాధితులకు ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు ఇప్పటికే మెజిస్ట్రియల్ విచారణకు ఆదేశించడం జరిగిందని, అదే విధంగా శాఖాపరమైన విచారణ కూడా ఆదేశించామని తెలిపారు.రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ప్రమాద స్థలానికి వెళ్ళి పరిస్థితిని పర్యవేక్షించారు. చేవెళ్ల ఏరియా ఆసుపత్రిలో చిక్సిత పొందుతున్న బస్సు ప్రమాద ఘటన క్షతగాత్రులను పరామర్శించారు.

**బాధితులకు మంత్రి దామోదర్ పరమర్శ**

పిఎంఆర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న చేవెళ్ల రోడ్డు ప్రమాద బాధితులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరామర్శించారు. పేషెంట్ల కండీషన్‌ను మంత్రికి వివరించిన డాక్టర్లు ఎవరికీ ప్రాణాపాయం లేదని తెలిపిన ట్లు చెప్పారు. ఒక్కరికి మాత్రమే హెడ్ ఇంజూరి అయిందని,మిగిలిన పేషెంట్లందరి కండీషన్ స్టేబుల్‌గా ఉందని డాక్టర్లు వివరించినట్లు తెలిపారు. అందరికీ మెరుగైన వైద్యం అందించాలని మంత్రి ఆదేశించారు.వైద్యానికి అయ్యే ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుందని,క్షతగాత్రులను పరామర్శించి వారికి మంత్రి మనోధైర్యం కల్పించారు.బస్సు కండక్టర్‌తో మాట్లాడి యాక్సిడెంట్ జరిగిన తీరును గూర్చి మంత్రి తెలుసుకున్నారు.

## పూర్తిచేసి తీరుతాం

(మొదటి పేజీ తరువాయి)

అందేదని అన్నారు. కృష్ణా నది మీద చేపట్టిన అన్ని ప్రాజెక్టులను కెసిఆర్ నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పూర్తి కాకపోతే మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు. ఆర్మీలో నిపుణులైన అధికారులను డిప్యుటేషన్‌పై తీసుకువచ్చామని సిఎం వివరించారు. గత పది సంవత్సరాల్లో సాగునీటి ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు కెసిఆర్ ప్రభుత్వం రూ.1.86 లక్షల కోట్లు చెల్లించిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ మొత్తంలో కాళేశ్వరం కాంట్రాక్టర్లకే రూ.1.06 లక్షల కోట్లు చెల్లించారని, గత పది సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా నదిపై ఎన్నో ప్రాజెక్టులు చేపట్టి పూర్తి చేసిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం కెసిఆర్ ప్రభుత్వం కృష్ణా నదిపై ప్రాజెక్టులు పూర్తి చేయలేదని వివరించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పనులు 20 సంవత్సరాల నుంచి కొనసాగుతున్నా గత ఐదేళ్లక్రితం నుంచి ప్రారంభమయ్యాయన్నారు. అందరి ధృఢ సంకల్పంతో రెండేళ్లలో ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ పూర్తి చేయాలని ముందుకెళుతున్నాం. గతంలో ఎస్‌ఎల్‌బిసి పనుల్లో ఎనిమిదిమందిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అత్యాధునికమైన హెలిబోన్ ఎలక్ట్రిక్ టెక్నాలజీ ద్వారా 44 కిలోమీటర్ల వరకు హెలికాప్టర్ ద్వారానే జరుగుతుందని, భారత ఏరియల్ ఎలక్ట్రికల్ మ్యాగ్నటిక్ సర్వే ఎక్కడా నిర్వహించలేదన్నారు. మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ ప్రాజెక్టు ద్వారా నల్లగొండ జిల్లాను ఫ్లోరైడ్ నుంచి కాపాడాలని ఎన్నోసార్లు మాట్లాడినట్లు పేర్కొన్నారు. వికారాబాద్ నుంచి ప్రారంభమయ్యే మూసినది మంచిగా చేసేందుకు కూడా ఖర్చుకు వెనకాడకుండా ప్రభుత్వం పని చేస్తుందని ఈ విషయంలో జిల్లా ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ నీటికి సంబంధించి ఇటీవల కురిసిన భారీవర్షాలకు నల్లమల అడవిలోని నక్కలగండి రిజర్వాయర్‌లో మల్లపాడుతండా, కేత్యాతండాలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చేపట్టాలని ముఖ్యమంత్రిని కోరారు. అనంతరం ప్రత్యేక హెలికాప్టర్ సర్వే నిర్వహించగా ముఖ్యమంత్రి, మంత్రుల బృందం మరో హెలికాప్టర్‌లో సర్వే హెలికాప్టర్ వెంట వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి, డిఐజి చౌహన్, జిల్లా ఎస్‌పి గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు , వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కాల్పుల విరమణ

(మొదటి పేజీ తరువాయి)

ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ ఆరు మాసాల కాలంలో తమ వైపు నుంచి శాంతియుత వాతావరణం కొనసాగించేలా కృషి చేశామని జగన్ లేఖలో పేర్కొన్నారు. దీనినే కొనసాగిస్తూ మరో ఆరు నెలల పాటు కాల్పులు విరమించి శాంతియుత వాతావరణానికి సహకరిస్తామని ఆయన తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణలో కొనసాగుతున్న శాంతియుత వాతావరణాన్ని చెడగొట్టాలని ప్రయత్నాలు చేస్తుందని ఈ ప్రయత్నాలకు వ్యతిరేకంగా అన్ని సామాజిక వర్గాలు, సంఘాలు, విద్యార్థి, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు అడ్డుకోవాలని జగన్ లేఖలో తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ కోసం 700 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం అనుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదిలాబాద్ జిల్లాలో ఎయిర్ ఫీల్డ్ అభివృద్ధి కోసం మొత్తం 700 ఎకరాల భూసేకరణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇచ్చిన నివేదిక సానుకూలంగా రావడంతో రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాడ్డు, భవనాల శాఖ సోమవారం ఉత్తర్వులు (జిఓ నెంబర్.73) జారీ చేసింది. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ సౌకర్యం వల్ల ఉత్తర తెలంగాణలో వాణిజ్యం, పర్యాటకం, పరిశ్రమలు, అత్యవసర సేవలు వంటి రంగాలకు ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. సమగ్ర రవాణా మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమతుల్య ప్రాంతీయ వృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ఆదిలాబాద్ త్వరలోనే దేశ విమానయాన పటంలో కీలక స్థానం దక్కించుకోనుందని మంత్రి అన్నారు.

## బిఆర్‌ఎస్ అసత్య ప్రచారాలు తిప్పికొట్టాలి

కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించండి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ పిలుపు

ఇంటింటి ప్రచారం నిర్వహించిన సిపిఐ నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ శాసన సభ ఉప ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీ అసత్యపు ప్రచారాలను తిప్పికొట్టి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రహమత్ నగర్ డివిజన్‌లో సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపునకు నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీ మరోసారి ప్రజలను మోసం చేయాలని అసత్యపు ప్రచారాలతో ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజలు అవగాహనతో ఉండి, బిఆర్ఎస్ అబద్ధాలను తిప్పికొట్టాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత దశాబ్దంలో బిఆర్‌ఎస్ సంతలో సరుకుల్లాగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, రాజకీయ వ్యవస్థను పరిహాసం చేసిందని మండిపడ్డారు.

ఇప్పటికీ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తూ ఇంకా 500 రోజుల్లో కొత్త ప్రభుత్వం వస్తుందని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు.

అస్థిరత కలిగించే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలే ఎన్నుకున్న ప్రభుత్వాలను కూలదోసే ప్రయత్నం రాజ్యాంగానికి వ్యతిరేక చర్య అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలకు ఓటర్లు తగిన బుద్ధి చెప్పాలని వి.ఎస్.బోస్ విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యుడు నేర్లకంటి శ్రీకాంత్, కౌన్సిల్ సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్, బాలకృష్ణ, గ్యార నరేష్, మహమూద్, అనిల్, సైఫ్, లెనిన్, అశ్వన్, సుశాంత్, భాను, అరుణ్, సాధ్విక్ పాల్గొన్నారు.

## చలనచిత్ర పరిశ్రమలో హైదరాబాద్‌కు విశిష్ట స్థానం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లఘుచిత్రాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యల పట్ల ప్రాథమిక అవగాహనను కల్పించేందుకు లఘుచిత్రాలు ఒక కీలకమైన సాధనంగా మారాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 19వ తేదీ నుండి 21వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ప్రసాద్ ఐమ్యాక్స్‌లో జరగనున్న 'తొలి హైదరాబాద్ అంతర్జాతీయ లఘుచిత్రోత్సవ' లోగోను రాజ్‌భవన్‌లోని గవర్నర్ దర్బార్ హాల్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ అంతర్జాతీయ లఘుచిత్రోత్సవం చీఫ్ ప్యాట్రన్ జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ దర్శకుడు సి.ఉమా మహేశ్వరరావు, లఘు చిత్రోత్సవ నిర్వాహకులు దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిలిం స్టడీస్ ప్రిన్సిపల్ నందన్‌బాబు, తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ హైదరాబాద్ సంస్కృతీ, సాంప్రదాయాలకు 'హైదరాబాద్ అంతర్జాతీయ లఘుచిత్రోత్సవ' లోగో దర్పణం పడుతోందన్నారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో హైదరాబాద్‌కు విశేషమైన స్థానం ఉన్నదని, ఈ లఘుచిత్రోత్సవాల ద్వారా నగరం కొత్తదనాన్ని సంతరించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రియాంక మాట్లాడుతూ దేశంలో ఈ స్థాయిలో లఘుచిత్రాలకు ప్రాధాన్యతనిచ్చి ప్రత్యేకంగా మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఇదే మొదటిదన్నారు.

రానున్న కాలంలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ చలనచిత్ర యవనికలో ఒక ప్రాధాన్యత కలిగిన కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ఈ లఘుచిత్రోత్సవాలు ఉపయోగపడతాయని చెప్పారు. రానున్న కాలంలో భారదేశంలోనే హైదరాబాద్‌ను చలనచిత్ర హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చలన చిత్ర అభివృద్ధి సంస్థ నిర్విరామంగా కృషి చేస్తోందని, దేశంలోనే అత్యధిక సంఖ్యలో ఫిలిం స్క్రీన్లు హైదరాబాద్‌లోనే ఉన్నాయన్నారు.

లఘుచిత్రోత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ లఘు చిత్రోత్సవాలు ఆధునిక ప్రపంచ సంస్కృతితో తెలంగాణ సంస్కృతి పెనవేసుకునేందుకు ఒక వేదికగా ఉంటుందన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో విస్తృతంగా సాంస్కృతిక ఉత్పత్తులు, లఘుచిత్రాలు నిర్మించే యువతకు ఈ ఉత్సవాలు అద్భుతమైన అవకాశాలను కల్పించనున్నాయన్నారు.

## ప్రజోద్యమాలను ప్రజలకు వివరించాలి

సిపిఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ :** ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి అనేక మంది అమరవీరుల త్యాగాలతో పునీతమైన భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి వందేళ్లు పూర్తవుతాయని, శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఊరూరా, వాడ వాడన సిపిఐ జెండాలు ఎగురవేస్తూ పార్టీ నిర్వహించిన ప్రజోద్యమాలను యావన్మంది ప్రజానీకానికి వివరించాల్సిన ఆవశ్యకత సిపిఐ నాయకత్వంపై ఉందని సిపిఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యుల సమావేశం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిందని జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖల్లో ఎర్రజెండాలు ఎగురవేస్తూ ర్యాలీలు, సభలు, సెమినార్లు నిర్వహిస్తూ జనసేవాదళ్ క్యాంపులు నిర్వహించాలన్నారు. రాష్ట్ర పార్టీ వైపున నిర్వహించే జాతను జిల్లాల్లో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పూర్తిగా పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ ప్రజల సొమ్మును ధారాదత్తం చేస్తూ, ప్రజాధనాన్ని మోదీ దుర్వినియోగం చేస్తున్నాడన్నారు. ఆదానీ, అంబానీలకు ఊడిగం చేస్తూ ప్రభుత్వం నుంచి అనేక రాయితీలు ఇస్తున్నాడని, గతంలో 14 లక్షల కోట్ల రూపాయల రుణాలను పెట్టుబడిదారులకు మాఫీ చేశాడని, ఈ మధ్యకాలంలో ఆదానీకి ఎల్ఐసి నుంచి రుణాలు ఇస్తూ ప్రజలు దాచుకున్న సొమ్మును ధనవంతులకు ధారాదత్తం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు వాయిదాలు వేయడం మూలంగా ప్రజల్లో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయని, ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని ప్రజల గందరగోళానికి తెరదీయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ సిపిఐ వందేళ్ల ఉత్సవాలు జిల్లాలో ఘనంగా నిర్వహిస్తామని, డిసెంబర్‌లో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జాతా నిర్వహించి ప్రజల పక్షాన నిలిచి పోరాడేది సిపిఐ అని తెలియజేస్తామన్నారు. జిల్లాలో పార్టీని ప్రజాసంఘాలను బలోపేతం చేయడం కోసం నాయకత్వం కలిసికట్టుగా పనిచేయాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందెస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## రూ.50 కోట్లతో ధర్మపురి ఆలయ అభివృద్ధి



గోదావరి పుష్కరాలకు సకల ఏర్పాట్లు

ఆలయ మాస్టర్ ప్లాన్ సమీక్షా సమావేశంలో మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జగిత్యాల జిల్లాకు చెందిన ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని రూ.50 కోట్లతో సమగ్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గోదావరి పుష్కరాలకు కూడా సంపూర్ణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధర్మపురి ఆలయ మాస్టర్ ప్లాన్‌పై కొండా సురేఖ అధికారులతో సమీక్షా సమావేశం సోమవారం సచివాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఎండోమెంటు డైరెక్టర్ హరీష్, డిపార్టుమెంటు ఉన్నతాధికారులు, ఆలయ ఇఒ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... వందలాది సంవత్సరాలు చరిత్ర గల ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులు ఆగమ శాస్త్రం, వేద పండితులు, స్థానికుల, భక్తులు మనోభావాలకు అనుగుణంగా పునర్నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధర్మపురిలో కొలువైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి స్వయంభు మూర్తి, ఋషులు, దేవతలు సంచరించిన పవిత్ర ప్రాంతం, ఈ అంశం దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. దాంతోపాటు, 2027 జూలైలో రానున్న గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయడానికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**సురేఖ అక్కకు ప్రత్యేక ధన్యవాదాలు**

**మంత్రి అడ్లూరి**

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... తన సొంత నియోజకవర్గంలో కొలువై ఉన్న స్వామివారి ఆలయాన్ని విస్తృతంగా అభివృద్ధి పరుస్తున్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇంత పని ఒత్తిడిలోనూ తమ టెంపుల్ కోసం ప్రత్యేకంగా టైం కేటాయించి... అభివృద్ధి చేపట్టడం సంతోషంగా ఉందన్నారు.

ఈ టెంపుల్ కోసం అయ్యే స్థల సేకరణకి సంబంధించిన అంశాల్లో తాను ప్రత్యేకంగా చొరవ తీసుకుంటానని హామీనిచ్చారు.

## 'స్పీడ్ లాక్' నిబంధనలు ఉల్లంఘిస్తే.. మూడు రెట్లు జరిమానా



'ఎన్‌ఫోర్స్‌మెంట్' క్రియాశీలకంగా వ్యవహరించాలి

'జూమ్ సమావేశం'లో రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాహనాల 'స్పీడ్ లాక్' నిబంధనలను ఉల్లంఘిస్తే మూడు రెట్లు జరిమానాలు విధించాలని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు దాడులు చేయడంకాదని, నిరంతరం యాక్షన్ ప్లాన్ ఉండేలా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. చేవేళ్ల రోడ్డు ప్రమాదం నేపథ్యంలో రవాణా శాఖ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం 'జూమ్' ద్వారా మావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రవాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణ శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జెటిసిలు, డిటిసిలు తదితరులు పాల్గొన్నారు. చేవేళ్ల ప్రమాదంలో రెండు వాహనాలకు ఫిట్‌నెస్ ఉన్నప్పటికీ ఇరుకు రోడ్డు, డివైడర్ లేకపోవడం వల్లనే ప్రమాదం జరిగిందని, అందుకే ప్రమాద తీవ్రత కూడా ఎక్కువగా ఉన్నదని సమావేశంలో చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వాహనాల 'స్పీడ్ లాక్' నిబంధనలు ఎంత వరకు అమలవుతున్నాయనే అంశాన్ని పరిశీలించాలని, దీనిని ఉల్లంఘించిన వారికి మూడు రెట్లు జరిమానా విధించాలన్నారు. రవాణా శాఖ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం క్రియాశీలకంగా, సీరియస్‌గా ఉండాలని ఆదేశించారు. ప్రజలలో రవాణ శాఖ పట్ల గౌరవాన్ని పెంపొందించే విధంగా ఉద్యోగులు పని చేయాలని సూచించారు. అందరూ సమర్ధవంతంగా పనిచేయాలని, నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. రవాణ శాఖ అధికారులు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రతి జిల్లాలో కఠినంగా వ్యవహరిస్తేనే, రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చని సూచించారు. ప్రజలను వేధించకుండా, నిబంధనల ప్రకారం వ్యవహరించాలని మంత్రి పొన్నం ఆదేశించారు. రవాణా శాఖలో కొత్తగా వచ్చిన ఉద్యోగులను సీనియర్లు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు.

**టార్పాలిన్ కప్పాల్సిందే..**

**ధాన్యం వాహనదారులను వేధించొద్దు ...**

టిప్పర్ లారీలు ఇసుకను, డస్ట్‌ను సరఫరా చేసే క్రమంలో వాటిపైన టార్పలిన్‌ను కప్పుకుని తీసుకుపోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. డిటిసి,ఆర్‌టిఒలు ఇతర రవాణా శాఖ అధికారులు ఒక్కో జిల్లాలో మూడు బృందాలుగా ఏర్పడి, నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు దాన్యం తరలింపునకు ఉపయోగించే వాహనాలను వేధింపులకు గురిచేయవద్దని ఆదేశించారు. కమర్షియల్ వాహనాలు, ప్రయాణికులను తరలించే వాహనాలు, మైన్స్ మినరల్స్ తరలించే వాహనాల్లో నిబంధనలు పాటించాలని, లేదంటే ఆ వాహనాలపై భారీగా జరిమానా విధించి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కూల్ బస్ ఫిట్‌నెస్, హయర్ బస్ ఫిట్‌నెస్ ,ట్రక్కులు ,టిప్పర్లు, లారీలు వాటి ఫిట్‌నెస్ ఫర్మిట్‌లపైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

రానున్న 'రహదారుల భద్రత వారోత్సవాల' నేపథ్యంలో రోడ్డు భద్రత పట్ల ప్రజలల్లో మరింత అవగాహనను కల్పించాలని, దీనికి సంబంధించిన కార్యాచరణను రూపొందించుకోవాలని మంత్రి సూచించారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం



ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ధ్వజం

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత విద్యార్థుల చదువులను రోడ్డున పడేసిందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి దుయ్యబట్టారు. పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ కళాశాలల బంద్ చేస్తుండగా ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ కరీంనగర్‌లోని స్థానిక తెలంగాణ చౌక్‌లో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మోకాళ్లపై బిక్షాటన చేస్తూ వినూత్న నిరసన తెలిపారు. ఈ సంధర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన అంటే విద్యార్థులు ఇంటివద్ద ఉండి కళాశాలలకు తాళాలు ఉండడమా? అని ప్రశ్నించారు. ఫీజు బకాయిలపై అసెంబ్లీ సాక్షిగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పారని, సిఎం వద్ద విద్యాశాఖ ఉన్నా ఫీజు బకాయిల కోసం కళాశాలలు బంద్ చేసే పరిస్థితి వచ్చిందన్నారు. రెండు రోజుల్లో ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు రామారపు వెంకటేష్, మచ్చరమేష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ మామిడిపల్లి హేమంత్, కనకం సాగర్, నగర నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, బొల్లి సాయికృష్ణ, విష్ణు, రాజేష్, అవినాష్ తదితరులున్నారు.


హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
hmda Growing Global
స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్-500 038.

బహిరంగ ప్రకటన
ప్రణాళిక విభాగం
No.006333/HMDA/01917/SWFL/GTK/2025

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం గ్రామంలో 54,715.83 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న పై సర్వేనెంబర్లు 46/P, 47/P, 48/Pలలో ఓపెన్ ప్లాట్లలో గతంలో ఆమోదించబడిన డ్రాఫ్ట్ లే అవుట్‌కు సవరణ మరియు తుది లేఅవుట్ కోసం మెస్సర్స్ సికింద్రాబాద్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి శ్రీ విషన్ రాజ్ జైన్ & ఇతరులు దరఖాస్తు చేసుకున్నారని తెలియజేయడమైనది. దీనికోసం లేఅవుట్ నమూనాలో కొన్ని మార్పులు చేసి, స్థల వైశాల్యం మరియు ప్లాట్‌చేసిన ప్రాంతాన్ని 54,559.97 చదరపు మీటర్ల విస్తీర్ణంలో తగ్గించారు. దీనికి డ్రాఫ్ట్ లేఅవుట్ అనుమతి కోసం ఫైల్ నెంబర్ 048012/ZOB/LT/U6/HMDA/05082021 ద్వారా ఆమోదించబడింది.

అందువల్ల రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం గ్రామంలో 54.715.83 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్నటువంటి సర్వేనెంబర్లు 46/P, 47/P, 48/Pలలో ఆమోదించబడిన డ్రాఫ్ట్ లేఅవుట్ అనుమతి యొక్క ప్లాట్ల యజమానులు/ కొనుగోలుదారులు/ అగ్రిమెంట్ హోల్డర్లు, ఈ నోటీస్ ప్రచురించబడిన తేదీ నుండి (15 ) రోజులలోపు ఈ కార్యాలయానికి తమ అభ్యంతరాలు /సూచనలను లిఖితపూర్వకంగా దాఖలు చేయవచ్చు. లేనిపక్షంలో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం గ్రామంలో ఉన్న సర్వే నెంబర్లు 46/P, 47/P & 48/P లలో 54,559.97 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఓపెన్ ప్లాట్లతో ఇంతకు ముందు ఆమోదించబడిన డ్రాఫ్ట్ లేఅవుట్‌కు చేసిన మార్పులకు సంబంధించి ఈ నోటీస్ ప్రచురించబడిన తేదీ నుండి (15)రోజులలోపు ఈ కార్యాలయంలో అందుబాటులో ఉన్న మెటీరియల్ పేపర్ల ఆధారంగా దీనిని పరిగణలోనికి తీసుకొనబడుతుంది.

మీ విశ్వసనీయులు
సం/-మెట్రోపాలిటన్ కమిషనర్ కోసం
హెచ్‌ఎండిఏ.

DIPR R.O. No. : 10164-PP/CL/ADVT/1/2025-26, Date: 03-11-2025


## కాంగ్రెస్ విజయం ఖాయం




టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో గాంధీ భవన్‌లోని ఇందిరా భవన్‌లో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి కొండా సురేఖ, ఎఐసిసి కార్యదర్శులు విశ్వనాథన్, సంపత్ కుమార్, ఎంపిలు, ఎమ్మెల్యేలు, చైర్మన్‌లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, బూత్ పరిశీలకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఎన్నికలలో ఏ నాయకుడు కూడా నిర్లక్ష్యం చేయకూడదని, ఎన్నికల వ్యూహాలు పకడ్బందీగా రూపొందించి, అమలు చేయాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన సూచించారు. రెండు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. ఈ అభివృద్ధిని ప్రజల మధ్య పెద్ద ఎత్తున ప్రచారం చేస్తే విజయం తప్పదన్నారు. ఎన్నికల బాధ్యతలు చేపట్టిన నాయకులు నిర్లక్ష్యం చేయకుండా కృషి చేయాలన్నారు. ఈ వారం రోజులు ఎన్నికల దృష్ట్యా అత్యంత కీలకమని తెలిపారు. ఇంటింటి ప్రచారం, వీధి స్థాయి ప్రచారంలో క్షేత్ర స్థాయిలోకి వెళ్లి ప్రజలను ఆకట్టుకోవాలని ఆయన సూచించారు. ప్రతి నాయకుడు తానే అభ్యర్థి అన్న భావనతో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఫలితం కాంగ్రెస్‌కు అనుకూలంగా రావడం ఖాయమని, ఈసారి మంచి మెజారిటీతో విజయం సాధిస్తామని మహేష్ కుమార్ గౌడ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## జోరుగా జూపల్లి ప్రచారం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయం దగ్గర పడటంతో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జోరు పెంచారు. బస్తీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల్లో తిరుగుతూ.. ఆరు గ్యారంటీలను వివరిస్తూ ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి మంత్రి జూపల్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నారు. పలు కాలనీలు, బస్తీల్లో మంత్రి జూపల్లికి ప్రజలు స్వాగతం పలుకుతున్నారు.

గత బీఆర్ఎస్ పాలనలో చేసిన అరాచకాలను ప్రజలకు తెలియజేస్తున్నారు.

రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన బిఆర్ఎస్ పార్టీకి మరోసారి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిపిస్తే.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నారు. సుల్తాన్‌నగర్‌లోని కల్పతరు రెసిడెన్సీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కల్పతరు నివాసితులను కలిసి.. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. స్పోర్ట్స్ లాంజ్ కు వెళ్లి జిమ్‌లో వ్యాయమం చేశారు. వారితో కలిసి షటిల్ ఆడారు. అనంతరం ఎర్రగడ్డ డివిజన్‌లో రాజీవ్ నగర్ కాలనీ, జయంతి నగర్, కళ్యాణ్ నగర్ వెంచర్ 3 లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ.. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపిస్తే అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని ప్రకటించారు. మంత్రి జూపల్లి వెంట డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రిజిస్ట్రార్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ పిటిషనర్ చేసిన ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఇన్స్‌పెక్టర్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. సబ్ రిజిస్ట్రార్‌కు లంచం కేసులో చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని రాచకొండ డిసిపిని ఆదేశాలు జారీ చేసింది. పిటిషనర్ ఫిర్యాదులోని విషయాలను ధృవీకరించుకోకుండా సివిల్ కేసంటూ ముగించిన సరూర్‌నగర్ సబ్ ఇన్స్‌పెక్టర్ తీరును తప్పుబట్టింది. ఆ ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని స్పష్టం చేసింది. సబ్ రిజిస్ట్రార్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషనర్‌లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీని ప్రతివాదిగా చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించింది. సరూర్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ శ్రీలత పై క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ ఫిర్యాదు చేసినా పోలీసులు ఎఫ్ఐఆర్ చేయడం లేదంటూ చంచల్‌గూడకు చెందిన సుదర్శన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. విచారణ నవంబర్ 14కు వాయిదా వేసింది.

## కొండగల్‌లోని అన్ని ప్రభుత్వ స్కూళ్లలో మధ్యాహ్న భోజనం

### ముందుకొచ్చిన అక్షయ పాత్ర ఫౌండేషన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు అక్షయ పాత్ర ఫౌండేషన్ ముందుకు వచ్చింది. సోమవారం ఉదయం అక్షయ పాత్ర పౌండేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలిశారు. నవంబర్ 14వ తేదీన కొడంగల్ లో నిర్మించ తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ కిచెన్ ప్రారంభోత్సవానికి రావాలని ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు కొడంగల్ సమీపంలోని ఎన్కేపల్లిలో రెండెకరాల విస్తీర్ణంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ గ్రీన్ ఫీల్డ్ కిచెన్ నిర్మించనుంది. గ్రీన్ ఫీల్డ్ కిచెన్ లో వండిన భోజనాన్ని నియోజకవర్గం లోని అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనానికి ఒక్కో విద్యార్థికి రూ.7 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. నాణ్యమైన భోజనం తయారు చేసి అందించేందుకు అక్షయ ఫౌండేషన్ దాదాపు రూ.25 వరకు ఖర్చు పెడుతుంది. ప్రభుత్వం చెల్లించే నిధులకు అదనంగా అయ్యే ఖర్చును అక్షయ పాత్ర ఫౌండేషన్ భరిస్తుంది. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సిఎస్ఆర్) నిధుల సాయంతో ఈ పథకం అమలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ అందించే పథకం విజయవంతంగా అమలవుతుంది. 312 పాఠశాలల్లో దాదాపు 28 వేల మంది విద్యార్థులకు ప్రతి రోజు ఉదయాన్నే అల్పాహారం అందిస్తున్నారు. అన్ని గ్రామాల్లో పిల్లలు, తల్లిదండ్రుల నుంచి ఈ పథకానికి మంచి స్పందన వచ్చింది. ఈ పథకం దేశంలోనే అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.


**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on X @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

**ఓపెన్ ఇ-టెండర్ నోటీసు నం. DRM/Works/BZA/34/2025 తేదీ: 31.10.2025** PUB/1377

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున, క్రింద సంతకం చేసిన వ్యక్తి 15-00 గంటల వరకు మరియు ప్రతిదాని ముందు పేర్కొన్న తేదీ వరకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

క్రమ సంఖ్య:- 1., టెండర్ సంఖ్య:- E-40-East- BZA-2025, పని వివరాలు:- పని పేరు: SW-I: రాయనపాడులోని వాగన్ వర్క్‌షాప్ కాలనీలో క్రికెట్ స్టేడియం కోసం సరిహద్దు గోడకు మరమ్మతులు. SW- II: రాయనపాడులోని వాగన్ వర్క్‌షాప్ కాలనీలో పిచ్‌తో పాటు రైల్వే ఇన్‌స్టిట్యూట్ క్రికెట్ స్టేడియం మైదానానికి మరమ్మతులు. SW-III RYPS- ప్రాథమిక శిక్షణా కేంద్రానికి మౌలిక సదుపాయాల కల్పన., పూర్తి చేయవలసిన కాలం: 06 (ఆరు నెలలు), టెండర్ విలువ: రూ.1,25,54,116.00, E.M.D.: రూ.2,12,800.00, ముగింపు తేదీ: 25.11.2025.

క్రమ సంఖ్య:- 2., టెండర్ నం.:- E-41-EAST- BZA-2025, పని వివరాలు:- పని పేరు: km.66/42-44 వద్ద మిడ్-సెక్షన్ మ్యాన్డ్ LC నం.77, Km.73@ 47"45$44@ LC నం. 83, Km.76/29- 31 వద్ద LC నం.86, GDV-BVRM విభాగంలో Km.87/8-10 వద్ద LC నం.95 యొక్క ప్రతిపాదిత ఇంటర్‌లాకింగ్., పూర్తి చేయవలసిన కాలం: 06 (ఆరు నెలలు), టెండర్ విలువ: రూ. 1,37,91,824.00, E.M.D.: రూ.2,19,000.00, ముగింపు తేదీ: 25.11.2025.

క్రమ సంఖ్య:- 3., టెండర్ నం.:- E-32-సెంట్రల్-BZA-2025, పని వివరాలు:- పని పేరు: BZA డివిజన్: BZA-GDR విభాగం: DEN/సెంట్రల్/BZA పరిధిలోని ADEN/BPP సబ్-డివిజన్‌లోని SSE/ వర్క్స్/BPP విభాగంలో PF1-310x8m, PF2&3-180x15m మరియు PF4&5- 350x15m యొక్క CLX స్టేషన్‌లో COP షెల్టర్ల నిర్మాణం. పూర్తి చేయవలసిన కాలం: 12 (పన్నెండు నెలలు), టెండర్ విలువ: రూ.8,35,90,917.00, E.M.D.: రూ.5,68,000.00, ముగింపు తేదీ: 25.11.2025.

క్రమ సంఖ్య:- 4., టెండర్ నం.:- E-42-EAST- BZA-2025, పని వివరాలు:- పని పేరు: SW-I: GDV-BVRM విభాగం: SSE/P.Way/KKLR అధికార పరిధి: వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతకు సంబంధించిన యార్డు మెరుగుదల & అప్‌గ్రేడేషన్ పనులు. SW-II: BVRM-NDD విభాగం SSE/P.Way/TNKU అధికార పరిధి: వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతకు సంబంధించిన యార్డు మెరుగుదల & అప్‌గ్రేడేషన్ పనులు. SW-III: BVRM-NS విభాగం: SSE/P.Way/BVRM అధికార పరిధి: వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతకు సంబంధించిన యార్డు మెరుగుదల & అప్‌గ్రేడేషన్ పనులు. SW-IV: GDV-MTM విభాగం: SSE/P.Way/MTM అధికార పరిధి: వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతకు సంబంధించిన యార్డు మెరుగుదల & అప్‌గ్రేడేషన్ పనులు., పూర్తి చేయవలసిన కాలం: 12 (పన్నెండు నెలలు), టెండర్ విలువ: రూ.6,70,24,658.00, E.M.D.: రూ.4,85,100.00, ముగింపు తేదీ: 25.11.2025.

1. టెండర్ నిబంధనలు / పూర్తి పని పేరు వివరాలు, పైన పేర్కొన్న పనుల సారూప్యత, అర్హత ప్రమాణాలు మొదలైన ఇతర వివరాలు "www.ireps.gov.in" వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి.
2. కాబోయే టెండరుదారులు ఏదైనా టెండర్‌కు సంబంధించిన ఏవైనా మార్పులు/ కొరిజెండాను గమనించడానికి టెండర్ ముగింపు తేదీకి ముందు "www.ireps.gov.in" వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించడమైనది.
3. టెండర్ నోటీసు విజయవాడ డివిజన్‌లోని డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), ఎస్.సి. రైల్వే, విజయవాడ మరియు ADEN సబ్-డివిజనల్ కార్యాలయాలలో ఉన్న నోటీసు బోర్డులో కూడా ప్రదర్శించబడింది, దీనిని చూడవచ్చు.
4. ఎటువంటి కారణం చూపకుండా టెండర్‌ను రద్దు చేసే హక్కు రైల్వేకు ఉంది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), విజయవాడ

**ఇ-టెండర్ నోటీసు నం. 40-2025 తేదీ: 31/10/2025** PUB/1378

భారత రాష్ట్రపతి తరపున మరియు ఆయన తరపున వ్యవహరించే సీనియర్ డివిజనల్ ఇంజనీర్/ కోఆర్డినేషన్/ గుంతకల్ ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు

**ముగింపు తేదీ & సమయం: 27.11.2025 మధ్యాహ్నం 15:00 గంటలకు**

క్రమ సంఖ్య:- 1, టెండర్ నం.:- ఇంజనీరింగ్-జిటిఎల్- సౌత్-1985, పని వివరణ: గుంతకల్ డివిజన్: RU-GY విభాగం: HAQ యార్డ్ స్టేషన్ల మధ్య 1x6.00x5.00 మీటర్ల RCC బాక్స్ బై బాక్స్ పుషింగ్ పద్ధతిలో km 215/3-5 వద్ద LC నం.110 స్థానంలో రోడ్ అండర్ బ్రిడ్జి (సబ్‌వే) నిర్మాణాన్ని ప్రతిపాదించారు. (బాక్స్ ఇప్పటికే వేయబడింది)., ప్రకటించిన విలువ రూ.: 7,72,70,276.22, బిడ్ సెక్యూరిటీ మొత్తం రూ.: 5,36,400.00

క్రమ సంఖ్య:- 2, టెండర్ నెం.:- ఇంజనీరింగ్-జిటిఎల్- నార్త్-1986, పని వివరణ: గుంతకల్ డివిజన్- ఆదోని, మంత్రాలయం రోడ్, రాజంపేట, తాడిపత్రి, గూటి, ధోన్ మరియు పాకాల స్టేషన్లలో లిఫ్టుల ఏర్పాటుకు సివిల్ పనులు. మంత్రాలయం రోడ్, ధోన్ మరియు తాడిపత్రి స్టేషన్లలో 12M FOBకి ఎస్కలేటర్ల ఏర్పాటుకు సివిల్ పనులు., ప్రకటించిన విలువ రూ.: 11,76,44,362.79, బిడ్ సెక్యూరిటీ మొత్తం రూ.: 7,38,200.00

ఏదైనా కొరిజెండా ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది.

డివిజనల్ రైల్వే మేనేజర్/వర్క్స్/ గుంతకల్

**టెండర్ నెం. 2x25 KV-OHE-GTL-HX, తేదీ:01.11.2025.** PUB/1379

భారత రాష్ట్రపతి మరియు వారి తరపున, సికింద్రాబాద్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) ఈ క్రింది పనుల కోసం (ఆన్‌లైన్) ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు

క్రమ సంఖ్య:- 1, టెండర్ నెం.: No.2x25 KV-OHE-GTL-HX, dt.01.11.2025, పని వివరణ: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంతకల్ డివిజన్‌లోని గుంతకల్ (Excl)-కడప (Incl) విభాగంలో ఫీడర్ మరియు ఎర్తింగ్ పనులతో ఉన్న 1x25kV వ్యవస్థను 2x25kV AT ఫీడింగ్ సిస్టమ్‌కు OHE అప్‌గ్రేడేషన్ కోసం డిజైన్, సరఫరా, నిర్మాణం, పరీక్ష మరియు కమిషనింగ్. మొత్తం 184 RKM/ 368 TKM., సుమారు విలువ: రూ. 181,83,27,695.03, ఎర్నెస్ట్ మనీని ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి: రూ.92,41,600.00, టెండర్ ఫారమ్ ధర రూ.లలో: లేదు, పూర్తి చేయవలసిన కాలం: 24 నెలలు (ఇరవై నాలుగు నెలలు), టెండర్ ప్రారంభ స్థలం: సికింద్రాబాద్.

ఇ-టెండర్ (ఆన్‌లైన్) ద్వారా టెండర్ ముగింపు: సమయం: 15.00 గంటలు, తేదీ: 24.12.2025, ఇ-టెండర్ ద్వారా టెండర్ తెరవడం (ఆన్‌లైన్) సమయం: 15.30 గంటలు, తేదీ: 24.12.2025

టెండర్ ప్రారంభ తేదీని తరువాతి తేదీన సెలవు దినంగా ప్రకటిస్తే, టెండర్లు తదుపరి పని దినాన నిర్ణీత సమయంలో తెరవబడతాయి.

మరిన్ని టెండర్ షరతులు/ వివరాలు మరియు టెండర్ల సమర్పణ కోసం, దయచేసి మా వెబ్‌సైట్ www.ireps.gov.in ని సందర్శించండి

గమనిక: టెండర్ పత్రాలు/కొరిజెండమ్/ అనుబంధంలో ఏవైనా మార్పులు అవసరమైతే పై వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయబడతాయి.

A1747 చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), సికింద్రాబాద్

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.


## స్థానిక ఎన్నికలపై వివరణ ఇవ్వండి

### ప్రభుత్వాన్ని కోరిన హైకోర్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పదవీ కాలం ముగిసిన స్థానిక సంస్థల పదవులకు ఎప్పటిలోగా ఎన్నికలు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని హైకోర్టు వివరణ కోరింది. గతంలోనే ఆదేశించినప్పటికీ ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు ఏమిటో చెప్పాలంది. రాజ్యాంగంలోని అధికరణ 243(ఇ) ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని తాము మధ్యంతర ఆదేశాలు ఇచ్చామని గుర్తు చేసింది. విచారణను 24కు వాయిదా వేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తోందని కూడా చెప్పింది. ఈ విషయం తెలిసి కూడా ఎందుకు స్పష్టత ఇవ్వడంలేదని ప్రశ్నించింది. పెంచిన రిజర్వేషన్లను రద్దు చేసిన నేపథ్యంలో ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 24కి వాయిదా వేస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి ఎం మొహియుద్దీన్ల డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఎన్నికల నోటిఫికేషన్ను నిలిపివేస్తూ గత నెల 3న ఈఎన్సీ జారీ చేసిన ప్రొసీడింగ్స్ మంచిర్యాల జిల్లా లక్సెట్టిపల్లి మండలానికి చెందిన ఆర్ సురేందర్ దాఖలు చేసిన పిటిషనర్ లాయర్ వాదించారు. పంచాయతీ పాలకవర్గాల గడువు గత ఏడాది జనవరితో ముగిసిందన్నారు. ఏడాదిన్నర దాటినా ఎన్నికలు నిర్వహించకపోవడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ఎన్నికలు నిర్వహించాలని సింగిల్ జడ్జి, ద్విసభ్య ధర్మాసనం ఆదేశాలిచ్చిందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తరపు సీనియర్ న్యాయవాది జి విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను హైకోర్టు రద్దు చేసిన తర్వాత బీసీలకు 25 శాతం రిజర్వేషన్ల చొప్పున కేటాయిస్తూ రిజర్వేషన్ల కేటాయింపు జరిపి జాబితా అందిస్తే ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. పాలకవర్గాల గడువు ముగిసిన 6 నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. సెప్టెంబరు 30లోగా ఎన్నికలు నిర్వహించాలన్న జూన్ 25నాటి సింగిల్ జడ్జి ఉత్తర్వుల నేపథ్యంలో నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. అయితే 42 శాతం బీసీ రిజర్వేషన్లను ఈ కోర్టు రద్దు చేసిందని, దీంతో పాత రిజర్వేషన్ల ప్రకారం ప్రభుత్వం పంచాయతీలు, వార్డులు కేటాయింపు జరిపి జాబితా ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రభుత్వ న్యాయవాది షాజియా పర్వీన్ వాదనలు వినిపిస్తూ ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దీనిపై తర్జనభర్జన చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో నిర్ణయం తీసుకుంటుందని, వారం గడువు మంజూరు చేస్తే పూర్తి వివరాలు నివేదిస్తామన్నారు. వాదనల స్పందించిన హైకోర్టు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రద్దు చేసిన విషయంతోపాటు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలిచ్చామని గుర్తు చేసింది ప్రభుత్వం కోరినట్లుగా వారం గడువు ఇవ్వడానికి అభ్యంతరంలేదని అయితే ఎన్నికలను ఎప్పుడో చెప్పాలంది. విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది.

## ఆర్‌టిసి ప్రయాణికులకు ఎదీ బీమా!

### నష్టపరిహారంతోనే సరి
### ఆర్థిక భారంతో బీమా సౌకర్యాన్ని పక్కన పెట్టిన ఆర్‌టిసి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం అంటే సేఫ్ అనుకునే ప్రజలు.. ఖానాపూర్ గేట్ సమీపంలోని మీర్జాగూడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంతో కుదేలయ్యారు. ప్రమాదంలో మరణాలు, గాయాలు సంభవించడంతో ప్రయాణికుల భద్రత, బీమా సదుపాయం అంశం మళ్లీ చర్చనీయాంశమైంది. ప్రతి టికెట్‌పై రూ.1 'సేఫ్టీ సెస్' వసూలు చేస్తున్నా.. అది బీమా కాదు. కేవలం ఎక్స్‌గ్రేషియా ఫండ్ మాత్రమే. అంటే ప్రమాదం జరిగితే బీమా కంపెనీ నుంచి నష్టపరిహారం రాదు. ఆర్‌టిసి లేదా ప్రభుత్వం తమ వంతుగా సాయంగా మాత్రమే చెల్లిస్తుంది. మోటార్ వెహికిల్ యాక్ట్1988 ప్రకారం ప్రైవేట్ బస్సులు, ట్రావెల్స్ వాహనాలు తమ ప్రయాణికులకు తప్పనిసరిగా బీమా కల్పించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వ రవాణా సంస్థలకు మాత్రం ఈ నిబంధన వర్తించదు. ఈ విషయంపై ప్రస్తుతం ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేట్ బస్సు ప్రయాణికులకు బీమా ఉంటే, ప్రభుత్వ బస్సు ప్రయాణికులకు ఎందుకు ఉండకూడదు? అని నిలదీస్తున్నారు. ఆర్‌టిసి అధికారులు మాత్రం రాష్ట్రవ్యాప్తంగా 10 వేలకుపైగా బస్సులు నడుస్తుండగా, వాటన్నింటికీ బీమా ప్రీమియం చెల్లించడం సంస్థకు భారీ ఆర్థిక భారం అవుతుందంటున్నారు. 2010లోనే టికెట్ ధరలో రూ.2 నుంచి రూ.5 అదనంగా వసూలు చేసి బీమా సదుపాయం కల్పించాలని ఆలోచించినప్పటికీ, వివిధ కారణాలతో అది అమలు కాలేదు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రయాణికులకు ఎక్స్‌గ్రేషియా సాయం మాత్రం అందజేస్తున్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు ప్రభుత్వం నుంచి, రూ.3 నుంచి రూ.5 లక్షలు ఆర్‌టిసి ఫండ్ నుంచి, మొత్తంగా రూ.8 నుంచి రూ.10 లక్షల వరకు పరిహారం చెల్లిస్తున్నారు. తాజా ప్రమాదం జరిగిన వెంటనే సిఎం రేవంత్ రెడ్డి స్పందించి, సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.2 లక్షల తక్షణ సాయాన్ని ప్రకటించారు. మీర్జాగూడ వద్ద జరిగిన ఘోర రోడ్డు తరువాత ఆర్‌టిసి బస్సుల్లో కూడా ప్రయాణికులకు తప్పనిసరి బీమా సదుపాయం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా ముగిసిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ గత నెల 28 నుంచి నవంబర్ 2 వరకు ఘనంగా విజిలెన్స్ వారోత్సవాలను నిర్వహించింది.' మనందరి భాగస్వామ్య బాధ్యత' అనే థీమ్‌తో వారం రోజుల క్రితం బిఆర్‌కె భవన్‌లోని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రధాన కార్యాలయంలో డిజి శిఖాగోయల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా విజిలెన్స్ విభాగం అధికారిక లోగోను ఆవిష్కరించారు. ఈ లోగో నిజాయితీ, పారదర్శకత, మరియు జవాబుదారీతనంకు ప్రతీకగా నిలిచింది. పౌరులు ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ (14432) సైతం ఈ వారోత్సవాలలో ప్రారంభించారు. దీంతో పాటు అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్ @tgvigenfo, X తో పాటు ఇన్‌స్టాగ్రామ్‌ను కూడా ప్రారంభించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో అందరికి అవగాహన కల్పించేందుకు వాల్ పోస్టర్లను సైతం ఆవిష్కరించారు.ఈ వారోత్సవాలలో భాగంగా హైదరాబాద్ సిటీI, హైదరాబాద్ సిటీII, హైదరాబాద్ రూరల్, ఆర్‌సి పురం, కరీంనగర్, నల్గొండ, వరంగల్ యూనిట్లకు చెందిన రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించి, సమాజంలోని అన్ని వర్గాలను ఇందులో భాగస్వాములను చేశారు. వివిధ జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లో విజిలెన్స్ అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్లు, ఎస్పిలు, ఇతర జిల్లా అధికారులు విజిలెన్స్ ప్రతిజ్ఞను చేయించారు. నాబార్డ్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వంటి సంస్థల్లో నైతిక విధానాలు, పారదర్శకతను ప్రోత్సహించే కార్యక్రమాలను నిర్వహించారు.

## మహిళల క్రికెట్ విజయం

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐసిసి మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్ లో చారిత్రాత్మక విజయం సాధించిన భారత మహిళా క్రికెట్ జట్టును తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఎఐకెఎస్) గర్వంగా అభినందించింది. ప్రారంభ మ్యాచ్ నుండి జట్టు విజయం వరకు ఒత్తిడిలో జట్టు అచంచలమైన సంకల్పం, క్రమశిక్షణ, పోరాట పటిమను ప్రదర్శించిందని రైతు సంఘం పేర్కొన్నది. మహిళల జట్టు ప్రదర్శన భారతదేశానికి అపారమైన గర్వాన్ని తెచ్చిపెట్టడమే కాకుండా దేశం అంతటా లక్షలాది మంది యువతులు పెద్ద కలలు కనడానికి, క్రీడలలో రాణించడానికి ప్రేరణనిచ్చిందని రైతు సంఘం కొనియాడింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, కోశాధికారి డి.జి.నరేందర్ ప్రసాద్ సోమవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. మహిళల క్రికెట్ జట్టు విజయం దేశంలో మహిళల క్రికెట్ సుదీర్ఘ సంవత్సరాల అంకితభావం, నిరంతర అభివృద్ధికి నిదర్శనమన్నారు. మహిళల క్రికెట్‌కు మరింత ప్రకాశవంతమైన భవిష్యత్తును అందించడానికి ఈ విజయం దోహదపడుతుందని, దేశ ప్రజలు, తెలంగాణ రాష్ట్ర యువత ఈ కీర్తి క్షణాన్ని జరుపుకుంటున్నందున త్రివర్ణ పతాకం గర్వంగా ఎగురుతుందన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో.. వృద్ధులు, వికలాంగులకు హోమ్ ఓటింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక హోమ్ ఓటింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి పి. సాయి రాం ప్రకటించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు, 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వికలాంగత కలిగిన ఓటర్లు (వోటర్ లిస్టులో నమోదు చేసిన వారు) తమ ఇంట్లోనే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సదుపాయం కోసం ముందుగా దరఖాస్తు చేసిన మొత్తం 103 మంది ఓటర్లకు మాత్రమే ఈ అవకాశం కల్పించామన్నారు. వీరిలో 84 మంది వృద్ధులు, 19 మంది వికలాంగులు ఉన్నారని తెలిపారు. ఈ సదుపాయం నవంబర్ 4, 6 తేదీల్లో రెండు రోజులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఎన్నికల సిబ్బంది అర్హులైన ఓటర్ల ఇళ్లకు వెళ్లి, వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తారని రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. ఓట్లను సేకరించిన అనంతరం యూసఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో భద్రపరచనున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 85 ఏళ్లకు పై బడిన ఓటర్లు 2,134 ఉండగా, వికలాంగ ఓటర్లు 1,908 మంది ఉన్నారు. హోమ్ ఓటింగ్‌పై అవగాహన, ప్రచారం చేయకపోవడంతో వృద్ధులు, వికలాంగులు తక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. జూబ్లీహిల్స్‌లో మొత్తం 4 లక్షల 13వందల 65 ఓటర్లు ఉన్నారు. వీరిలో 2 లక్షల8 వేల 561 పురుష ఓటర్లు, లక్షా 92వేల779 మహిళల ఓట్లు, 25 ఇతరుల ఓట్లు ఉన్నాయి.

## 'పత్తి కొనుగోలు'లో తేమ ప్రమాణాల్లో సడలింపు ఇవ్వండి...

### కేంద్ర మంత్రికి కల్వకుంట్ల కవిత లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో 'మొంథా తుఫాన్' ప్రభావంతో పత్తి కొనుగోలులో తేమ ప్రమాణాల్లో సడలింపు ఇవ్వాలని కేంద్ర టెక్స్‌టైల్ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపి కల్వకుంట్ల కవిత కోరారు. ఈ మేరకు ఆమె కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు సోమవారం లేఖ రాశారు. మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో అత్యధిక వర్షపాతం, వరదలు సంభవించి వ్యవసాయ పంటలు, మౌలిక సదుపాయాలు, రైతుల జీవనాధారాలపై తీవ్ర నష్టం కలిగించిందని కవిత వివరించారు. ఇటువంటి అసాధారణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం అమలులో ఉన్న తేమ ప్రమాణాల్లో సడలింపు ఇవ్వాలని, ప్రస్తుత పత్తి కొనుగోలు సీజన్ ముగిసే వరకు లేదా ప్రభావితమైన పత్తి నిల్వలను సరిగా ఆరబెట్టేంత వరకు 25 శాతం తేమ ఉన్న పత్తిని కూడా కొనుగోలు చేయడానికి అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

## తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో పంట, ఆస్తి నష్ట నివారణా చర్యలు చేపట్టాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మొంథా తుపానుతో ప్రభావితమైన జిల్లాల్లో పంట, ఆస్తి నష్ట నివారణా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణ ఈ నెల 17కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఆదేశించినా రాష్ట్ర ప్రభుత్వం విపత్తు నిర్వహణా చట్టం ప్రకారం చర్యలు చేపట్టడంతో విఫలమైందంటూ.. గతంలో దాఖలైన పిల్లో నల్లగొండ జిల్లా నకిరేకల్కు చెందిన చెరుకు సుధాకర్ మెమో దాఖలు చేశారు.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది.. వరంగల్, హన్మకొండ జంట నగరాలు 48 గంటలపాటు పూర్తిగా ముంపులోనే ఉన్నాయన్నారు. తాగునీరు, ఆహారం, ప్రాథమిక వైద్యం కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం తరపున ఏజీపీ.. ప్రభుత్వం నుంచి వివరాలు పొంది సమర్పించేందుకు రెండు వారాలు సమయం కావాలని కోరగా, విచారణ వాయిదా వేసింది.

## బిఆర్‌ఎస్‌కు భూకేటాయింపుపై కౌంటర్ దాఖలు చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట సర్వే నెం. 239, 240లో బిఆర్‌ఎస్ పార్టీకి 11 ఎకరాల భూ కేటాయింపును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రెండు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశించింది. బిఆర్‌ఎస్‌కు 2023లో భూమి కేటాయింపును సవాలు చేస్తూ ఫోరం ఫర్ గుడ్‌గవర్నెన్స్ కార్యదర్శి ఎం పద్మనాభ రెడ్డి గత ఏడాది ఎం.వెంకటరామిరెడ్డి దాఖలు చేసిన పిల్ను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం మొహియుద్దీన్లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. మార్కెట్ విలువ ప్రకారం రూ.500 కోట్ల విలువైన 11 ఎకరాల భూమిని కేవలం రూ.37 కోట్లకే కేటాయింపు చేయడం అన్యాయమని పిటిషనర్ న్యాయవాది వాదించారు. కౌంటరు దాఖలుకు గడువు కావాలని అదనపు అడ్వొకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ కోరడంతో విచారణ డిసెంబరు 10వ తేదీకి వాయిదా వేసింది.

## మూడు రోజులు మోస్తరు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆదివారం విదర్భ, ఆ పరిసర ప్రాంతంలో కొనసాగిన ఉపరితల ఆవర్తన ద్రోణి సోమవారం నాటికి బలహీనపడింది. ఈ కారణంగా తెలంగాణలోని పలు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే హైదరాబాద్ నగరంతో సహా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం సమయంలో హైదరాబాద్‌లో అకస్మాత్తుగా వర్షం కురిసింది. దీంతో వాహనదారులు ట్రాఫిక్‌లో ఇబ్బందులు పడ్డారు. మంగళ, బుధ వారాల్లో కూడా రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. అలాగే మరికొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులు, 30 నుంచి 40 కి.మీ. వేగం కలిగిన ఈదురు గాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందన్నారు. రాబోయే 48 గంటలు రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై, కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉపరితల గాలులు ఉత్తర దిశ నుంచి గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని చెప్పారు. ఈనెల 4న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

## రైళ్ల భద్రతపై జిఎం సమీక్ష




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, ప్రధాన విభాగాధిపతులతో కలిసి జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై వివరణాత్మక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజనల్ రైల్వే మేనేజర్లు (డి.ఆర్.ఏంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్త భద్రతా సమీక్ష సందర్భంగా మాట్లాడుతూ..భద్రతా అవగాహనను మరింత పెంపొందించడానికి, రైలు కార్యకలాపాలను మెరుగుపరచడానికి నాన్‌ఇంటర్‌లాకింగ్ గేట్ల వద్ద ప్రత్యేక భద్రతా డ్రైవ్ నిర్వహించాలని డివిజన్ల అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా, శీతాకాలంలో రైలు కార్యకలాపాలు సజావుగా జరిగేలా శీతాకాల సంసిద్ధత డ్రైవ్ ను చేపట్టాలని జనరల్ మేనేజర్ అధికారులకు సూచించారు. జోన్ అంత టా పొగ మంచు భద్రతా పరికరాల నిల్వల స్థితిని కూడా ఆయన సమీక్షించి పొగ మంచు పరిస్థితుల దృష్ట్యా అవసరమైన పరికరాలను తగినంత నిల్వలను ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. జనరల్ మేనేజర్ ఇంజనీరింగ్, మెకానికల్, సిగ్నల్, టెలికమ్యూనికేషన్ మరియు ఎలక్ట్రికల్ వంటి వివిధ విభాగాలకు సంబంధించిన భద్రతా కార్యాచరణ ప్రణాళికల ను సమీక్షించారు. గూడ్స్ షెడ్‌లలో సిసిటివిల ఏర్పాటు స్థితిని ఆయన సమీక్షించారు మరియు పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సిబ్బంది పనివేళల గురించి కూడా చర్చిస్తూ విశ్రాంతి సమయాన్ని మరింత మెరుగుపరచడానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఈ నెల 7న 'చలో ఢిల్లీ':మందకృష్ణ

**పజాపక్షం/హైదరాబాద్:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పైన జరిగిన అమానుష దాడికి నిరసనగా ఈ నెల 17న 'చలో ఢిల్లీ' పేరుతో లక్షలాది మందితో దళితుల ఆత్మగౌరవ ర్యాలీని నిర్వహిస్తామని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ తెలిపారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ జస్టిస్ గవాయ్ పైన దాడి జరిగిన నేపథ్యంలో దేశ భక్తులు ఎవరో?,దేశ ద్రోహులు ఎవరో విస్తృతంగా చర్చ జరగాలన్నారు. దేశంలో ఉంటూ భారత రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ, రాజ్యాంగాన్ని ధిక్కరిస్తున్న వారు దేశద్రోహులని ధ్వజమెత్తారు. ధర్మం కోసమే దాడి చేశానని నిందితుడు బహిరంగంగా చెబుతుంటే, ఈ దాడిని కొంతమంది సమర్థిస్తూ ఇంకా దాడులు చేస్తామని మాట్లాడుతున్నప్పటికీ, వ్యవస్థలు మౌనం వహించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ధర్మం ముసుగులో దాడులు చేస్తే చట్టపరమైన చర్యలు ఉండవా?, కేసులు నమోదు చేయరా?, అలాంటి వారిని అరెస్టు చేయరా? శిక్షలు విధించరా? అని అన్నారు. ఈ దాడి జరిగి నెల రోజులు అవుతున్నప్పటికీ చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం అత్యంత దారుణమన్నారు. దేశ ప్రజలంతా ఈ దారుణాన్ని ఖండించినప్పటికీ చట్ట పరమైన వ్యవస్థలు మాత్రం ఈ ఘటనను కనీసం సుమోటోగా కూడా స్వీకరించలేదని,దళితులను చిన్నచూపు చూశాయని ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు, న్యాయవ్యవ స్థ, జాతీయ మానవ హక్కుల కమిషన్ ఈ దాడిని సుమోటోగా ఎందుకు స్వీకరించలేదని ప్రశ్నించారు. ధర్మాల పేరుతో దాడులు చేస్తామంటే , రాజ్యాంగాన్ని విధ్వంసం చేస్తామంటే సహించబోమని మందకృష్ణ మాదిగ హెచ్చరించారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఏ ప్రధానీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చూడలే: తేజస్వీ

**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన 'కట్టా' వ్యాఖ్యలపై ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు. ఇంతకు ముందు ఏ ప్రధాని కూడా ఇలాంటి పదాలు వాడడం తాను చూడలేదన్నారు. ఇండియా కూటమి ముఖ్యమంత్రిగా యాదవ్‌ను అంగీకరించడానికి కాంగ్రెస్ ఇష్టపడలేదని, ఆర్‌జెడి 'కట్టా' అనే దేశంలో తయారు చేసిన తుపాకీని ఎక్కుపెట్టిన తర్వాతే వెనక్కి తగ్గిందని మోదీ ఆదివారం పేర్కొన్నారు. దీనిపై సోమవారం తేజస్వీ స్పందిస్తూ ప్రధాని వ్యాఖ్యపై తాను ఏమీ మాట్లాడనని, దేశంలోని ఏ ప్రధానమంత్రి కూడా అలాంటి పదాలు వాడటం ఎప్పుడూ వినలేదన్నారు. ఇది ఆయన ఆలోచనా విధానాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ప్రధాని గుజరాత్‌కు వెళ్లినప్పుడల్లా ఐటి ఫ్యాక్టరీలు, సెమీకండక్టర్ యూనిట్లు, డేటా సెంటర్ల గురించి మాట్లాడు తారు... కానీ ఆయన బిహార్‌కు వచ్చినప్పుడు 'కట్టా' గురించి మాట్లాడుతారని ఆరోపించారు.

## మోదీ 'అపమాన్ మంత్రాలయ'ను సృష్టించాలి

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ఎద్దేవా
### 20 ఏళ్లు ఎన్‌డిఎ పాలనలో బిహార్‌కు చేసిందేమీలేదని మండిపాటు




**సహర్సా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ పోలింగ్ మరో రెండు రోజుల్లో జరగనుండడంతో ఈ ప్రాంతాల్లో ప్రచారం ముగింపు దశకు చేరుకుంది. ప్రచారంలో భాగంగా అధికార, ప్రతిపక్ష కూటముల అగ్రనేతలు ఒకరిపై ఒకరు మాటల యుద్ధానికి దిగారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ, ప్రధాని నరేంద్రమోదీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రతిపక్ష నాయకులు దేశాన్ని బిహార్‌ను అవమా నించారని ప్రధాని మోదీ ఆరోపించడంపై తీవ్రంగా మండిప డ్డారు. ఆయన 'అపమాన్ మంత్రాలయ' (అవమానాల మంత్రిత్వ శాఖ)ను సృష్టించాలని ఎద్దేవా చేశారు. సోమవారం బిహార్ సహర్సా జిల్లాలోని సోనాబర్సాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రధానమంత్రికి తరచూ వాస్తవ సమస్యల నుండి తప్పుకోవడం అలవాటుగా మారిందని విమర్శించారు. బిహార్‌లో గత రెండు దశాబ్దాల పాలనలో ఎన్‌డిఎ చేసిన అభివృద్ధి గురించి, ఆ కూటమి చేసిన పనులపై చెప్పాల్సిది పోయి ప్రతి ప్రతిపక్ష నాయకుడు దేశాన్ని, తూర్పు రాష్ట్రాన్ని అవమానించారని వ్యాఖ్యలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆయన కొత్త మంత్రిత్వ శాఖ 'అపామాన్ మంత్రాలయ' ఏర్పాటు చేయాలని, ఎందుకంటే ఆయన ప్రభుత్వం దానిపైనే ఎక్కువగా దృష్టి సారించినట్లు కని పిస్తోందని ఆమె వ్యంగ్యానించారు. కాంగ్రెస్–ఆర్‌జెడి కూటమి ఛట్ పూజను అవమానించిందని, అయోధ్యలోని రామమందిరం నిర్మాణంలో సమస్యలను సృష్టించిందని, బుజ్జ గింపు రాజకీయాల కోసం చొరబాటుదారులను రక్షించిందని మోదీ ఆరోపిచండంపై ప్రియాంక గాంధీ స్పందించారు. బిహార్ వాస్తవ సమస్యల కంటే రాజకీయ వాక్చాతుర్యంపై ప్రధాని దృష్టి సారించారని వాద్రా ఆరోపించారు. బిహార్ ప్రభుత్వం 'ఢిల్లీ నుండి రిమోట్ కంట్రోల్' అవుతోందని, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఒక వ్యక్తి స్థాయికి దిగజారారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ లకు వ్యతిరేకంగా ఓటర్లను హెచ్చరిస్తూ, నగదు ప్రోత్సాహ కాలు లేదా తాత్కాలిక ప్రయోజనాల ద్వారా ప్రభావితం కావ ద్దని వాద్రా కోరారు. 'ఎన్నికలకు ముందు వారు మీకు ఇచ్చే రూ. 10,000 తీసుకోండి... ఇది మీ డబ్బు కానీ, వారికి మీ ఓటు వేయకండి' అని పేర్కొన్నారు. ఓటు హక్కు భారతదేశ ప్రజాస్వామ్యానికి కేంద్ర బిందువు అని, దానిని ఎన్‌డిఎ అణ గదొక్కడానికి ప్రయత్నిస్తోందని హెచ్చరించారు. ఎస్‌ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్నికల జాబితా కింద బిహార్ అంతటా లక్షల ఓట్లు కత్తిరించబడ్డాయన్నారు. ఎన్‌డిఎ ఓటు హక్కును లాక్కుంటోందని, బిహార్ ప్రజలు ఇటువంటి అన్యా యాన్ని సహించబోరని హెచ్చరించారు. పాలన, అభివృద్ధి గురించి మాట్లాడుతూ బిజెపి నేతృత్వంలోని కూటమి రాష్ట్రంలో 20 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పటికీ పెద్దగా ఒరిగిందేమీ లేదని వాద్రా అన్నారు. పాలక సంకీర్ణం పారిశ్రా మిక వృద్ధిని విస్మరించిందని, బిహార్ యువత ఉద్యోగాల కోసం వలస వెళ్లేలా పరిస్థితులను సృష్టించిందని ఆమె ఆరో పించారు. 20 సంవత్సరాలు ప్రభుత్వాన్ని నడిపిన తర్వాత, వారు ఇప్పుడు ఉపాధి కల్పిస్తామని చెబుతున్నారని, ఇప్పటివ రకు ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. బిజెపి అగ్ర నాయ కత్వంపై విమర్శలు గుప్పిస్తూ, మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గతం లేదా సుదూర భవిష్యత్తుతో నిమగ్నమై ఉన్నారు కానీ ప్రజల ప్రస్తుత కష్టాలను పరిష్కరించడంలో విఫ లమయ్యారని అన్నారు. బిహార్ విపరీతమైన నిరుద్యోగం, వల సలు, కార్పొరేట్ ఆశ్రితులకు అప్పగించబడిన ప్రభుత్వ రంగ పరిశ్రమల మూసివేతను ఎదుర్కొందని, ఇది రెండు దశాబ్దాల ఎన్‌డిఎ పాలన వారసత్వమని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## అభివృద్ధికి ఎన్‌డిఎ అండ

బిహార్‌లో ప్రతిపక్ష కూటమిపై మోదీ విమర్శలు

### విధ్వంసానికి ఆటవికులు ఆరాటం



**సహర్సా :** ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచార ర్యాలీల్లో ఆర్‌జెడిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 2005లో కేంద్రంలోని కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బిహార్‌లో అభివృద్ధి ప్రాజెక్టులను నిలిపివేసిం దని ఆరోపించారు. సోమవారం ఉత్తర బిహార్ జిల్లా సహ ర్సాలో జరిగిన ర్యాలీలో పాల్గొని ప్రసంగిస్తూ, ఆర్‌జెడి తన తలపై 'కట్టా' లేదా చట్టవిరుద్ధమైన దేశీయ తయారీ తుపా కీని ఉంచిన తర్వాత, తేజస్వీ యాదవ్‌ను ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడానికి కాంగ్రెస్ అయిష్టంగానే అంగీకరించిందని మోదీ పునరుద్ఘాటించారు. ఆర్‌జెడి చేసిన పాపాలకు ఆ పార్టీకు గుణపాఠం చెప్పాలని మోదీ ప్రజలను కోరారు. ఎన్‌డిఎ అభివృద్ధి కోసం నిలుస్తుం డగా, ఆటవికలు విధ్వంసం కోసం పోరాడుతున్నాయ న్నారు. 2005లో ఆర్‌జెడి బిహార్‌లో అధికారం కోల్పోయిన పుడు, కేంద్రంలో ఆ పార్టీ ప్రభుత్వంపై భాగస్వామ్యప క్షంగా ఉందని, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం మంజూరు చేసిన కోసి మహాసేతు వంటి ప్రాజెక్టులను మన్మోహన్ సింగ్, సోనియా గాంధీపై ఒత్తిడి తెచ్చి నిలిపివే సిందని ఆయన ఆరోపించారు. వంతెన నిర్మాణం ద్వారా కోసి ప్రాంత ప్రజల బాధలను ఆర్‌జెడి ఎప్పటికీ అర్థం చేసు కోలేదన్నారు. వరద నియంత్రణపై ఎన్‌డిఎ మ్యానిఫెస్టోలో ఒక బ్లూప్రింట్ కూడా ఉందన్నారు. ఆర్‌జెడి–కాంగ్రెస్ 'చొర బాటుదారుల పట్ల మృదువుగా వ్యవహరిస్తోందని, అయో ధ్యలో రామమందిరం, ఛత్ పూజ పట్ల అసహ్యంగా ఉంద న్నారు. ఆర్‌జెడి, కాంగ్రెస్ నాయకులు విదేశాల్లోని అన్ని రకాల ప్రదేశాలను సందర్శించడానికి సమయం తీసుకుం టారు కానీ వారికి అయోధ్యను సందర్శించడానికి సమయం దొరకదని ఆరోపించారు. వారికి రాముడిపై అంత అయిష్టత ఉంటే, వారు ఇప్పటికీ వెళ్లి నిషాద్ రాజ్, వాల్మీకి జ్ఞాపకార్థం నిర్మించిన స్మారక చిహ్నాలను చూడవచ్చ న్నారు. కాగా మోదీ జీవితంలోని వివిధ రంగాలలో మహి ళలు సాధించిన విజయాలను హైలైట్ చేస్తూ, 'బేటీ బచావో బేటీ పడావో' నినాదాన్ని ఎగతాళి చేసిన వారు ఇప్పుడు దేశ మహిళలపై చిన్నచూపు చూసినందుకు పాశ్చాత్తాపపడుతు న్నారన్నారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ప్రస్తా వించకుండా వారు కేంద్రంలో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పగటి కలలు కంటున్నారని, విదేశీ యులు విద్యను అభ్యసించడానికి వచ్చే పురాతన విద్యా కేంద్రమైన నలందలో ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తున్నారన్నారు. 'కాంగ్రెస్‌కు అబద్ధాలు చెప్పే అలవాటు ఉంది. నలందలో ఒక ఆధునిక విశ్వవిద్యా లయం నిర్మించబడిందని మీకు చెప్తున్నాను. వారు అధికా రంలో ఉన్నప్పుడు, ఈ ప్రాజెక్టు కోసం రూ. 20 కోట్ల స్వల్ప మొత్తాన్ని మంజూరు చేశారు. ఆపై వారు దాని గురించి మరచిపోయారు. 2014లో మేము అధికారంలోకి వచ్చిన తర్వాత, దాని కోసం రూ. 2,000 కోట్లు ఖర్చు చేసాము' అని ఆయన పేర్కొన్నారు.

## బిజెపి మరోసారి నితీశ్‌ను సిఎం చేయదు : ఖర్గే



**హాజీపూర్ :** బిహార్ ముఖ్యమంత్రి రాజకీయ భవి తవ్యంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి తిరిగి అధికారంలోకి వస్తే, నితీష్ కుమార్‌ను ముఖ్యమంత్రిని చేయదని, బదులుగా కాషాయ పార్టీకి చెందిన 'చెల్లా'కు ఆ పదవిని ఇస్తుందని పేర్కొన్నారు. హాజీపూర్ ప్రధాన కార్యాలయం నుండి 40 కి.మీ దూరంలో ఉన్న వైశాలి జిల్లా రాజా పాకర్‌లో సోమవారం తొలిసారి బిహార్ ఎన్నికల ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. జయ ప్రకాష్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా, కర్పూరి ఠాకూర్ వంటి సోషలిస్ట్ ప్రముఖుల వార సత్వాన్ని నితీశ్ మోసం చేశారని మండిపడ్డారు. 'మను స్మృతి'ని బిజెపి విశ్వసిస్తుందని చెప్పిన నితీశ్ ఇప్పుడు 'మహిళా వ్యతిరేక' బిజెపితో చేతులు కలిపారని మండిపడ్డారు. 'నితీష్ కుమార్ మనుస్మృతిని నమ్మే బిజెపి ఒడిలో కూర్చున్నాడు, ఆయన జెపి, లోహియా, ఠాకూర్‌లను వదులుకు న్నారు. దళితులు, ఒబిసిలు, ఇబిసిల లక్ష్యాన్ని సమర్థించలేరు' అని ఆయన పేర్కొన్నారు. 'కానీ ఎన్నికల తర్వాత బిజెపి తనను మళ్ళీ ముఖ్యమం త్రిని చేయబోదని, బదులుగా తమలో కొంత మంది 'చెలా' (పాద సైనికుడు)కి ఆ పదవిని ఇస్తా రని నితీష్ కుమార్‌కు తెలియదు' అని ఖర్గే అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రంలో 'తన కొడుకు పెళ్లి' వలే తీవ్రమైన ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రధానికి ప్రపంచాన్ని చుట్టేసి సమయం ఉంది కానీ, మన దేశంలో పరిస్థితిని అంచనా వేయడానికి తీరిక లేకుండా పోయిందని మండిపడ్డారు. ఆయన ఎన్నికల సమయంలో మాత్రమే కనిపిస్తారు, మున్సిపల్ ఎన్నికల సమ యంలో కూడా మోదీ నగర వీధుల్లో తిరుగుతు న్నట్లు మీరు చూడవచ్చని, బిహార్ అసెంబ్లీ ఎన్ని కల సమయంలోనూ ఆయన తన కొడుకు పెళ్లిలా బిజీగా ఉన్నారని పేర్కొన్నారు. మోదీ 13.5 సంవ త్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారని, గత 12 సంవత్సరాలుగా ప్రధానమంత్రిగా ఉన్నా రని, కానీ పశ్చిమ రాష్ట్రాన్ని లేదా దేశాన్ని అభివృద్ధి చేయలేకపోయారని అన్నారు. నితీష్ తొమ్మిది సార్లు బిహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి, 20 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించినప్ప టికీ, ఉద్యోగాలు కల్పించలేకపోయాడని, యువత వలసలను ఆపలేకపోయాడాని ఖర్గే ధ్వజమెత్తారు. బిహార్‌లో ఎన్‌డిఎ ప్రభుత్వం రూ. 70,000 కోట్ల విలువైన కుంభకోణాలకు పాల్పడిందని, కంప్ట్రో లర్ ఆడిటర్ అండ్ జనరల్ (కాగ్) నివేదిక కూడా దానిని ధృవీకరించిందని అన్నారు. మోదీ, షా 'జంగల్ రాజ్' గురించి మాట్లాడుతారు కానీ గత 20 ఏళ్లలో బిహార్ కోసం ఎన్‌డిఎ ఏమి చేసిందని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వ విభాగాలలో 50 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మోదీ దాని గురించి పట్టించుకోలేదని, ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఆయన ఇచ్చిన ఎన్నికల హామీని విస్మరించారన్నారు.

## సంస్థలలో వీధి కుక్కలకు ఆహారం పెట్టడంపై
## నవంబరు 7న ఆదేశాలు జారీ

సుప్రీంకోర్టు వెల్లడి



**న్యూఢిల్లీ :** ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలు సహా కార్మికులచే కుక్కలకు మద్దతు ఇవ్వడం, ఆహారం ఇవ్వడం, ప్రోత్సహించడంలో సంస్థలు ఎదుర్కొం టున్న వీధి కుక్కల బెడదకు సంబంధించి నవం బరు 7న ఆదేశాలు జారీ చేస్తామని సోమవారం సుప్రీంకోర్టు తెలిపింది. న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, సందీప్ మెహతా, ఎన్.వి.అజారియా లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచా రిస్తోంది. 'హాజరు నమోదు, అఫిడవిట్లు, ప్రతీ విష యాన్ని నమోదు చేయడమే కాకుండా ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థలు, ఉద్యోగులు ఆ ప్రాంతంలో కుక్కలకు మద్దతు ఇస్తున్న, ఆహారం పెడుతున్న, ప్రోత్సహిస్తున్న, ఇతర సంస్థలలో ఎదుర్కొంటున్న సంస్థాగత ముప్పుకు సంబం ధించి కూడా మేం కొన్ని ఆదేశాలు జారీ చేస్తాం. దాని కోసం మేం కచ్చితంగా కొన్ని ఆదేశాలు జారీ చేస్తాం' అని జస్టిస్ విక్రంనాథ్ చెప్పారు. ఈ కేసు లలో హాజరైన న్యాయవాదులలో ఒకరు, ఈ అంశంపై ఆదేశాలు జారీచేసే ముందు తమ వాద నలు వినాలని ధర్మాసనాన్ని కోరారు. 'సంస్థాగత అంశాల విషయానికొస్తే మేం ఎటువంటి వాద నలు వినబోం. క్షమించండి' అని జస్టిస్ సందీప్ మెహతా అన్నారు. చాలా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధానకార్యదర్శులు దాని ముందు హాజరైనట్లు ధర్మాసనం తెలిపింది. కేరళ ప్రధానకా ర్యదర్శి దాఖలు చేసిన మినహాయింపు దరఖా స్తును కోర్టు అనుమతించింది. రాష్ట్ర ప్రధానకార్య దర్శి కోర్టుకు హాజరైనట్లు తెలిపింది. ఈ అంశంలో భారత జంతు సంక్షేమ బోర్డును పార్టీగా చేర్చినట్లు పేర్కొంది. ప్రారం భంలో సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా తుషార్ మెహతా మాట్లా డుతూ చాలా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ సమ్మతిని దాఖలు చేశాయని ధర్మాసనానికి తెలియజే శారు. ఆదేశాలను నవంబరు 7 కోసం జాబితా చేస్తున్నట్లు ధర్మాసనం తెలి పింది. రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధానకార్యదర్శుల వ్యక్తిగత హాజరు ఇకపై అవసరం లేదని ధర్మాసనం తెలిపింది. అయితే కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో ఏదైనా వైఫల్యం జరిగితే వారి హాజర మళ్లీ అవ సరం ఉంటుందని ధర్మాసనం తెలిపింది. సుప్రీం కోర్టు గతంలో ఈ కేసు పరిధిని ఢిల్లీజాతీయ రాజ ధాని ప్రాంతం పరిధికి మించి విస్తరించింది. తద్వారా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతా లను ఈ విషయంలో పార్టీలుగా చేర్చింది.

## విజయ్ కార్యాలయానికి సిబిఐ..

### కరూర్ తొక్కిసలాటపై ఆరా



**చెన్నై:** తమిళనాడులోని కరూర్‌లో తమిళగ వెట్రి కళంగం (టివికె) చీఫ్ విజయ్ ఇటీవల నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాటకు సంబంధించి సిబిఐ అధికారులు సోమవారంనాడు టివికె పార్టీ కార్యాలయానికి వెళ్లారు. ఘటనకు సంబంధించిన వివరాలను ఆరా తీశారు. ఈ విషయాన్ని టివికె జాయింట్ జనరల్ సెక్రటరీ సిటిఆర్ నిర్మల్ కుమార్ ధ్రువీకరించారు. కనూర్ తొక్కిసలా టకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ వంటి వివరాలను అడిగినట్టు తెలిపారు. 'అధికారులు వివరాల కోసం వచ్చారు,ఇంటరాగేషన్ కోసం కాదు. వ్యక్తి గతంగా సమన్లు జారీ చేసి వివరాలు ఇవ్వాలని కోరారు. మా ప్రతినిధుల ద్వారా మూడు నాలుగు రోజుల్లో ఆ వివరాలు అందజేసేందుకు మేము అంగీకరించాం' అని చెప్పారు. దర్యాప్తు కోసం తొలుత ఏర్పాటు చేసిన 'సిట్'కు ఇప్పటికే తాము సంబంధిత వివరాలను అందించినట్టు ఆయన తెలిపారు. సీబీఐ దర్యాప్తు ప్రారంభించి ఎప్పుడు సాక్ష్యం ఇమ్మని అడిగినా సహకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్టు కుమార్ తెలిపారు.

**కరూర్‌ఘటనవివరాలు:** టివికె అధ్యక్షుడు విజయ్ సెప్టెంబర్ 27న కరూర్ లో ర్యాలీ నిర్వహించారు. తొక్కిసలాటలో 41 మంది మృతి చెందగా, 60 మందికి పైగా గాయపడ్డారు. హైకోర్టు ఆదేశాలతో ఈ ఘటనపై సిట్ దర్యాప్తు చేపట్టింది. సిట్‌పై తమకు నమ్మకం లేదని, సిబిఐతో దర్యాప్తు జరిపించాలని సుప్రీంకోర్టులో టివికె పిటిషన్ వేసింది. దీంతో దర్యాప్తు బాధ్యతను సిబిఐకి బదిలీ చేస్తూ అత్యున్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్వర్వులు ఇచ్చింది.


**FORMAT – C1**
**(CHAPTER-3 PARA-3.5)**

**Declaration about Criminal Cases**

**(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation &Ors. Vs. Union of India & Anr.)**

Name and address of candidate: **ANAND RAO JOLLU,**
**H.No.8-4-369, B23, FF4, Aditya Nagar, Hyderabad-500018.**

Name of political party : **INDEPENDENT**

*Name of Election : **Assembly BYE-Election 2025**

*Name of Constituency : **61-Jubilee Hills**

I **ANAND RAO JOLLU** (name of candidate), a candidate for the abovementioned election, declare for public information the following details about my criminal antecedents:

| (A) Pending criminal cases | | | | |
|---|---|---|---|---|
| Sl. No. | Name of Court | Case No. and dated | Status of Case(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
| 1 | **JMFC (Mobile), Sangareddy** | **CC No. 1873/20204 Dt: 07-12-2024** | **386, 447, 427, 504, 34 of IPC** | **Criminal Intimidation (extortion), unlawful trespass, property damage and provocation to breach peace.** |

| (B) Details about cases of conviction for criminal offences | | | |
|---|---|---|---|
| Sl. No. | Name of Court & date(s) of order(s) | Description of offence(s) & punishment imposed | **Maximum Punishment Imposed** |
| **N/A** | **Not Applicable** | **Not Applicable** | **Not Applicable** |


## ఆరో వారంలోకి అడుగుపెట్టిన
## అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్

### సెనేట్ నిబంధనలు మార్చాలని రిపబ్లికన్ నేతలపై ట్రంప్ ఒత్తిడి



**వాషింగ్టన్:** అమెరికాలో అత్యంత అరు దుగా సంభవించే షట్‌డౌన్ ఆరో వారంలోకి ప్రవేశించినప్పటికీ, సమస్య పరిష్కారం దిశగా ఇంత వరకూ ఎలాంటి అడుగు పడడం లేదు. ఈ విషయంలో రిపబ్లికన్లు, డెమోక్రాట్లు మధ్య విభేదాలు కొనసాగు తూనే ఉన్నాయి. ఆర్థిక బిల్లును సెనెట్ (అ మెరికన్ పార్లమెంటు) నిలిపివేయడంతో ప్రభుత్వ పరంగా జరగాల్సిన లావాదేవీ లకు బ్రేక్ పడింది. ఈ స్థబ్దత కారణంగా లక్షలాది మందిఅమెరికన్లకు ఆహార సహాయం (ఎస్ ఎన్‌ఎపి) ఆలస్యమవుతున్నది. కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. సెనెట్‌లో ఆర్థిక బిల్లుకు ఆమోద ముద్ర పడకపోయినప్పటికీ, చెల్లింపులు, లావాదేవీలకు ఎలాంటి సమస్య లేకుండా నిబంధనలను మార్చాలని రిపబ్లికన్ నేత లపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి పెంచుతు న్నట్టు సమాచారం. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరో లిన్ లెవిట్ ప్రకారం, ట్రంప్ ఆదివారం సెనేట్ మెజా రిటీ లీడర్ జాన్ థ్యూన్, హౌస్ స్పీకర్ మైక్ జాన్సన్ లతో ట్రంప్ మాట్లాడారు. పబ్లిక్‌గా ఫిలిబస్టర్ నియ మాన్ని రద్దు చేయాలని ఆయన పునరుద్ఘాటిస్తు న్నారు. ఫిలిబస్టర్ నియమం ప్రకారం, సెనేట్‌లో ఏ బిల్లునైనా ఆమోదించాలంటే కనీసం 60 ఓట్లు అవ సరం. రిపబ్లికన్లు ఈ నియమం రద్దును వ్యతిరేకిస్తూ, ఇది సెనేట్ సమతుల్యతను కాపాడే ముఖ్యమైన పద్ధ తనిని, తాము సభలో మైనారిటీగా ఉన్నప్పుడు డెమో క్రాట్ల విధానాలను అడ్డుకోవడానికి ఇది సహాయపడు తుందని అంటున్నారు. అధ్యక్షుడు ట్రంప్ తీసుకుం టున్న పలు నిర్ణయాలు, అవలంభిస్తున్న ఆర్థిక విధా నాలను వ్యతిరేకిస్తున్న డెమోక్రాట్లపై రిపబ్లికన్ పార్టీ నాయకులు, సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'డెమోక్రాట్లు పూర్తిగా పిచ్చివాళ్లలా ప్రవర్తిస్తున్నారు. ఎలాంటి రాజీకి కూడా సిద్ధంగా లేరు. అందుకే అధ్య క్షుడు ట్రంప్, రిపబ్లికన్ పార్టీ నాయకులు కఠినంగా వ్యవహరించాలి, తెలివిగా నిర్ణయాలు తీసుకోవాలి. ఫిలిబస్టర్ రద్దు చేసి ప్రభుత్వం తిరిగి ప్రారంభించాలి' అని లెవిట్ అంటున్నారు. కాగా, సెనేట్‌లో ఆర్థిక బిల్లుపై చర్చలు నిలిచిపోయాయి. షట్‌డౌన్ ప్రస్తుతం షట్‌డౌన్ 33వ రోజుకు చేరుకుంది. ఇది 2019లో ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జరిగిన 35 రోజుల రికార్డుకు చాలా దగ్గరగా ఉంది. ఆ సమయంలో కూడా, మెక్సికో సరిహద్దు గోడకు నిధులు ఇవ్వాలనే ట్రంప్ డిమాండ్‌తో కాంగ్రెస్ వ్యతిరేకించింది. ఫలి తంగా రికార్డు స్థాయిలో ప్రభుత్వ కార్యకలాపాలు మూతపడ్డాయి. ఇలావుంటే, ప్రభుత్వం తిరిగి ప్రారంభించడానికి వీలుగా ప్రవేశపెట్టిన బిల్లులను డెమోక్రాట్లు ఇప్పటివరకు 13 సార్లు తిరస్కరించారు. ట్రంప్ ప్రభుత్వం ఎత్తివేసిన ఆరోగ్య భద్రతా సబ్సిడీ లను కొనసాగించాలన్న డిమాండ్‌కు వారు కట్టుబడి ఉన్నారు. అయితే, ముందుగా ఆర్థిక బిల్లును ఆమో దించాలని, తర్వాతే చర్చలు జరుపుతామని రిపబ్లి కన్లు పట్టుబడుతున్నారు. ఇలావుంటే, సిబ్బంది జీతాలు నిలిచిపోయి, విమానాశ్రయాల్లో ఆలస్యాలు సాధారణమవుతున్నాయి. ఉద్యోగులు తినడానికి, కారు నడపడానికి, అద్దె చెల్లించడానికి ఇబ్బంది పడు తున్నారు. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే, కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని వారు హెచ్చరిస్తు న్నారు. షట్‌డౌన్ ప్రభావం 42 మిలియన్ల మందిఅమె రికన్లకు వర్తించే ఎస్‌ఎన్‌ఎపిఆహార సహాయ కార్యక్ర మంపై కూడా పడింది. వ్యవసాయ శాఖ శనివారం నుండి 8 బిలియన్ డాలర్ల నిధులను నిలిపివేయాలని యోచించింది. కానీ రెండు ఫెడరల్ కోర్టులు ఆ నిర్ణ యాన్ని అడ్డకున్నాయి. ట్రంప్ ప్రభుత్వం ఆకలిని రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తోందని డెమోక్ర టిక్ హౌస్ లీడర్ హకీమ్ జెఫ్రీస్ విమర్శించారు. సెనె ట్‌ఫిలిబస్టర్‌పై ట్రంప్ దృష్టి పెట్టడం కొంత మంది రిపబ్లికన్ నేతలకు కూడా తలనొప్పిగా మారింది. వారు దీర్ఘకాలికంగా అమల్లో ఉన్న విధానానికే కట్టు బడి ఉండగా, ట్రంప్ కొత్త డిమాండ్ తెరపైకి తీసుకు రావడంతో ఏం చేయాలో తెలియక మల్లగుల్లాలు పడుతున్నారు. మొత్తం మీద షట్‌డౌన్ పరిస్థితులు ట్రంప్‌కు సొంత పార్టీలోనే వ్యతిరేకతను సృష్టిస్తు న్నాయి.

## సర్‌పై సుప్రీంలో డిఎంకె పిటిషన్

**న్యూఢిల్లీ :చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ రాష్ట్రంలో ఎన్ని కల కమిషన్ ప్రకటించిన రెండో విడత ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సారథ్యంలోని డిఎంకె సుప్రీంకోర్టులో సోమవారంనాడు పిటి షన్ వేసింది. డిఎంకె ఆర్గనైజేషన్ సెక్ర టరీ ఆర్ఎస్ భారతి ఈ పిటిషన్‌ను డిఎంకె ఎంపి, సీనియర్ అడ్వకేట్ ఎన్ ఆర్ ఇలాంగో ద్వారా సుప్రీంకోర్టులో వేశారు. తమిళనాడులో ఎస్‌ఐఆర్ నిర్వ హిస్తామంటూ అక్టోబర్ 27న ఇసిఐ ఇచ్చిన నోటిఫికేషన్‌ను కొట్టి వేయాలని ఆ పిటిషన్‌లో కోరారు.


Date: 03-11-2025

**IN THE COURT OF THE HON'BLE ADDL JUNIOR CIVIL JUDGE: AT: BHUPALAPALLY**
**O.S.NO. 199 OF 2025**

Between:-
**Polam @Maneti Bapu S/o. Lachaiah,** Age:50 yrs, Occ:Agriculture, R/o. Plolapally, H/o. Mahamutharam.
**...Plaintiff**

Vs

**Thahasildar Mahamutharam**
**...Defendant**

To
All Concerned.

**NOTICE**

Please take notice that the above named Plaintiff has filed the above Suit against Defendant No 1 and all concerned for declaring him as Class II legal heir of Late Erneni Sammakka, W/o Late Pochaiah. The same is stands posted to **25-11-2025** for appearance of persons interested if any in this matter. You are therefore requested to be present before the above mentioned Court on **25-11-2025 at 10-30 A.M.** in person or through an Advocate, failing which the matter will be decided in accordance with Law.

(BY ORDER OF THE COURT)

Sd/-
**C.Raman Kumar Reddy.**
**Uppula Subhash**
**Advocates**
(Counsel for Plaintiff)
Off: JS Bhupalapally
Cell: 9440449393, 9948444560.

ప్రజాపక్షం
మంగళవారం, 04 నవంబరు

# సందేహాల మధ్య బిహార్ ఎన్నికలు

బిహార్ అసెంబ్లీ ఎన్నికల తొలిదశ పోలింగ్ రెండ్రోజుల్లో (6వ తేదీ) జరుగుతుంది. పాలక ఎన్‌డిఎ కూటమి, ప్రతిపక్ష ఇండి (మహాగట్బంధన్) కూటమి మధ్య హోరాహోరీ పోరాటం ఊహించబడుతోంది. ఈ పోటీ నాయకుల మధ్య కనిపిస్తున్నంతగా ఓటర్లలో ఉందా అనే ప్రశ్నకు సమాధానం ఓటింగ్ శాతం మాత్రమే చెప్పగలదు. 11వ తేదీ రెండవ దశ పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ఇతర బిజెపి పటాలం కాలికి బలపం కట్టుకొని ఎన్నికల ప్రచారం సాగిస్తోంది. ప్రతిపక్షం వైపున ఆర్‌జెడి నాయకులు తేజస్వి యాదవ్, లాలూ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ స్వరాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ప్రచారంలో రాజకీయ పరస్పర ఆరోపణలు, నిందలు, పోటాపోటీ వాగ్దానాలు అలా ఉంచితే, కొన్ని ప్రధానమైన ప్రశ్నలు ఓటర్ల మెదళ్లు తొలుస్తున్నాయి. ఒకటి, ఎస్ఐఆర్ నిర్వహించిన ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాలు సక్రమంగా రూపొందించిందా? ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లు లక్షల సంఖ్యలో దళితులు, ముస్లింలు, మహిళల ఓట్లు తొలగించి పాలక కూటమికి మేలు చేస్తున్నదా? సుప్రీంకోర్టులో కేసు ఇప్పటికీ పెండింగ్‌లో ఉంది. 47 లక్షల ఓట్లు తొలగించబడినాయి. డూప్లికేట్ పేరుతో మరో 14.35 లక్షల మంది ఓటు హక్కు నిరాకరించబడుతోంది. అంతేగాక మహిళా జనాభా పెరిగినప్పటికీ మహిళా ఓటర్ల సంఖ్య బిహార్ చరిత్రలో తొలిసారి తగ్గింది. చొరబాటుదారులనే నెపంతో చాలామంది ముస్లిం మహిళల ఓట్లు తొలగించినట్లు ఆరోపించబడింది. పౌరసత్వం గుర్తింపు ఎన్నికల కమిషన్ పని కాదని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ చొరబాటుదారులను ఓటర్ల జాబితా నుంచి ఏరి చేసినట్లు ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ చెప్పారు. అయితే ఎంతమంది చొరబాటుదారులు గుర్తించారనే ప్రశ్నకు ఆయన సమాధానం దాటవేశారు. ఓటర్ల స్లిప్పులు పంపిణీ చేసేదీ ఎన్నికల కమిషన్ సిబ్బందే గనుక ఓటర్ల జాబితాకు తొలి పరీక్ష అక్కడే ఎదురవుతుంది. ఎన్నికల కమిషన్ నిజాయితీపట్ల లేదా బిజెపి పట్ల దాని పక్షపాతం పట్ల అనుమానాలు ఇంతటి తీవ్ర స్థాయిలో స్వతంత్ర భారత చరిత్రలో మునుపెన్నడూ లేవు.

రెండు, ముఖ్యమంత్రి ముఖం. ముఖ్యమంత్రిగా ప్రజలు ఎవరిని కోరుకుంటున్నారు? మహాగట్బంధన్ తమ అభ్యర్థిగా ఆర్‌జెడి నేత, యువకుడు తేజస్వి యాదవ్ పేరు ప్రకటించింది. ప్రజలు ఆదరణ చూపుతున్నారు. సి ఓటర్ తాజా సర్వే దీనినే తెలుపుతోంది. కాగా నితీష్ కుమార్‌ను కొనసాగించడానికి బిజెపి సిద్ధంగా లేదు. ఎన్నికల్లో వాడుకొని, అనంతరం వయోభారం చూపి పక్కన కూర్చోబెట్టే ఆలోచనలున్న సూచనలు బహిరంగంగానే వ్యక్తమవుతున్నాయి. అమిత్ షా మొన్న శుక్రవారం నాడిలా చెప్పారు: ''జెడియు అధ్యక్షుడు నితీష్ కుమార్ నాయకత్వంలో ఎన్‌డిఎ పక్షాలు ఎన్నికల్లో పోరాడుతున్నాయి. ఎన్నికైన లెజిస్లేటర్లు ప్రభుత్వాధినేతను ఎన్నుకుంటారు''. దీనిపై ఎవరి భాష్యాలు వారివి. నితీష్ కుమార్ నాయకత్వంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్నప్పుడు వేరెవరో ఎలా ముఖ్యమంత్రి అవుతారు అన్నాడు జెడియు అధికార ప్రతినిధి నీరజ్ కుమార్. మరి మోదీ, అమిత్ షా ద్వయం ఆ మాట ఎందుకు చెప్పడం లేదు?

మూడు, ఎన్నికల వ్యూహకర్తగా మోదీ సహా ఎందరికో తోడ్పడిన ప్రశాంత్ కిషోర్ జన సూరజ్ పార్టీని సొంతంగా ఏర్పాటు చేసి అత్యధిక స్థానాలకు పోటీ చేస్తున్నారు కదా, ఆయన పార్టీ ఎవరి ఓట్లు చీల్చుతుంది? ఆయన అభ్యర్థులు కొందరిని బిజెపి లాక్కున్నది, నామినేషన్లు ఉపసంహరింపజేసింది. బిజెపికి పునాది ఉన్న పట్టణ ఓటర్లను కొంత మేరకు అది ఆకర్షించవచ్చని బిజెపి భయపడుతోంది. తమ పార్టీ గెలిస్తే అత్యధికంగా 150, లేకపోతే అత్యల్పంగా 10–15 సీట్లని పికె స్వయంగా అంటున్నాడు.

నాలుగు, ఎన్‌డిఎ మిత్రపక్షాలు సఖ్యతతో ఉన్నాయా? లేవు. కులం ప్రాతిపదికగా ఉన్న పార్టీలు బిజెపి తమకు కేటాయించిన సీట్ల సంఖ్య పట్ల సంతృప్తితో లేవు. లోక్‌సభ ఎన్నికల్లో జెడియుకు వ్యతిరేకంగా అభ్యర్థుల్ని నిలబెట్టి నితీష్‌కుమార్‌ను ఓడించడం లక్ష్యంగా ప్రకటించిన లోక్ జనశక్తి పార్టీ (రాంవిలాస్) చిరాగ్ పాశ్వాన్ ఈ పర్యాయం మాత్రం జెడి యుకు తోడ్పడతాడా లేక జెడియు అతన్ని నమ్మి ఓటు బదలాయిస్తుందా? అయితే ప్రధాని నరేంద్ర మోదీ ఎన్‌డిఎ కూటమికి అత్యధిక మెజారిటీ లభిస్తుందంటూ ప్రజల్ని మభ్యపెడుతున్నారు. ఎన్నడూ లేనంత సంక్లిష్టంగా ఉన్న బిహార్ ఎన్నికల క్షేత్రంపై 'ఓట్ వైబ్' తాజా సర్వే ప్రకారం చాలా దగ్గరి పోటీ నడుస్తుంది. మహాగట్బంధన్ 34.7 శాతం, ఎన్‌డిఎ 34.4శాతం, జన సూరజ్ 12.3శాతం, ఓటు వాటాను ఆ సర్వే సూచిస్తోంది. కాగా 8.4శాతం ఓటర్లు హంగ్ అసెంబ్లీ ఊహిస్తున్నారు. ఇది చాలా పెద్ద సంఖ్య, కొట్టివేయదగింది కాదు.

# చైనా 'అమెరికా విధానం'లో పెద్ద మార్పు


నిత్యా చక్రవర్తి

బుసాన్‌లో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ చరిత్రాత్మక శిఖరాగ్ర సమావేశం తదుపరి రెండురోజుల్లో అమెరికన్ మీడియాలో, అలాగే పశ్చిమ దేశాల వార్తాపత్రికల్లో అనేక వ్యాఖ్యానాలు ప్రచురించబడినాయి. అమెరికాలో చర్చల ఫలితాలపై వ్యాఖ్యలు ఊహించినట్లే ఉన్నాయి. న్యూయార్క్ టైమ్స్, ఇతర ట్రంప్ వ్యతిరేక మీడియా ట్రంప్‌కు వ్యతిరేకంగా జిన్‌పింగ్ సాఫల్యాలపై ఎక్కువగా కేంద్రీకరించాయి. కాగా ట్రంప్ అనుకూల మీడియా, ముఖ్యంగా ఫాక్స్ న్యూస్ ట్రంప్ విజేత అంటూ చప్పట్లు కొట్టింది. శాంతి సాధించటంలో ట్రంప్ అత్యంత సమర్థుడైన రాజనీతిజ్ఞుడని కొనియాడింది. అయితే తుది వాణిజ్య ఒప్పందం, రాజకీయ సంబంధాల భవిష్యత్ స్వభావం, ట్రంప్ ప్రకటించినట్లు వచ్చే ఏప్రిల్ నెలలో బీజింగ్‌లో జరిగే శిఖరాగ్ర సమావేశంపై ఆధారపడి ఉంటుందని అందరూ అంగీకరిస్తున్నారు. అయితే మంగళవారం (28.10) ఉదయం బుసాన్ (దక్షిణ కొరియా)లో ట్రంప్‌తో సంభాషణలో జిన్‌పింగ్ ప్రదర్శించిన దృక్పథంలో రాడికల్ మార్పును గమనించటంలో అమెరికా ప్రెస్ కొంతమేరకు విఫలమైంది. అవి ప్రధానంగా ఆర్థిక వ్యవస్థలు, ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థల్లో సారూప్యతలను దీర్ఘకాలిక సహకారంగా మార్చుకోవటంపై జిన్‌పింగ్ వక్కాణింపుపై దృష్టి కేంద్రీకరించాయి. బుసాన్‌లో జిన్‌పింగ్ ఇచ్చిన ఒక సందేశం 1949లో చైనాలో కమ్యూనిస్టు పార్టీ అధికారం చేబట్టిన శత వార్షికోత్సవం జరిగే 2049 నాటికి మెగా ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలోకి చైనా ప్రయాణించటంలో అది అమెరికాను విశ్వసనీయమైన మిత్రునిగా కోరుకుంటున్నది.

చైనా కమ్యూనిస్టు పార్టీ అధికారిక పత్రిక గ్లోబల్ టైమ్స్ అక్టోబర్ 31వ తేదీ బుసాన్ సమావేశంపై సంపాదకీయంలో చైనా అమెరికా భాగస్వాములుగా, స్నేహితులుగా ఉండాలి. చరిత్ర మనకు నేర్పింది ఇదే, వాస్తవికత అవసరం కూడా అదే' అని జిన్‌పింగ్ చెప్పినట్లు తెలిపింది. ద్వైపాక్షిక సంబంధాలు స్థిరంగా అభివృద్ధి చెందటానికి ఈ చర్చలు నూతన మార్గదర్శకం, ప్రోత్సాహం కలుగజేసినట్లు ఆ పత్రిక పేర్కొన్నది. చైనా అమెరికా సంబంధాలు మరింతగా స్థిరపడాలన్న ప్రపంచం ఆకాంక్షలను ఈ చర్చలు పెంచాయని ప్రస్తావించింది.

చైనా — అమెరికా సంబంధాలు క్షీణించటానికి ఇంతకు క్రితం ఏమి జరిగినప్పటికీ అందుకు గత ప్రభుత్వాలు కారణమని, ట్రంప్ ప్రభుత్వం కింది ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలు పెద్దగా అభివృద్ధి చెందేందుకు దారితీసే నూతన శకం ప్రారంభం కానున్నది అన్నది చైనా అధికారిక పంథా. ఈ సందర్భంగా గ్లోబల్ టైమ్స్, అధ్యక్షుడు జి జిన్‌పింగ్ ముఖ్యమైన వ్యాఖ్యను ఉట్టంకించింది. 'చైనా అభివృద్ధి, పునరుజ్జీవం 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' దార్శనికతతో చేయిచేయి కలిపి ప్రయాణిస్తుంది' ఇరు దేశాలు పూర్తి సామర్థ్యంతో పరస్పర సాఫల్యాలు సాధించేందుకు కలిసికట్టుగా సౌభాగ్యవంతమయ్యేందుకు ఇది తోడ్పడుతుంది.

'ఇరు పక్షాలు పెద్దగా ఆలోచించాలి. సహకారం వల్ల వనగూరే దీర్ఘకాలిక లబ్దిని గుర్తించాలి. పరస్పరం కాళ్లనరుక్కునే విష చక్రంలో పడకూడదు' అని ట్రంప్ సమావేశంలో జిన్‌పింగ్ చెప్పినట్లు గ్లోబల్ టైమ్స్ తెలిపింది. చైనా — అమెరికా మధ్య అధిగమించలేని అవరోధాలు, పరిష్కరించుకోలేని సమస్యలు లేవని చరిత్ర పలుమార్లు నిరూపించింది. పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం, ఉభయతారక సహకారం సూత్రాలపై ఆధారపడి ఇరుదేశాలు దీర్ఘకాలిక దృష్టితో నిర్మాణాత్మక సంబంధాన్ని తప్పక నిర్మించుకోగలవని జిటి పేర్కొన్నది.



తక్షణ ప్రపంచ సమస్యలను సంయుక్త నాయకత్వంలో పరిష్కరించే అవకాశం గూర్చి బుసాన్‌లో ఇరువురు నాయకులు మాట్లాడారు. అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇలా అన్నారు. 'ప్రపంచం ఈనాడు అనేక కఠినమైన సమస్యలు ఎదుర్కొంటున్నది. పెద్ద దేశాలుగా చైనా, అమెరికా బాధ్యత తీసుకుని మన రెండు దేశాల, యావత్ ప్రపంచం మేలు కోసం మరింత నిర్దిష్టమైన ఫలితాల సాధన కోసం సమిష్టిగా కృషి చేయవచ్చు. ఇది సాధ్యం మాత్రమే గాక, తప్పనిసరి అవసరం కూడా. అక్రమ వలసలను నిరోధించటం, టెలీకమ్యూనికేషన్ మోసాలు మొదలు మనీ లాండరింగ్, కృత్రిమ మేథ, అంటువ్యాధులు అరికట్టటం వరకు చైనా, అమెరికా మధ్య సహకారం ఆ రెండు దేశాల ప్రజల భవిష్యత్‌కే గాక, ప్రపంచ ప్రజలకు కూడా ఎంతో కీలకం. రెండు దేశాలు కలిసికట్టుగా గొప్ప విషయాలు సాధించగలవని గ్లోబల్ టైమ్స్ పేర్కొన్నది.

జిటి సంపాదకీయంలో ప్రస్తావించినట్లు ట్రంప్‌తో చర్చల్లో జిన్‌పింగ్ ఇలా నొక్కి చెప్పారు. ''పెనుగాలులు, అలలు, సవాళ్లు ఎదుర్కొంటూనే, చైనా–అమెరికా సంబంధాలనే బృహత్తర ఓడను చైనా సరైన దిశలో నడపగలదు. క్లిష్టమైన మార్గం గుండా ప్రయాణిస్తూ నిలకడగా ముందుకు తీసుకెళ్లగలదు.'' సమిష్టి ప్రయత్నాల ద్వారా రెండు దేశాలు ప్రపంచానికి అనేక గొప్ప విషయాలు సాధించగలవని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు దేశాల బలమైన వ్యూహాత్మక నాయకత్వం కింద అమెరికా — చైనాలు ప్రపంచ శాంతి, అభివృద్ధికి సరికొత్త, గొప్ప దోహదాలు చేస్తాయని ప్రపంచ ప్రజలు ఎదురు చూస్తారు.

చైనా ప్రభుత్వ అధికారిక దృష్టి గ్లోబల్ టైమ్స్ అభిప్రాయంగా ఉంటుంది. ఈ మార్గాల్లోనే బుసాన్‌లో జిన్‌పింగ్ మాట్లాడారు. ద్విపక్ష ఆధిపత్యం కోసం ఆకాంక్ష ఆయన వైపు నుండి ఎక్కువగా వ్యక్తమైంది. ట్రంప్ సానుకూలంగా స్పందించారు గాని ద్విపక్ష దృక్పథంపై ఆయన వ్యాఖ్యల్లో అంత ఉత్సాహం కనిపించలేదు. చైనాతో దీర్ఘకాలిక ఆర్థిక సహకారానికి అమెరికా సిద్ధంగా ఉన్నట్లు అమెరికా అధ్యక్షుని నుంచి కచ్చితమైన ధృవీకరణ ఇప్పటి వరకు లేదు. ఆ దీర్ఘకాలిక సహకారం హద్దులను ట్రంప్ అంతిమంగా నిర్ణయించేలోపు ఆయన సలహాదారులు దాని గూర్చి లోతుగా ఆలోచిస్తారు. వచ్చే ఏప్రిల్‌లో అగ్రనాయక సమావేశం వరకు ఆయనకు వ్యవధి ఉంది.

బుసాన్ శిఖరాగ్ర సమావేశం సమయం జిన్‌పింగ్‌కు చాలా కీలకం. 10రోజుల క్రితమే చైనా కమ్యూనిస్టు పార్టీ నాలుగు రోజుల ప్లీనం జరిగింది. అదే వచ్చే పంచవర్ష ప్రణాళిక (2026–2030)ను చర్చించింది. ఆ ముసాయిదాను వచ్చే మార్చిలో జరిగే జాతీయ పీపుల్స్ కాంగ్రెస్ (పార్లమెంటు) చర్చించి ఆమోదిస్తుంది. ఏప్రిల్‌లో ట్రంప్ బీజింగ్ పర్యటన కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కూడా అయన జిన్‌పింగ్‌కు కీలకం. కీలకమైన రంగాల్లో అమెరికా సహాయంతో వచ్చే పంచవర్ష ప్రణాళికకు కొత్త హైటెక్ కోణం జోడిస్తున్నారు జిన్‌పింగ్.


అధ్యక్షుడు జి జిన్‌పింగ్ సమాన ప్రతిపత్తితో బుసాన్ శిఖరాగ్ర సభలో పాల్గొన్నారు. చైనా మీడియా ప్రకారం ట్రంప్‌తో చర్చల్లో జిన్‌పింగ్ పైచేయి సాధించారు. ట్రంప్ తన అతిశయోక్తుల ధోరణిలోనే మాట్లాడారు. భారత్ సహా గ్లోబల్ సౌత్ బుసాన్ అనంతర పరిణామాలను జాగ్రత్తగా గమనించాలి. రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ డిసెంబర్ మొదటివారంలో ఢిల్లీ పర్యటనకు వచ్చేలోపే నవంబర్ చివరకు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని భారత్‌పై అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడి చేయవచ్చు. ప్రధాని మోదీకున్న మార్గాలు పరిమితం. అమెరికా నుంచి సోయాచిక్కుడు దిగుమతికి చైనా అంగీకరించింది. ఏసియన్ సమావేశం సందర్భం

> *చైనా కమ్యూనిస్టు పార్టీ అధికారిక పత్రిక గ్లోబల్ టైమ్స్ అక్టోబర్ 31వ తేదీ బుసాన్ సమావేశంపై సంపాదకీయంలో చైనా అమెరికా భాగస్వాములుగా, స్నేహితులుగా ఉండాలి. చరిత్ర మనకు నేర్పింది ఇదే, వాస్తవికత అవసరం కూడా అదే' అని జిన్‌పింగ్ చెప్పినట్లు తెలిపింది. ద్వైపాక్షిక సంబంధాలు స్థిరంగా అభివృద్ధి చెందటానికి ఈ చర్చలు నూతన మార్గదర్శకం, ప్రోత్సాహం కలుగజేసినట్లు ఆ పత్రిక పేర్కొన్నది. చైనా అమెరికా సంబంధాలు మరింతగా స్థిరపడాలన్న ప్రపంచం ఆకాంక్షలను ఈ చర్చలు పెంచాయని ప్రస్తావించింది.*

లో కౌలాలంపూర్‌లో ట్రంప్‌తో ముఖాముఖి సమావేశంలో బ్రెజిల్ అధ్యక్షుడు లులా వాణిజ్య ఒప్పందానికి అంగీకరించారు. దక్షిణకొరియా, థాయిలాండ్ తదితర దేశాలు ఇప్పటికే అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ప్రధాని మోదీ వాణిజ్య ఒప్పందానికి అంగీకరించేలోపు తనకున్న ఉత్తమ మార్గమేమిటో నిర్ణయించుకోవాలి. దౌత్యపరంగా, ప్రస్తుత కాలం భారత్‌కు చాలా గడ్డు కాలం.. భారత్ దానితో జాగరూకత, ప్రావీణ్యంతో నిర్ణయం తీసుకోవాలి.

# టోల్ కష్టాలు మొదలాయే!

భారతదేశ జాతీయ రహదారులపై నిత్యం ప్రయాణించే కోట్లాది వాహనదారుల జీవితాల్లో ఇప్పుడు అకస్మాత్తుగా ఆందోళన మొదలైంది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఎఐ) తీసుకున్న కీలకమైన నిర్ణయం ఇకపై ప్రతి టోల్ చెల్లింపు పత్రం దాని వాహనంతో అనుసంధానమై ఉందని తప్పనిసరిగా ధ్రువీకరించే 'మీ వాహనం మాదే' (కేవైవి) విధానం సామాన్య ప్రజలను తీవ్ర గందరగోళం, ఆర్థిక భయంలోకి నెట్టివేసింది. ఈ నిబంధన వెనుక ఉన్న ఉద్దేశం టోల్ వసూళ్లలో అవకతవకలను అరికట్టడం, పారదర్శకత పెంచడం అయినప్పటికీ, దానిని అమలు చేస్తున్న తీరు, విధించిన గడువు మాత్రం నిజాయితీపరులైన వాహనదారులకు అన్యాయం చేసే విధంగా ఉంది. నిర్ణయించిన గడువులోగా ఈ అనుసంధానం ధ్రువీకరణను పూర్తి చేయని వాహనాలకు సంబంధించిన టోల్ చెల్లింపు పత్రాలు పనిచేయకుండా పోతాయి. దాని దుష్ఫలితంగా, టోల్ కేంద్రాల వద్ద ప్రయాణికులు నగదు రూపంలో రెండు రెట్లు సుంకం చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఈ నిర్ణయం, టోల్ కార్డులను ప్రవేశపెట్టిన నాటి స్ఫూర్తికే విరుద్ధంగా ఉంది. ఇది ప్రజలపై అదనపు భారం మోపడమే తప్ప మరొకటి కాదు. కొద్దిమంది అక్రమార్కులు లేదా మోసగాళ్లు చేసిన తప్పులకు, దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న నిజాయితీపరులైన వాహనదారులను బాధ్యులను చేసి, వారిపై అదనపు భారం మోపడం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. ఈ కఠిన నిర్ణయం వల్ల వాహనదారులకు ఎదురవుతున్న కష్టాలను అధికార వ్యవస్థలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అనేకమంది పౌరులకు ఈ కొత్త నిబంధన గురించి సరైన సమయంలో, పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. తమ రోజువారీ పనుల్లో నిమగ్నమై ఉండే సామాన్య జనం ఈ ధ్రువీకరణ గడువును గురించి తెలుసుకోలేకపోయారు, ప్రక్రియను పూర్తి చేయలేకపోయారు. కానీ, వ్యవస్థ తన వైఫల్యానికి ప్రజలను శిక్షించే విధంగా రెండు రెట్లు సుంకం చెల్లించాలని నిర్దేశిస్తోంది. ప్రజలకు సరిగా సమాచారం ఇవ్వడంలో విఫలమై, ఆ వైఫల్యానికి ప్రజలనే బాధ్యులను చేయడం పాలనలో సరియైన పద్ధతి కాదు. ఇది ప్రజల జీవనానికి అదనపు ఇబ్బంది కలిగించే అంశం. దీనికి తోడు, ఈ ధ్రువీకరణ ప్రక్రియ పూర్తిగా అంతర్జాలం ఆధారంగానే జరుగుతోంది. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన తక్కువగా ఉన్న వృద్ధులకు, అలాగే అంతర్జాల వసతి సరిగా లేని మారుమూల ప్రాంతాల ప్రజలకు ఈ ఆన్లైన్ ప్రక్రియను పూర్తి చేయడం అనేది దాదాపు అసాధ్యంగా మారింది. ధ్రువీకరణ కోసం వాహన పత్రాలు (రిజిస్ట్రేషన్ పత్రం), వాహనం యొక్క స్పష్టమైన ఛాయాచిత్రాలు ఎక్కించడం (అప్లోడ్ చేయడం)లో సాంకేతిక సమస్యలు తరచుగా ఎదురవుతున్నాయి. సరైన మార్గదర్శకత్వం, సహాయ కేంద్రాలు లేకపోవడం వల్ల ప్రక్రియ మధ్యలోనే ఆగిపోయి, టోల్ చెల్లింపు పత్రాలు పనిచేయకుండా పోయే ప్రమాదం ఉంది. ఈ విషయంలో ప్రజలకు సహాయం అందించాల్సిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వ వ్యవస్థలదే. టోల్ కేంద్రాల వద్ద టోల్ పత్రాలు పనిచేయకపోవడం వల్ల, నగదు చెల్లింపుల కోసం పెద్ద సంఖ్యలో వాహనాలు బారులు తీరుతున్నాయి. ఇది జాతీయ రహదారులపై అనవసరమైన ఆలస్యానికి, ఇంధనం వృథాకు దారితీస్తోంది. టోల్ చెల్లింపు పత్రాలను ప్రవేశపెట్టిన ముఖ్య లక్ష్యం దేశ రహదారులపై ప్రయాణాన్ని వేగవంతం చేయడం కానీ, ఈ కొత్త నియమం ఆ లక్ష్యాన్ని దెబ్బతీసేలా ఉంది. ఈ ఆలస్యం అత్యవసర ప్రయాణాలకు, వాణిజ్య రవాణాకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. రహదారులపై సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ వైఫల్యం కారణంగా, సామాన్య ప్రజలు తమ విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవలసి వస్తోంది. ఈ రెండు రెట్లు సుంకం వసూ లు అనేది ప్రజల జీవన నాణ్యతపై తీవ్ర ప్రభావాన్ని చూపే అంశం. ఇది ప్రజల ఆర్థిక భారాన్ని పెంచే నిర్ణ యం. ప్రజల సౌలభ్యాన్ని, వారి కష్టాలను పరిగణనలోకి తీసుకోకుండా, కేవలం నియమాలను అంటగట్టే విధంగా ఉన్న ఈ విధానాన్ని ప్రభుత్వం వెంటనే మార్చుకోవాలి. ప్రజాభిప్రాయాన్ని గౌరవించి, ప్రజల పట్ల సానుభూతితో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. మొట్టమొదటగా, ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేయడానికి తక్షణమే కనీసం 30 రోజుల అదనపు సమయం ప్రకటించాలి. ఈ మినహాయింపు సమయంలో ధ్రువీకరణ చేయని వారికి రెండు రెట్లు సుంకం వసూలు చేయకుండా, కేవలం హెచ్చరికలు మాత్రమే జారీ చేయాలి. ఇది నిజాయితీగా ఉండే పౌరులకు ఉపశమనం కలిగిస్తుంది. రెండవది, అంతర్జాలం ద్వారా ధ్రువీకరణ చేయలేని వారి కోసం, ప్రతి మండల కేంద్రంలో లేదా ముఖ్య నగరాలలో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి, వారికి తగిన సహాయాన్ని అందించాలి. కేవలం ఆన్లైన్ వ్యవస్థపై ఆధారపడకుండా, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సహాయాన్ని అందించాలి. మూడవది, ప్రభుత్వం ఈ కొత్త నిబంధన గురించి సులభమైన తెలుగు భాషలో, విస్తృత స్థాయిలో, అన్ని ప్రసార సాధనాల ద్వారా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలి. ఈ సమాచార ప్రచారం ప్రజలకు స్పష్టంగా, అర్థమయ్యే విధంగా ఉండాలి. ప్రజల సౌలభ్యం, శ్రేయస్సును దృష్టి లో ఉంచుకోకుండా తీసుకునే ఏ నిర్ణయమైనా, అది ఎంత మంచిదైనా సరే, విమర్శలకు గురికాక తప్పదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, వాహనదారుల కష్టాలను గుర్తించి, రెండు రెట్ల సుంకం వసూలును రద్దు చేయాలని, గడువును పెంచాలని దేశ ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ప్రజా సంక్షేమం కోరే ప్రభుత్వం, ప్రజలకు ఇబ్బందులు కలిగించకూడదు.




లేఖ

**— వెంకగారి భూమయ్య (నిర్మల్)**

# జపాన్ విధానాలను ఆచరిద్దాం.. ఆయుర్దాయం పెంచుకుందాం

మనలో చాలా మంది దీర్ఘకాలం పాటు స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటారు. అయితే, చెడు ఆహారపు అలవాట్లు, ఒత్తిడి, కాలుష్యం వంటి కారణాలతో 60 ఏళ్లు నిండకుండానే ఎక్కువ మంది తనువు చాలిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య లెక్కల ప్రకారం భారతీయుల సగటు ఆయుర్ధాయం 69.16 సంవత్సరాలు. జపాన్ ప్రజలు మాత్రం ప్రపంచంలోనే అత్యధిక ఆయుర్దాయంతో జీవిస్తున్నారు. ఆమధ్య జపాన్‌కు చెందిన ఒక వ్యక్తి 112 సంవత్సరాల 344 రోజుల వయస్సుతో ప్రపంచంలోనే ఎక్కువ కాలం జీవించిన వ్యక్తిగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. జపాన్‌లో ప్రజల సగటు ఆయుర్దాయం 83.7 సంవత్సరాలుగా ఉంది. ఇది మహిళలకు 86.8 సంవత్సరాలు, పురుషులకు 80.5 సంవత్సరాలుగా ఉంది. జపాన్ ప్రజల జీవన విధానం, ఆహారపు అలవాట్లు, వ్యాయా మం, సంస్కృతి, జెనెటిక్స్ దీనికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. ఇది జపాన్‌లో ఒక ప్రసిద్ధ సామెత. అంటే తగిన మోతాదులోనే ఆహారం తినాలని అర్థం. కడుపులో 80 శాతం నిండినంత వరకు మాత్రమే తింటే దీర్ఘాయువు కలిగి ఉంటామని అక్కడి ప్రజలు విశ్వసిస్తారు. అందువల్ల ఎక్కువ ఆహారం తినడం మానేయాలి. అవసరమైన దానికంటే ఎక్కువ తినడం ద్వారా కడుపుపై భారం పెరుగుతుంది. జపనీయులకు విస్తృతమైన హెల్త్‌కేర్ సిస్టమ్ ఉంది. అక్కడ చిన్నపిల్లలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని తప్పనిసరిగా అమలు చేస్తారు. ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు ఆరోగ్య సంస్థలు చక్కగా పనిచేస్తాయి. ఆరోగ్యకరమైన జీవన శైలిని పెంపొందించడానికి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తాయి. వీటితో పాటు జపనీయులు అధిక పరిశుభ్రతను పాటిస్తారు. అక్కడి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం, పర్యావరణ అనుకూల పార్కులు ప్రజలను ఎక్కువ కాలం జీవించేలా చేస్తాయి. జపాన్ ప్రజలు నెమ్మదిగా తినే శైలిని ప్రోత్సహిస్తారు. ఒకే ప్లేట్‌లో కాకుండా చిన్న చిన్న ప్లేట్లలో లేదా బౌల్స్‌లో ఆహారాన్ని తినడానికి ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సభ్యులంతా ఒకే దగ్గర కలిసి తింటారు. భోజనం చేసే సమయంలో టీవీ చూడటం, సెల్‌ఫోన్ వాడటం వంటి వాటికి దూరంగా ఉంటారు. నేలపై కూర్చొనే భోజనం చేయడానికి ప్రాధాన్యమిస్తారు. జపనీస్ ప్రజలు సమతుల ఆహారాన్ని తీసుకుంటారు. పండ్లు, ఒమేగా ఫాటీ ఆమ్లాలు అధికంగా ఉండే చేపలు, బియ్యం, తృణధాన్యాలు, టోఫు, సోయా, మిసో, ఆకుపచ్చ కూరగాయలు ఎక్కువగా తీసుకుంటారు.ఈ ఆహారాలన్నీ తక్కువ మొత్తంలో కొవ్వులు, చక్కెరలను కలిగి ఉంటాయి. వీటిలో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా లభిస్తాయి. తద్వారా కాన్సర్, గుండె జబ్బుల నుంచి బయటపడొచ్చు. ఈ ఆహారం కారణంగానే జపాన్ లో ఊబకాయం రేటు చాలా తక్కువగా ఉందని చెప్పవచ్చు. జపనీస్ ప్రజలు టీ తాగడాన్ని ఇష్టపడతారు. అది వారి సంస్కృతిలో భాగంగా భావిస్తారు. జపాన్ ద్వీప సమూహంలో మాచా టీ చాలా ప్రాచుర్యం పొందింది. టీ తయారీలో ఉపయోగించే టీ ఆకులు అధిక పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. తద్వారా ఇవి మీకు రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు కాన్సర్‌తో పోరాడే శక్తినిస్తాయి. జపాన్ ప్రజలు నిశ్చల జీవనశైలిని ద్వేషిస్తారు. యువకుల నుంచి వృద్ధుల వరకు అంతా నడవడానికే ఇష్టపడతారు. కుర్చీలు, సోఫాల కంటే నేలపై కూర్చోవడానికే ప్రాధాన్యమిస్తారు. తద్వారా ఇది ప్రేగులకు, కండరాలకు ఆరోగ్యాన్ని చేకూర్చుతుంది. విద్యార్థులు, ఉద్యోగులు సమీపంలోని రైల్వే స్టేషన్‌కు నడవడం లేదా సైక్లింగ్ చేయడం వంటివి చేస్తుంటారు. ఇతర దేశాలలా జపాన్ ప్రజలు వయసు పైబడిన తమ కుటుంబ సభ్యులను ఓల్డ్ ఏజ్‌హోమ్‌లకు పంపించరు. వృద్ధాప్యంలో కుటుంబంతో కలిసి జీవిస్తే మానసికంగా అనేక ప్రయోజనాలు కలుగుతాయని, సంతోషంగా జీవిస్తారని అక్కడి వారు నమ్ముతారు. జపనీయులు 'ఇకిగై' అనే సిద్ధాంతంతో జీవిస్తారు. ఆనందంతో జీవించాలని ఈ పురాతన తత్వశాస్త్రం బోధిస్తుంది. అంతేకాక ఎందుకు జీవిస్తున్నామనే దానిపై వారు స్పష్టతతో ఉంటారు. జీవితానికి లక్ష్యాన్ని ఏర్పర్చుకోవడం, ఇతరులకు సహాయం చేయడం, సమతుల ఆహారాన్ని తీసుకోవడం, స్నేహితులు, కుటుంబ సభ్యులతో ప్రేమతో కలిసి ఉండటం వంటి అంశాలు వారి ఆయుర్ధాయాన్ని రెట్టింపు చేస్తాయి.



**— సుధాకర్.ఏ.వి**
**రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి**
**(స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్) (STUTS)**

# ముంపు పాపం.. స్వయంకృతం..

వరంగల్, హనుమకొండలో ప్రకృతి విలయాన్ని, విధ్వంసాన్ని, విషాదాన్ని, వికృత రూపాన్ని చూశాక ఇది మనుషుల స్వయంకృతమేనని ఎవరికైనా తెలుస్తుంది. తుపాన్, భారీ వర్షాల కారణంగా ఎలా ఉన్న వరంగల్.. ఎలా అయిపోయిందని, అందమైన నగరం అందవిహీనంగా మారిందని అందరూ మదన పడుతున్నారు. వరంగల్‌తో అనుబంధం ఉన్నవారికి అంతో ఇంతో సంబంధం ఉన్నవారికి కనీస పరిచయం ఉన్నవారికి ఈ విలయం బాధ కలిగిస్తోంది. నగరంలో ప్రత్యక్షంగా బాధలు పడుతున్న వారి మాటేమిటి.. వారి కష్టాన్ని కన్నీళ్లను వర్ణించడానికి మాటల్లేవు, భాష చాలదు. ఈ విలయం పర్యావరణవేత్తలను, మేధావులను ఆందోళనకు గురిచేస్తుంది. తీవ్రంగా ఆలోచింపజేస్తుంది. ఈ దుస్థితి చూశాక ఒకటే అనిపిస్తోంది మనం మనుషులం కాదు బస్మాసురులమని. బస్మాసురుడు అంటే తనను తానే నాశనం చేసుకునేవాడు. మరో విధంగా చెప్పాలంటే తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కునేవాడు. తన గొయ్యి తానే తీసుకునేవాడు. భగవంతుడు అందమైన ప్రకృతిని బహుమతిగా ఇస్తే మనిషి దాన్ని సర్వనాశనం చేసుకుంటున్నాడు. మనలోని స్వార్థం, అత్యాశ, దురాశ, అవినీతి అమానవీయత ముందు తరాల క్షేమాన్ని విస్మరించిన విధానం వరంగల్ వంటి పెనువిలయాలకు, విధ్వంసాలకు కారణం అయింది. అయితే ఈ విధ్వంసం మొదటిది కాదు... చివరిది కాదు. ప్రకృతి ఆగ్రహానికి గురైన నగరాలు ఎన్నో ఉన్నాయి. భవిష్యత్తులోనూ జరుగుతాయి.. అయితే ప్రకృతి మనిషి మీద పగబట్టి ఈ విధంగా చేస్తుందా..? మనిషిని సర్వనాశనం చేయాలని ఉద్దేశపూర్వకంగా అనుకుంటుందా..? అలాంటి ఆలోచన ప్రకృతికి ఉండ దు. మనం ప్రకృతిని నాశనం చేస్తున్నాం కాబట్టే తట్టుకోలేక తిరుగుబాటు చేస్తుంది. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నారు పెద్దలు. కానీ అది మన చెవికి ఎక్కలేదు. మితిమీరిన పట్టణీకరణ, నగరీకరణ మన కొంపలు ముంచుతున్నది. అడ్డదిడ్డంగా పెరుగుతున్న నగరంలో అక్రమ కట్టడాలదే అగ్రస్థానం. ఎక్కడ చూసినా కాంక్రీట్ నిర్మాణాలే.. ఆకాశ హర్మ్యాలే.. ఆరడుగుల జాగాలో 5 అంతస్తుల భవనాలు కడుతున్నారు. వాన నీరు పోయే మార్గాల్లో ఇంద్రభవనాలు కడుతున్నాం.. వర్షపు నీటిని వరుస పట్టుకుని దాచుకునే చెరువులను కుంటలను, సరస్సులను ఆక్రమించి ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తున్నారు. 'సూది మొన మోపేంత జాగ' కూడా ఇవ్వను అని దుర్యోధనుడు పాండవులతో అన్నట్లుగా సూది మొన అంత ఓపెన్ కూడా లేకుండా నిర్మాణాలు చేస్తున్నప్పుడు ఆకాశం నుంచి పడే వాన నీరు ఎక్కడికి పోవాలి.. అది పోయే దారులన్నీ మన స్వార్థ ప్రయోజనాల కోసం మూసివేశాం కాబట్టి ఆ నీరు ఇళ్లలోకి వచ్చింది, బెడ్ రూముల్లోకి వచ్చింది, కిచెన్లోకి వచ్చింది. దాని తప్పేముంది. శ్రీ శ్రీ కవిత గుర్తుకొస్తోంది 'మనది ఒక బతుకేనా కుక్కల వలె, నక్కల వలె.. మనది ఒక బతుకేనా సందులలో పందుల వలె'. ఈ కథనంలోనే భయం కలిగించే శీర్షిక ఉంది అది వరంగల్ టుడే.. యువర్ సిటీ టుమారో నిజమే. ప్రముఖ రచయిత గొల్లపూడి మారుతీ రావు గతంలో స్వయంకృతం అన్నారు. వర్షపు నీటిని సులభంగా మళ్ళించడానికి ఉండే మార్గాల్లో వేలాది భవనాలు నిర్మించారు. కాబట్టి ఇప్పుడు వరంగల్ మునిగిపోయిందని రోదించడం అనవసరం అనిపిస్తుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఖాళీ స్థలాలు అన్నీ భోజనం అయిపోయాయి. వరంగల్ చుట్టూరా సుమారు రెండువేల చెరువులు, కుంటలు, సరస్సులు ఉండేవి.. అవి ఇప్పుడు కానరావడం లేదు. ఇటీవల హనుమకొండలోని గోపాల్‌పూర్, సమ్మయ్యనగర్‌తో సహా పలు కాలనీలు నీటమునిగాయి. ప్రజలు సర్వస్వం కోల్పోయారు. భారీగా ఆస్తి నష్టం సంభవించింది. వందల కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్వహణ లోపంతో డక్ట్ గేట్లు ఓపెన్ చేయకపోవడంతో గుర్రపుడెక్క ఇతర వ్యర్థాలు ఆ నీటిని అడ్డుకున్నాయి. గుర్రపు డెక్క తొలగింపు కోసమని ఇటీవల కొంత వ్యయం కూడా చేసినట్లు తెలిసింది. వాటిపై అధికారుల వద్ద సమాధానం లేదు. ముందస్తు ప్రణాళిక లేక పోవడం కారణంగా తెలుస్తోంది. అధికారుల అలసత్వం.. కాలనీ వాసులకు ప్రాణ సంకటంగా మారింది. డక్ట్ గేట్లు సకాలంలో తెరవకపోవడంతో నీరు కాలనీలను ముంచింది. దీంతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. స్థానిక శాసనసభ్యులు, రాజకీయ నేతలు కేవలం పరామర్శలకు మాత్రమే పరిమితమయ్యారు. ఇటీవల ముఖ్యమంత్రి వరంగల్ పర్యటనలో ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని ఎంతటి వారివైనా తొలగించాల్సిందేనని హుకుం జారీ చేశారు.అది ఎంతవరకు సఫలీకృతం అవుతుందో చూడాలి. వరద నీరు పోయే పైపుల మీద మురికివాడలు వెలిశాయి. మురుగునీరు పోయే కాలువల మీద భవనాలు వెలిసాయి. చెరువుల, కుంటల్లో ఆకాశ హర్మ్యాలు నిర్మించారు. హనుమకొండలోని చెరువుల దుస్థితి గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే ఇప్పటికైనా పాలకులు స్పందించి చెరువుల కబ్జాలపై నిర్మించిన భవనాలను తొలగించాలి భవిష్యత్ తరాలకు ఇటువంటి ముప్పు వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలి.



**— తోట సుధాకర్ (హనుమకొండ)**

## పేద విద్యార్థికి రూ.50 వేల ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన ఇందు అనే నిరుపేద అమ్మాయి ఎంబిబిఎస్ సీటు పొందినప్పటికీ డబ్బులేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని పుడమి ఫౌండేషన్, అంబేద్కర్ యువజన సంఘం, వారు సర్పంచ్ టీచర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి చిట్యాల గ్రామంలో నివసిస్తున్న ఇందు కుటుంబాన్ని కలిసి ఇందుకు సర్పంచ్ టీచర్ రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ టీచర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు డబ్బులు లేని కారణంగా ఉన్నత చదువులు మధ్యలోనే వదిలేయవద్దనే ఉద్దేశంతోనే నా వంతుగా ఆర్థిక సహాయాన్ని అందించానని, మరింత మంది దాతలు ముందుకు వచ్చి పేద విద్యార్థిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి మానవ హక్కుల కార్యకర్త పృథ్వీరాజ్, మక్తల్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు వెంకటపతి రాజు, పుడమి ఫౌండేషన్ చైర్మన్ వై.చంద్రశేఖర్, డీటిఫ్ రవికుమార్, కర్నీ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు, ఆంజనేయులు, చిట్యాల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావును పరామర్శించిన ఉప్పల వెంకటేష్



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావును తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, ఉప్పల వెంకటేష్ పరామర్శించారు. మాజీ మంత్రి హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ అనారోగ్యంతో మరణించడంతో సోమవారం వారి ఇంటికి వెళ్లి హరీష్ రావు తండ్రి సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట జేపిని ఓయూ కరాటే రాజునాయక్, తలకొండపల్లి మాజీ రైతుల సంఘం అధ్యక్షులు గోపాల్‌నాయక్ ఉన్నారు.

## మానసిక స్థితి సరిగా లేక వ్యక్తి ఆత్మహత్య



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం పిన్నెంచర్ల గ్రామానికి చెందిన అంకె నాగన్న (48) మానసిక స్థితి సరిగా లేక ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు పోలీసులు తెలిపారు. అంకె నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గత ఎనిమిది సంవత్సరాల క్రితం నాగన్న భార్య అగ్ని పద్మ చనిపోయారు. ఐదు సంవత్సరాల క్రితం బ్రతుకుదెరువు నిమిత్తం హైదరాబాదులో ఉంటున్నట్లు నరేష్ తెలిపారు. వారి తండ్రి అగు నాగన్న పిన్నంచర్ల గ్రామంలో ఒక్కడే ఇంట్లో ఉండేవాడని, గత కొంతకాలంగా మద్యానికి బానిసై విపరీతంగా తాగేవాడని, 15 రోజుల క్రితం నుండి మద్యం బంద్ చేయడం వలన, మానసిక స్థితి సరిగా లేక ఈ నెల 2వ తేదీన ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకున్నట్లు ఈ విషయము వారి సమీప బంధువుల ఫోన్ ద్వారా తెలియజేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

## బావిలో పడి మహిళ మృతి



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన సింగనమణి అంజనమ్మ (50) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు పోలీసుల కథన ప్రకారం భర్త వెంకటయ్య మృతి చెందగా అంజనమ్మ హైదరాబాద్‌లో కుమారుని వద్ద ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చిన అంజనమ్మ సోమవారం ఇంటికి సమీపంలోని మంచినీళ్ల బావిలో ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై కే.రాణి ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ మండల పరిధిలోని పారేవుల గ్రామంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం వరి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ యార్డ్ చైర్మన్ గవినోళ్ల రాధమ్మ, ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సోదరుడు వాకిటి శేషగిరి, హాజరై మాట్లాడుతూ వరికి మద్దతు ధరతో పాటు, రూ.500 బోనస్ కూడా ప్రజా ప్రభుత్వం అందజేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బి.గణేష్ కుమార్, మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, డైరెక్టర్లు విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ , శాలంబిన్ ఓమర్, ఫయాజుద్దీన్, ఏఈఓ విజయ్, మాజీ సర్పంచ్ మనివర్ధన్, రవీందర్ రెడ్డి, ఆంజనేయులు, వసంత్ రెడ్డి, నాగరాజ్ గౌడ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

### దామరగిద్ద మండలంలో...



**ప్రజాపక్షం/దామరగిద్ద :** దామరగిద్ద మండలంలోని 8 గ్రామాల్లో ఐకేపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ముఖ్యఅతిథిగా వచ్చిన నారాయణపేట జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి ప్రారంభించారు. కందెనపల్లి, అయ్యవారిపల్లి, చాకలోనిపల్లి, ఆశాన్ పల్లి, లోకుర్తి, నర్సాపుర్, అన్నాసాగర్, మొగలమడ్క గ్రామాల్లో ఒకటే సారి 8 సెంటర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, పిఏసిఎస్ దామరగిద్ద చైర్మన్ పుట్టి ఈదప్ప, ఎంఎల్‌ఏ పిఎ మాధవ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ వెంకటప్ప, జిల్లా కోఆప్షన్ మెంబెర్ ఖాజా మియా, తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీఓ సాయి లక్ష్మి , అగ్రికల్చర్ ఏఈఓ, సెర్ప్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు. సదాశివ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎవరు కూడా దళారులను నమ్మి మోసపోకండి అని ప్రభుత్వం వరికి మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ కూడా ఇస్తుందని ప్రభుత్వమే అఖిరి గింజ వరకు కొంటుందని చెప్పారు.

## నూరు శాతం సబ్సిడీతో చేప పిల్లల పంపిణీ



**ప్రజాపక్షం/మాగనూర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి 100% సబ్సిడీతో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం సోమవారం మాగనూర్ మండల కేంద్రంలో మాగనూర్ గ్రామ పెద్ద చెరువులో మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి కొరకు ప్రభుత్వ డెబ్భై ఎనిమిది వేల, చేప పిల్లలు వదలడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు ఏ కాంత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఈ ఆనంద్ గౌడ్, ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీ సెక్రెటరీ తిమ్మప్ప, మత్స్య పరిశ్రమ సహకార గ్రామ అధ్యక్షులు & జిల్లా డైరెక్టర్ పుంజనూరు ఆంజనేయులు, జిల్లా డైరెక్టర్ గేట్ హనుమంతు, ఫీల్డ్ ఆఫీసర్ వర్ధన్, అనిల్ కుమార్, గ్రామ సొసైటీ ఉపాధ్యక్షులు దండు ఆనంద్ కార్యదర్శి గడ్డం నరేష్, డైరెక్టర్ దండు సబవరాజ్, బులిమేని దేవప్ప, వర్కూర్ ఆంజనేయులు, వాకిటి శ్రీనివాసులు, వాకిటి వెంకటయ్య, పుంజనూరు మహేదేవ్, టప్ప రమేష్, దండు వంశీ, కోల్పూర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ రాష్ట్ర గంజాయి సరఫరా ముఠా అరెస్టు




ఎస్పీ డాక్టర్ వినీత్

**ప్రజాపక్షం/నారాయణపేట్:** నారాయణపేట జిల్లా పోలీస్ ప్రత్యేక చర్యలో భాగంగా, గంజాయి సరఫరా చేస్తున్న అంతర్ రాష్ట్ర ముఠాను అరెస్టు చేసి, 12.4 కిలోల గంజాయి, రూ.10,000 నగదు, 10 మొబైల్ ఫోన్లు, 2 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని 10 మంది నిందితులను రిమాండ్‌కు తరలించడం జరిగిందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పత్రిక సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలో తేదీ: 0211 2025 న మధ్యాహ్నం 3:00 గంటల సమయంలో కృష్ణ మండలంలోని కున్సి గ్రామ శివారులో ఎస్సై యస్.యం. నవీద్, కృష్ణ పోలీసులు వాహనల తనిఖీల చేస్తుండగా ఈ తనిఖీల్లో రెండు బైకుల పై ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని క్షుణ్ణంగా పరిశీలించగా, వారి వద్ద సంచిలో గంజాయిని అక్రమంగా నారాయణపేట జిల్లాకు రవాణా చేస్తున్నట్లు తెలిసిందని అట్టి వారిని విచారించగా కొంత సమాచారం మేరకు వెంటనే పోలీసు బృందం కృష్ణ రైల్వే స్టేషన్ వద్ద మరో ఐదుగురు వ్యక్తులను గుర్తించి పట్టుకోవడం జరిగిందని అట్టి విచారణలో నిందితులు మహారాష్ట్ర రాష్ట్రంలోని సోలాపూర్, కర్ణాటక రాష్ట్రంలోని యాదగిర్ జిల్లాల నుండి గంజాయిని రవాణా చేసి తెలంగాణ రాష్ట్రంలో చిన్న ప్యాకెట్లలో విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. తదుపరి విచారణలో, నిందితులు గత రెండు సంవత్సరాలుగా అంతర్ రాష్ట్ర ముఠాగా ఏర్పడి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు తేలిందని నిందితుల్లో ఒకరైన సుఫియాన్ షాకు నారాయణపేటలో గతంలో నమోదైన కేసులో ప్రమేయం ఉన్నట్లు తెలిసిందని అట్టి నిందితులను విచారించగా వారి వద్ద నుండి, 12.4 కిలోల గంజాయి, 2 మోటార్ సైకిళ్లు, 10,000 వేల రూపాయల నగదు, 10 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని, అట్టి నిందితులందరిని న్యాయస్థానం ముందు హాజరు చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించడం జరిగిందని ఎస్పీ తెలిపారు. యువత భవిష్యత్తు చెడగొట్టే మాదకద్రవ్యాల నుండి సమాజాన్ని రక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యతని ప్రజలు కూడా ఇలాంటి చర్యలను గమనిస్తే వెంటనే పోలీస్ టోల్ ఫ్రీ నంబర్ 1908 లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న అధికారులు డీఎస్పీ నల్లపు లింగయ్య, పర్యవేక్షణలో మక్తల్ సిఐ రామ్ లాల్, కృష్ణ ఎస్సై, యస్.యం.నవీద్, టాస్క్ ఫోర్స్ ఎస్సై. పురుషోత్తం, టాస్క్ ఫోర్స్ పోలీసులు ఎచ్ సి. గొప్య నాయక్, టి. రాఘవేంద్ర గౌడ్, ఎం. రామస్వామి, ఎన్.అశోక్ కుమార్, శ్రీకాంత్‌లను ఎస్పీ అభినందించి త్వరలో రివార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

# పంట నష్ట బాధితులను తక్షణమే ఆదుకోవాలి



సిపిఐ నాయకుల పరిశీలన

**ప్రజాపక్షం/పానుగల్ :** తుఫాన్ వర్షానికి వరి రైతులకు తీవ్ర నష్టం జరిగిందని ఎకరాకు రూ.50 వేల సహాయం యుద్ధ ప్రాతిపదికన అందించి ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ డిమాండ్ చేశారు. పానుగల్ మండలం పానుగల్, కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి, చిక్కేపల్లి, వెంగలాయిపల్లిలలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. తుఫాన్‌కు కోతకు వచ్చిన వరిచేలు పొలాల్లో చాపలా పడిపోయాయని నీళ్లు నిలిచి మొలకలు వస్తున్నాయ్ అన్నారు. ఇంకా కోతకు దాని చేలు కూడా పడిపోయాయని నీళ్లలో తడిసి గింజ పడకుండా పోయే పరిస్థితి ఉందన్నారు. ఎకరాకు రూ.70వేల విలువగల ధాన్యం పండేదని పెట్టుబడి రూ.40వేలు పోను 30000 లాభం వచ్చేవదని పంట నీటి పాలు కావడంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. కనీసం 50,000 పరిహారం ఇస్తేనే కొంత ఊరట లభిస్తుందన్నారు. రోహిణి కార్తిలో నాట్లు వేసిన వరి చేలు కోస్తున్నారని గ్రామాల్లో ధాన్యం పోసుకునేందుకు స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.వెంటనే కొనుగోలు కేంద్రాలు తెరవాలని డిమాండ్ చేశారు. రబీలో కొన్న ధాన్యానికి ఇంతవరకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వలేదని ఇవ్వాలన్నారు. ఖరీఫ్ లో కొనే ధాన్యానికి మద్దతు ధరతో పాటు 500 బోనస్ ఒకేసారి చెల్లించాలన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోకుంటే రైతులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్మిక సభ్యుడు జే.రమేష్, మండల కార్యదర్శి దంగు కుర్మయ్య, మాజీ ఉప సర్పంచ్ బాలస్వామి, మాజీ వార్డు సభ్యుడు పెంటయ్య, రైతులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, స్వయంగా వ్యాపారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వీధివ్యాపారులకు తైబజార్ రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని ప్రజలను కోరారు. చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని, అందుకే మీ పిల్లలు ఎంతవరకు చదువుతామంటే అంత వరకు చదివించాలని ఆయన చెప్పారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఆరోగ్య భీమా ఉన్న ప్రతి ఒక్కరు ధైర్యంగా జీవించగలరని, అందరూ ఆరోగ్య భీమా పొందాలని సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని గత ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపిస్తూ ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి పేదవారికి సొంతింటి కల నెరవేరుస్తామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పి వెంకటేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఇంచార్జి గోనెల శ్రీనివాస్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, మాజీ మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం సభ్యులు ఎం.చందు, ఎన్.వెంకటేశ్, ఆంజనేయులు, అన్నపూర్ణ, జగదీష్, సి.కృష్ణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# అర్జీలు త్వరగా పరిష్కరించాలి




కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** ప్రజావాణిలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలు త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పాల్గొన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయడం, సమస్యలను నేరుగా విని వెంటనే పరిష్కారం చూపించడం లక్ష్యంగా ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణికి వచ్చిన 73 మంది దరఖాస్తుదారులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని దరఖాస్తు పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు ఎండార్స్‌మెంట్ చేశారు. అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై సూచనలు చేశారు. ఆయా శాఖల జిల్లా అధికారులు వారికి కేటాయించిన సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కెజిబివిలను నెల మొదటి వారంలో తనిఖీ చేసి విద్యా యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. వానాకాలం పంట కొనుగోలుకు సంబంధించి ఐకెపిపిఏసిఎస్‌ల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కనీస సౌకర్యాలను కొనుగోలు కేంద్రాలలో కావలసిన సదుపాయాలు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్రారంభించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంపై మండల ప్రత్యేక అధికారులు పంచాయితీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు ఏసి ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసుకోనని లబ్దిదారులను రద్దు చేసి వారి స్థానంలో స్థానిక శాసనసభ్యులతో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో చర్చించి కొత్తగా ప్రతిపాదనలను పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు ఆందోళన



**ప్రజాపక్షం /వనపర్తి టౌన్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం.ఆది మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ గత ఆరు ఏళ్ల నుండి ప్రభుత్వం చెల్లించడం లేదని 2023 నుంచి 2026 వరకు 6,300 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన దగ్గర నుండి విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజులు అలాగే గత ప్రభుత్వా హయంలో 4100 కోట్లు బకాయిలు ఉన్నాయని మొత్తం 1200 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చి వాటిలో కేవలం 300 కోట్లు చెల్లించారని మిగతా బకాయిలు చెల్లించకపోవడం దుర్మార్గమని అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే పిఏకి అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వీరన్న నాయక్, ఆంజనేయులు, ఆర్.ఈశ్వర్, సాయి, ఈశ్వర్ నాయక్, శివ, రమేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**ప్రజాపక్షం/జడ్చర్ల :** ఊర్కొండ పేట శ్రీశ్రీశ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయాన్ని, దర్గాను జడ్చర్ల శాసన సభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం గ్రామ అభివృద్ధి కార్యక్రమాల భాగంగా 600 మీటర్ల పొడవు గల సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజా సౌకర్యాల మెరుగుదల తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, ప్రతి గ్రామంలో రోడ్లు, లైటింగ్, నీటి సదుపాయాల వంటి మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.



## పంటలు పరిశీలించిన సిపిఐ బృందం

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ఇటీవల తుఫాను వర్షానికి దెబ్బతిన్న వరి పంటలను మండల సిపిఐ బృందం పరిశీలించింది. తూముకుంట, బొల్లారం, కొర్లకుంట గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వంక గోపాల్, సిపిఐ మండల కార్యదర్శి ఎం.కురుమయ్య మాట్లాడారు. వర్షాలకు పంటలు నేల కరిచి నీళ్లలో నాని మొలకెత్తున్నాయని, పచ్చగా ఉండి పడిపోయిన చేల కంకులు తాలు పోయే పరిస్థితి ఉందన్నారు. పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఎకరానికి రూ. 50,000 నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలి అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు. ముందుగా కోసిన వరిచేలా ధాన్యం ఎక్కడ పోసుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బొల్లారంలో కేంద్రం తెరిచిన స్థలం సరిపోదు అన్నారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు నీడ ప్రాథమిక చికిత్స కిట్టు ట్రాన్స్‌పోర్ట్ తదితర సౌకర్యాలతో కేంద్రాలు తెరవాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి ఎం.కురుమయ్య, నాయకులు కృష్ణయ్య, వేమన్న, వెంకటయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 48 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 48 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ తమ సమస్యలను పరిష్కరించాలని కొరుతూ అర్జీలను అందజేశారు. స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ప్రజల నుంచి అర్జీలను సేకరించి,చ వారి సమస్యలను సావధానంతో విన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. శాఖల వారీగా ఆయా ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండలం జూరాల గ్రామంలో సోమవారం పిఎసిఎస్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర పశుసంవర్ధక క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారం ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాలు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు పిఎసిఎస్ చైర్మన్ గాడి కృష్ణమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమేష్, నల్లగొండ శ్రీనివాసులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 42% రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చాలి



**ప్రజాపక్షం/ఉట్కూర్ :** రాష్ట్రంలో రెండు కోట్ల మంది బీసీ ప్రజల జీవితాలు మార్చే ఈ 42% బీసీ రిజర్వేషన్లు పార్లమెంట్ లో చట్టం చేసి 9 వ షెడ్యూల్లో పెట్టాలని 42% బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం ఉట్కూర్ మండల తహశీల్దార్ రవికి వినతిపత్రం సమర్పించారు. బీసీల భవిష్యత్తుకు దోహదం చేసే రిజర్వేషన్లను పార్లమెంటులో చట్టబద్ధం చేసి, 9 వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. 42% రిజర్వేషన్ల సాధన సమితి చైర్మన్ చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య, ప్రెసిడెంట్ రిటైడ్ ఏఏఎస్ చిరంజీవులు, బీసీ ఎస్సీ సీఎస్టీజేఏసీ జిల్లా కో కన్వీనర్ నరేష్, ముదిరాజ్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు అంబాదాస్,ధర్మ సమాజ్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు గోపాల్ , కృష్ణ, మండల కన్వీనర్ వేణు, కో కన్వీనర్ అంజయ్య, మీడియా ఇంచార్జి నరసింహ, మండల నాయకులు శేఖర్, గ్రామ నాయకులు అశోక్, ఆనంద్, అజయ్, రాజు, జాషువా, అంజి, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్టాపన

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండలం గున్ముక్ల గ్రామంలో శివాలయ దేవాలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్టాపన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చరణలో మధ్య గ్రామ భక్తుల శివ నామాలతో ప్రతిష్టాపన మహోత్సవం జరిగింది. అంతకుముందు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రోత్సరాల మధ్య ధ్వజస్తంభంతో పాటు నంది విగ్రహ ప్రతిష్టాపన విగ్రహాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయ ఆలయ కమిటీ సభ్యులు ఆలయ నిర్మాణ దాతలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులు బాలయ్య గౌడ్, నరసింహారెడ్డి, కృష్ణయ్య, నరసింహులు, పూజారి నాగార్జునతో పాటు పలువురు పాల్గొన్నారు.



## లైసెన్స్ సర్వేయర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** లైసెన్సుడ్ సర్వేయర్లకు గౌరవ వేతనం తోపాటు విధి విధానాలతో కూడిన గైడ్‌లైన్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా లైసెన్సుడ్ సర్వేయర్లు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఐదు నెలల పాటు శిక్షణ కల్పించిందని, అనంతరం ఉత్తీర్ణత సాధించామని లైసెన్సులు జారీచేసి చాలా రోజులు అవుతున్నా కానీ నేటికి విధుల్లోకి తీసుకోకపోవడం అన్యాయమన్నారు. భూభారతి చట్టం అమల్లో భాగంగా లైసెన్స్ సర్వేయర్ల వ్యవస్థను బలోపేతం చేస్తూ భూ వివాదాల సమస్యల పరిష్కారానికి తీసుకున్న నిర్ణయం గొప్పదని హర్షం వ్యక్తం చేశారు. నెలవారీ గౌరవ వేతన సదుపాయం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లైసెన్సుడ్ సర్వేయర్లు పంతంగి సాలయ్య, ఈట ప్రశాంత్, గోపిరెడ్డి, సునీల్, రాజు, నాగార్జున, మల్లయ్య పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు.ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ డే లో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 45 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా పనిచేయాలని ఆదేశించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని,పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని అన్నారు.



## ఎగ్జిబిషన్‌ను యువత సద్వినియోగం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట :** మెడ్‌ఎక్స్2025 ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో సోమవారం రెండు రోజులపాటు నిర్వహించే మెడ్‌ఎక్స్2025 పేరిట నిర్వహించే ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులచే చేసిన స్టాల్స్ వీక్షించారు. ఈ స్టాల్స్‌లలో సిపిఆర్, శరీర భాగాల పని విధానం, దోమల ద్వారా వ్యాపించే రోగాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఎగ్జిబిషన్ ద్వారా ప్రత్యక్ష వర్క్‌షాప్‌లు, క్లినకల్ ప్రదర్శనలు, వైద్య నిపుణులతో సంభాషణ, అత్యాధునిక ల్యాబ్‌లు, మ్యూజియం సందర్శన, వైద్య విద్యార్థి జీవితంపై సీనియర్ వైద్యులు, ప్రొఫెసర్లు లాంటి నిపుణుల ప్రసంగం, కెరియర్ గైడెన్స్‌కు చెందిన నీట్‌కు ఎలా సన్నదం అవ్వాలో తెలుపుతారన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో 8వ తరగతి నుండి ఇంటర్ రెండవ సంవత్సరం చదివే విద్యార్థులు హాజరై పాల్గొని వాటిపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. మొదటి రోజు ఎగ్జిబిషన్‌ను 1700 మంది సందర్శించినట్లు, రెండవ రోజు ఉదయం 9.30 నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపల్ జయలత తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సూపరింటిండెంట్ శ్రవణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, జీమియా, హెచ్‌ఓడిలు బాబురావు, కృష్ణయ్య, గురురాజ్ పాల్గొన్నారు.

## ఎండ వచ్చిన తర్వాతే పత్తిని తెంపాలి

### పత్తి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/మునుగోడు/మర్రిగూడ :** పత్తి రైతులు ఎండ వచ్చిన తర్వాత పత్తిని తెంపాలని అప్పుడే తేమ ఎక్కువగా లేకుండా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.మునుగోడు మండలంలోని సలసర్ బాలాజీ మిల్లు లో సిసిఐ ద్వారా కొనుగోలు చేస్తున్న పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.సరైన తేమ శాతం 8 నుండి 12 మధ్య వచ్చిన వెంటనే సిసిఐ అధికారులు పత్తిని కొనుగోలు చేయాలని కోరారు. రైతులు ఉదయం పూట కాకుండా ఎండ వచ్చిన తర్వాత పత్తిని తెంపాలని, ముఖ్యంగా చలికాలం ఉదయం సమయంలో మంచు వల్ల తేమ ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, అలా కాకుండా ఎండ వచ్చిన తర్వాత పత్తిని తీసినట్లైతే తేమ తక్కువగా ఉంటుందని తెలిపారు. మిల్లులలో సరైన స్థలం ఉన్నట్లయితే ఒకటి లేదా రెండు రోజులు పత్తిని మిల్లులో ఉంచుకునేందుకు అవకాశం కల్పించాలని ఆమె మిల్లు యాజమాన్యానికి సూచించారు. మంచు కురుస్తున్నందున పత్తిని ఆరబెట్టుకొని పూర్తిగా ఎండిన తర్వాతే కొనుగోలు కేంద్రాలను తీసుకురావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. 12 శాతం లోపు వస్తేనే గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులకు సూచించారు. ఆమె వెంట చందూర్ ఆర్‌డిఓ శ్రీదేవి, తాహసిల్దార్ నరేష్, సిసిఐ అధికారులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** నాణ్యమైన ఆభరణాలు వినియోగదారులకు అమ్మి వారి మన్ననలు పొందాలని జబర్దస్త్ యాంకర్, సినీ నటి అనసూయ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంజి రోడ్డులో మణిముఖర గోల్డ్ షాప్‌ను ఆమె సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గత 13 సంవత్సరాలుగా సాయి సంతోషి జ్యూవెలర్స్ ద్వారా వినియోగదారుల మనుసులు గెలుచుకున్న వారు నూతన జ్యూవెలర్స్‌తో ప్రజలకు దగ్గరవడం సంతృప్తికరమన్నారు. రాష్ట్ర రాజధానిని తలదన్నేలా కార్పోరేట్ స్థాయిలో జ్యూవెలర్స్ షాప్‌ను ఏర్పాటు చేసిన తెడ్ల కిషోర్, ఉమమహేశ్వరి వారి కుమారుడు సాయికిరణ్, చాందినిలను ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆభరణాలు లైట్‌వెయిట్‌తో అందరికి అందుబాటు ధరలకే అందరిని ఆకట్టుకునేలా ఉన్నాయని ప్రజలు సద్వినియోగిపర్చుకోవాలని కోరారు.

## డ్రోన్‌తో గొర్రెల కాపరులకు సరుకులు



**ప్రజాపక్షం/డిండి :** గుండ్లపల్లి మండలంలోని గోనబోయినపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు గొర్రెల కాపరులు గత 10 రోజుల కిందట వారికి చెందిన 300 గొర్రెలు, మేకలను మేపెందుకు సిద్దాపూర్ గుట్టల్లోకి వెళ్లగా ఇటీవల కురిసిన వర్షాలు, డిండి డ్యాం అలుగు పారడంతో మళ్ళీ తిరిగి గ్రామానికి రావాలంటే వరద ఉధృతి ఎక్కవై గొర్రెల కాపారులు వాగు దాటలేని పరిస్థితి ఎదురవడంతో దుందుభి వాగు అవతలే ఉన్నారు. వారి వద్ద తినడానికి నిత్యావసర సరుకులు అయిపోవడంతో గ్రామస్థుల ద్వారా సోమవారం డిండి తహశీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ కు సమాచారం అందడంతో దేవరకొండ ఆర్డివో రమణారెడ్డికి విషయాన్ని తహశీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ చేరవేశారు. సోమవారం ఆర్డివో ఆధ్వర్యంలో వారికి సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం సమకూర్చారు. వాగులో అత్యధికంగా నీటి ప్రవాహం ఉండడంతో మనుషులు దాటలేని పరిస్థితి నెలకొనడంతో డ్రోన్ తెప్పించి డ్రోన్ సహాయం తో నిత్యావసర సరుకులు, బియ్యం గొర్రెల కాపరుల వద్దకు పంపించారు.

# ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం

### భారీ వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్




**ప్రజాపక్షం/చండూరు:** భారీ వర్షాల కారణంగా పత్తి ,వరి పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం కోరారు. సోమవారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మ భవనంలో మునుగోడు నియోజకవర్గ మండల కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వర్షాలకు తడిసిన పత్తి ,ధాన్యాన్ని ఎలాంటి షరతులు ,కొర్రీలు లేకుండా బేషరత్తుగా కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. తుఫాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు 50వేల రూపాయల నష్టపరిహారాన్ని ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత నిబంధనల ప్రకారం సిసిఐలో పత్తిని కొనుగోలు చేసి ఎకరాకు 7 క్వాంటాలు కాకుండా 12 క్వింటాళ్ళ పత్తిని కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. డిసెంబర్ 26న ఖమ్మం పట్టణంలో నిర్వహించే సిపిఐ శతశజంతి ఉత్సవాల ముగింపు సభకు వేలాదిగా తరలాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. నవంబర్ 15న సిపిఐ రాష్ట్ర ప్రచార జాత బస్సు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రం నుండి ప్రారంభమై ఈ నెల 17న నల్గొండ జిల్లా డిండి మండలానికి చేరుకుంటుందని అటు తర్వాత దేవరకొండ , మునుగోడు ,నకిరేకల్, నల్గొండ ,మిర్యాలగూడ నియోజకవర్గాల మీదుగా సాగుతున్న ప్రచార జాతను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య అధ్యక్షత మహించగా సమావేశంలో సిపిఐ జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు ఆర్ అంజయ్య చారి,గురుజ రామచంద్రం, బొల్గూరి నర్సింహ్మా, తీర్పారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శులు నల్పరాజు సతీష్ కుమార్, సూదనబోయిన రమేష్, భీమనపల్లి రమేష్ , బుర్ర శేఖర్ ,కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, బొమ్మరబోయిన లాలు, తిప్పర్తి రాములు , బూడిద సురేష్ , ఈదుల బిక్షం రెడ్డి, బరిగెల వెంకటేశ్ పాల్గొన్నారు.

**పత్తి 12 తేమ శాతం ఎత్తివేయాలి**

**ప్రజాపక్షం/మునుగోడు:** ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వ సిసిఐ పత్తి కొనుగోలుకు 8 నుంచి 12 శాతం ఉన్న నిబంధనను ఎత్తివేసి 20 శాతం వరకు పెంచాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ప్రభుత్వాని కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మొంధా తుఫాన్ వల్లన వరి, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతినిపోయయని పేర్కొన్నారు. ఆయన వెంట సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పిటిసి గోస్కొండ లింగయ్య,ఈదులకంటి కైలాస్, తీరాందాస్ శ్రీను,కట్కూరి లింగస్వామి, తదితరులు ఉన్నారు.




## కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వాలి

### మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జంగమ్మ డిమాండ్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీని వెంటనే నిలబెట్టుకోవాలని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భువనగిరిలోని జిల్లా కార్యాలయంలో మహిళా సమాఖ్య జిల్లా కౌన్సిల్ సమావేశం సోమన సబిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బండి జంగమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా 6 గ్యారంటీలోని గ్యాస్ సబ్సిడీ, నెలకు ప్రతి మహిళా కుటుంబానికి రూ.2500 వెంటనే ఇవ్వాలని చెప్పారు. వితంతు, ఒంటరి మహిళ పెన్షన్ లను వెంటనే మంజూరు చేయాలన్నారు. నిత్యం పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను అరికట్టాలని డిమాండ్ చేశారు. రోజురోజుకు మహిళలకు పై జరుగుతున్న దాడులు అరి కట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని ఆమె ఆరోపించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 100 సంవత్సరాల శతజయంతి ఉత్సవాల ముగింపు సభ డిసెంబర్ 26న ఖమ్మంలో జరుగుతుందని తెలిపారు. ఈ బహిరంగ సభకు జిల్లాలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, జిల్లా గౌరవ అధ్యక్షురాలు గుర్రం రాజమణి, నాయకులు వడ్లకొండ భారతమ్మ, మాటూరి జానమ్మ, మాధవి, చిట్టి, సంధ్యారాణి, రజిత, జయమ్మ, ధనలక్ష్మి , మంగమ్మ పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.30లక్షలు

### రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్ పట్టణ శివారులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనున్న వ్యవసాయ కళాశాల నిర్మాణం కొరకు 1041 సర్వే నంబర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.30లక్షల చొప్పున ప్రభుత్వం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని బైపాస్ రోడ్డులో భూనిర్వాసితుల సమావేశం కాకి అమృతారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆదివారం తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి రైతు సంఘం ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఎకరాకు రూ.30లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, తవ్విన బావికి రూ.3లక్షలు, బోరుకు రూ.2లక్షలు పరిహారంగా ఇవ్వాలని, పశువుల కొట్టం, పశువుల జీవులకు సంబంధించి 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ మెమోరాండం ద్వారా ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. మంత్రి తమ డిమాండ్స్ పట్ల సానుకూలంగా స్పందిస్తూ, ఇందిరమ్మ ఇల్లు, ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, తప్పక ఇస్తామని, వీటితోపాటు ఎకరాకు రూ.30లక్షల నష్టపరిహారం గురించి ప్రయత్నం చేస్తామని చెప్పినట్లు వివరించారు. భూనిర్వాసితుల డిమాండ్‌కు మద్ధతుగా కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మంత్రికి మెమోరాండం ఇచ్చినట్లు గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం తరపున కూడా వినతిపత్రం అందించామన్నారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ ఎకరాకు రూ.30లక్షల నష్టపరిహారం, 2013 చట్టం ప్రకారం పునరావాసం కల్పించి రైతన్నలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొప్పొజు సూర్యనారాయణ, ఎం ప్రభులింగం, రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాస్, రాష్ట్ర కోశాధికారి డిజి నరేంద్రప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవర మల్లేశ్వరి, భూనిర్వాసితుల కమిటి కన్వీనర్ కాకి అమృతారెడ్డి, కోకన్వీనర్ చెన్నగాని సైదులు, పోలగాని సైదు లు, పశ్యలక్ష్మి , ఇందిరాల రమేష్, సోమగాని కృష్ణమూర్తి, వారణాసి నాగరాజు, జెనిగ నాగమణి, చిన్నగాని శ్రీను, మామిడి బెంజి, గోసుల నరసింహ, సోమగాని లక్ష్మి , కటారి లింగయ్య, ఇందిరాల రవి, వెంకన్న, పుల్లెంల వీరమ్మ, వారణాసి సైదులు, లింగరాజు పాల్గొన్నారు.

## పుల్లయ్య చారి మరణం సిపిఐకి తీరని లోటు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో పోలోజు పుల్లయ్య చారి(48) ప్రమాదవశాత్తు గత రెండు నెలల క్రితం హైదరాబాద్ అంబర్పేట్‌లోని రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. తల భాగంలో దెబ్బలు తగలడంతో సర్జరీ చేయించుకుని వైద్యుల సూచన మేరకు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి తుది శ్వాస విడిచారు. పుల్లయ్య చారి మృతదేహంపై సిపిఐ నాయకులు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. పుల్లయ్య చారి పార్టీ కార్యక్రమాలలో క్రమశిక్షణతో పాటు నిబద్ధతకు మారుపేరని అన్నారు. గొప్ప కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిని కోల్పోయామని, ఆయన మరణం సిపిఐ పార్టీకి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ దేసిడి నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రుద్ర రాములు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు అంజయ్య పాల్గొన్నారు.





## సమయపాలన పాటించని వైద్యులపై చర్యలు తీసుకోవాలి : సిపిఐ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ ఆసుపత్రులకు వివిధ రకాల వైద్య సేవలకు వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి సౌకర్యాలు కల్పిస్తున్నా వైద్యులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తూ సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వస్తుండడంతో ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగుల బాదలు వర్ణనాతీతంగా మారాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమయ పాలన పాటించని వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందచేసి మాట్లాడారు. నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో వైద్య సేవల కోసం పేదలు ఏరియా ఆసుపత్రికి వస్తున్నప్పటికీ వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో వైద్య సేవలు అందక ఇటీవల ఒక మహిళ మృతి చెందిందన్నారు. ఉదయం 10గంటలకు వచ్చిన వైద్యులు అరకొరగా రోగులకు పరీక్షలు నిర్వహించి తమ సొంత క్లీనిక్‌లకు అధిక సమయం కేటాయిస్తున్నారని ఆరోపించారు. వార్డు బాయ్‌లు ఇంజెక్షన్లు, గ్లూకోస్ బాటిళ్లు పెడుతున్నారని ప్రశ్నించారు. మూత్రశాలలు, టాయ్‌లెట్లు లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నా పట్టింపులేదన్నారు. వినతిపత్రం అందచేసిన వారిలో సీపీఐ మండల కార్యదర్శులు అంజనపల్లి రామలింగం, జిల్లా యాదగిరి, మహిళా సమాఖ్య నాయకురాలు బంటు రాజేశ్వరి, దాసర్ల దుర్గమ్మ, ఎస్‌కె. షమీం, భాస్కర్, పరమేష్, గోగుల యాదగిరి, విజయ, వెంకన్న ఉన్నారు.

## సమాజంలో యాదవుల పాత్ర కీలకం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణలో యాదవ సమాజం ప్రముఖ పాత్ర పోషిస్తూ ఐకమత్యాన్ని చాటి చెబుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు.ఆదివారం రాత్రి పట్టణంలోని ఎన్‌జి కళాశాల మైదానంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళన వేడుకలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దున్నపోతులు చేసిన విన్యాసాలు పలువురు రాకట్టుకున్నాయి. దున్నపోతులను పట్టణంలో ఊరేగిస్తూ సదర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌సి సత్యం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ హైదరాబాద్‌కి పరిమితమైన సదరు ఉత్సవాలను నేడు పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో కూడా సదరు ఉత్సవాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, వర్రె వెంకటేశ్వర్లు సదర్ ఉత్సవ సమితి అధ్యక్షుడు మద్ది శ్రీనివాస్ యాదవ్,యాదవ సంఘం ట్రస్ట్ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, యాదవ్ గుండెబోయిన లింగయ్య, యాదవ్ పాల్గొన్నారు

# భారీ వర్షాలకు రైతులు పంటలు ధ్వంసం



రైతాంగాన్ని ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు యాదాద్రి జిల్లా తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** మొంథా తుపాన్ గత వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలో రైతులు వేసిన పలు పంటలు ధ్వంసం అయ్యాయాని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరు రాజయ్య అన్నారు. సోమవారం యాదాద్రి జిల్లా తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నష్టపోయిన వారందరూ ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదాలు ఉన్నాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 17 మండలాలలో భారీ వర్షాలు కురిసినవి వేసిన పత్తి పంటలు 70 శాతం రైతులు నష్టపోయినారని ఆయన చెప్పారు. వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రాజయ్య అన్నారు. మోత్కూరు ఇతర మండలాలలో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు సమగ్రంగా గ్రామాలకు వెళ్లి రైతులతో మాట్లాడి నష్టపరిహారం అంచనాలు వేయడంలో విఫలమవుతున్నారని అన్నారు. దత్తప్ప గూడెం గ్రామానికి కూడా అధికారులు వెళ్లి అంచనాలు వేయలేదని ఉదహరించారు. కార్యాలయంలో కూర్చుని ఫోన్ల ద్వారా సమాచారం తీసుకోవడం సమంజసం కాదని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి వ్యవసాయ శాఖ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులకు అధికారాలు ఇచ్చి నష్టపరిహారం అంచనా వేయించాలని డిమాండ్ చేశారు. పంటలకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వై.దామోదర్ రెడ్డి ప్రసంగిస్తూ అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అలాగే అన్ని రకాల బ్యాంకులు ఎలాంటి షరతులు, వడ్డీ లేకుండా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏషాల అశోక్, చెక్క వెంకటేష్, దాసరి లక్ష్మ య్య, రైతు సంఘం నాయకులు సురేందర్ రెడ్డి, మల్లారెడ్డి జక్క దయాకర్ రెడ్డి, ఎలగందుల అంజయ్య, యుద్ధం రెడ్డి, ఊట్కూరు కృష్ణ, యనగల రాజప్ప, కూర వెంకటేష్, నమిల సంజీవ, పేరబోయిన బంగారు, మొగుళ్ల తిరుపతిరెడ్డి, కల్లేపల్లి మహేందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## రైల్వే అండర్‌పాస్‌ను ఎస్‌పి పరిశీలన

**ప్రజాపక్షం/చిట్యాల:** ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై గల రైల్వే బ్రిడ్జి అండర్ పాస్‌లో నీరు నిలిచి ట్రాఫిక్‌కు ఏర్పడుతున్న అంతరాయానికి గల కారణాలను జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ట్రాఫిక్ జామ్ కావడానికి గల కారణాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షం నీరు పక్కనే ఉన్న పోతురాజు కుంటలోకి వెళ్ళే మార్గాలు మూసుకుపోయిన విషయాన్ని ఆయన దృష్టికి అధికారులు తెలియజేశారు. భవిష్యత్తులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా కావల్సిన చర్యల గురించి ఆయన వారితో చర్చించారు. నేషనల్ హైవే అథారిటి అధికారులు, మున్సిపల్, రెవిన్యూ అధికారులు వెంటనే స్పందించి రవాణా వ్యవస్థకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్‌పి ఆదేశించారు. ఆయన వెంట డిఎస్‌పి శివరాంరెడ్డి, సిఐ నాగరాజు తదితరులున్నారు.



# ప్రజావాణి దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులకు ఆదేశం

### ప్రజల నుండి 68 ఆర్జీల స్వీకరణ



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ భాస్కరరావులతో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి 68 ఆర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 56, ఎంప్లాయిమెంట్ 3, జిల్లా పంచాయతీ 2, ఇరిగేషన్ 2, ఎక్సైజ్, బీసీ వెల్ఫేర్, జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి, సర్వే ల్యాండ్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ మండల స్పెషల్ అధికారులతో సమీక్షిస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల స్పెషల్ అధికారులు క్షేత్రస్థాయిలో కేంద్రాలను తనిఖీ చేసి రైతులకు ఏ ఇబ్బంది కుండాచూడాలన్నారు. కేంద్రాలలో ధాన్యం తేమశాతం వచ్చిన వెంటనే కాంటా వేసి కొనుగోలు చేయాలని, లారీల కొరత లేకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం మిషన్లు సరిగా పనిచేస్తున్నాయా లేదా అని తరచూ పరిశీలించాలన్నారు. మండల ప్రత్యేక్ర అధికారులు క్షేత్రస్థాయిలో తరచూ పర్యటించాలని ఆదేశించారు.విధులలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బడి బాట కార్యక్రమంలో బాగంగా మండల స్పెషల్ ఆఫీసర్స్ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి రుచికరమైన భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలించాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల పై ప్రత్యేక ఫోకస్ పెట్టి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మండల స్పెషల్ అధికారులు సూచన చేస్తూ లబ్ధిదారులు వివిధ దశలో ఇళ్ల నిర్మాణం పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ జయమ్మ, డిప్యూటీ కలెక్టర్, జడ్పీ సీఈవో శోభారాణి, డిఆర్డిఏ పిడి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ విజయ సింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# క్రీడ

## ఇది మాకు సర్‌ప్రైజ్!

### కెప్టెన్ లారా వొల్వార్డ్ట్



వరుసగా రెండోసారి ఐసిసి వరల్డ్ కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాకు ఓటమే ఎదురైంది. నిరుడు టీ20 వరల్డ్ కప్ టైటిల్ పోరులో న్యూజిలాండ్ చేతిలో కంగుతిన్న సఫారీ టీమ్ ఈసారి వన్డే ప్రపంచకప్‌లో టీమిండియాకు తలవంచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఓటమిపై కెప్టెన్ లారా వొల్వార్డ్ట్ స్పందిస్తూ తమకు భారత స్టార్ బౌలింగ్ తమకు పెద్ద సర్‌ప్రైజ్ అని వెల్లడించింది. పటిష్ట స్థితిలో ఉన్నవేళ ఆమె రాకతో బిగ్ వికెట్లు కోల్పోవడం తమ జట్టు విజయంపై ప్రభావం చూపించిందిన లారా చెప్పింది. వరల్డ్ కప్ ఫైనల్లో భారత బౌలర్లను ఎదుర్కోవడంపై గట్టి కసరత్తు చేసిన దక్షిణాఫ్రికాకు ఊహించని షాక్ తగిలింది. మిడిల్ ఓవర్లలో షఫాలీ బౌలింగ్‌కు రావడంతో ఆశ్చర్యపోయారు సఫారీ బ్యాటర్లు. ఇదే విషయాన్ని లారా వొల్వార్డ్ట్ ప్రస్తావిస్తూ.. 'ఫైనల్లో షఫాలీ వర్మ బౌలింగ్ చేస్తుందని మేము ఊహించలేదు. టీమిండియా నుంచి మాకు పెద్ద సర్‌ప్రైజ్ ఆమెనే. తను వికెట్ల ముందు.. స్లో బంతులతో ఇబ్బంది పెట్టడమే కాదు రెండు వికెట్లు తీసుంది. వరల్డ్ కప్ ఫైనల్లో పార్ట్‌టైమ్ బౌలర్‌కు వికెట్ ఇవ్వాలని ఎవరూ కోరుకోరు. కానీ, మేము రెండు పెద్ద వికెట్లు ఇచ్చేశాం. మేము ఏమాత్రం షఫాలీ బౌలింగ్ కోసం సిద్ధం కాలేదు. తాను గొప్పగా బౌలింగ్ చేసింది. అదే మ్యాచ్‌లో టర్నింగ్ పాయింట్ అయింది' అని మ్యాచ్ అనంతరం వెల్లడించింది.

**బిగ్ వికెట్లు తీసి..**

డీవై పాటిల్ స్టేడియంలో భారత్ నిర్దేశించిన 299 పరుగుల ఛేదనను దక్షిణాఫ్రికా దూకుడుగానే ఆరంభించింది. ఓపెనర్ తంజిమ్ బ్రిట్స్(23) త్వరగానే ఔటైనా కెప్టెన్ లారా వొల్వార్డ్ట్ (101) క్రీజులో పాతుకుపోయింది. ఆమెతో కలిసిసునే లుస్(25) కీలక పరుగులు చేయడంతో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ వికెట్ కోసం అన్ని ప్రయత్నాలు చేసింది. ప్రధాన బౌలర్లను విసిగిస్తున్న ద్వయాన్ని విడదీసేందుకు ఆమె పార్ట్‌టైమ్ బౌలర్ అయిన షఫాలీ వర్మ(2–36)కు బంతి అందించింది. అదే మ్యాచ్‌లో టర్నింగ్ పాయింట్ అవుతుందని ఎవరూ ఊహించలేదు. కానీ, షఫాలీ స్లో డెలివరీతో మ్యాజిక్ చేస్తూ లుస్‌ను రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపింది. ఆ తర్వాతి ఓవర్లోనే మరిజానే కాప్‌ను ఔట్ చేసి సఫారీలను కష్టాల్లో పడేసింది. ఆ తర్వాత దీప్తి శర్మ(5–39) ఐదు వికెట్లతో ప్రత్యర్థి విరిచింది. 46వ ఓవర్లో ఫినిషర్ డీక్లెర్క్(18) గాల్లోకి లేపిన బంతిని వెనక్కి పరుగెడుతూ హర్మన్‌ప్రీత్ అందుకోవడంతో భారత జట్టు తొలిసారి జగజ్జేతగా అవతరించింది.






## క్రికెట్ ఇకపై 'జెంటిల్‌మెన్ గేమ్' కాదు..

భారత మహిళల క్రికెట్ జట్టు చిరకాల స్వప్నాన్ని సాకారం చేసింది హర్మన్‌ప్రీత్ కౌర్. పదహారేళ్ల కెరీర్లో ఎన్నో ఆటుపోట్లను.. వరల్డ్ కప్ ఓటములను చవిచూసిన తను సొంతగడ్డపై మెగాట్రోఫీని అందించింది. మహిళా క్రికెట్‌లో సువర్ణాధ్యాయానికి నాంది పలికిన ఆమె కెప్టెన్సీని ఎంత పొగిడినా తక్కువే. చిన్నప్పటి నుంచి క్రికెట్టే లోకంగా బతుకుతున్న హర్మన్‌ప్రీత్ వరల్డ్ కప్ విక్టరీ తర్వాత విమర్శకులకు గట్టి హెచ్చరికే చేసింది. ప్రస్తుతం నెట్టింట వైరలవుతున్న ఫోస్ట్‌లో ఇంతకూ తను ఏం చెప్పిందో తెలుసా..? క్రికెట్ అనగానే 'జెంటిల్‌మెన్ గేమ్' అనే మాట గుర్తుకొస్తుంది. కానీ, ఈ మాటకు ఇక కాలం చెల్లిందని హర్మన్‌ప్రీత్ పరోక్షంగా చెప్పేసింది. అవును.. భారత మహిళల జట్టు దశాబ్దాల కలకు తెరదించిన ఆమె తన మనసులోని మాటను వ్యక్తం చేసింది. వరల్డ్ కప్ ట్రోఫీతో సోమవారం నిద్రలేచిన హర్మన్‌ప్రీత్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. అందులో ఆమె వరల్డ్ కప్ ట్రోఫీతో నిద్రిస్తోంది. ఆమె ధరించిన పుమా

### హర్మన్‌ప్రీత్ పోస్ట్ వైరల్!

టీషర్ట్ మీద 'క్రికెట్ అనేది జెంటిల్‌మెన్ గేమ్' అని రాసున్న అక్షరాలను కొట్టేసి ఉన్నాయి. వాటి కిందే 'ఎవ్రీవన్స్ గేమ్' అంటే.. ప్రతిఒక్కరి ఆట అని రాసుంది.

ఈ ఫోటో ద్వారా 'క్రికెట్ అనేది పురుషుల ఆటే కాదు మహిళల ఆట కూడా. మహిళా క్రికెటర్లు అద్భుతాలు చేయగలరు. వారు ఎవరికీ తీసిపోరు, ఇకనైనా మహిళా క్రికెటర్లను చిన్నచూపు చూడడం ఆపేయండి' అనే సందేశాన్ని చెప్పకనే చెప్పింది భారత కెప్టెన్. ఆదివారం ఫైనల్లో దక్షిణాఫ్రికాను 52 పరుగులు తేడాతో చిత్తుచేసిన టీమిండియా తొలిసారి విశ్వవిజేతగా అవతరించింది. నాయకురాలిగా జట్టును గొప్పగా నడింపించిన హర్మన్‌ప్రీత్.. దేశానికి మూడో వన్డే వరల్డ్ కప్ అందించిన కెప్టెన్‌గా చరిత్రకెక్కింది. కలల కప్ సాధించిన హర్మన్‌ప్రీత్ 2011 వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ ఎంఎస్ ధోనీ తరహాలో సోమవారం గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద ట్రోఫీతో ఫొటోలకు పోజిచ్చింది.

## గ్లోబల్ 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్'గా టామ్ మూడీ!

ఐపిఎల్ ఫ్రాంచైజీ లక్నో సూపర్ జెయింట్స్ వరుసగా కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇటీవలే కేన్ విలియమ్సన్‌ను వ్యూహాత్మక సలహాదారుగా తీసుకున్న లక్నో యాజమాన్యం ఈసారి ఆస్ట్రేలియా దిగ్గజానికి పెద్ద బాధ్యతలు అప్పగించనుంది. కోచ్‌గా సుదీర్ఘ అనుభవం కలిగిన వెటరన్ అయిన టామ్ మూడీని తమ ఫ్రాంచైజీ 'గ్లోబల్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్'గా నియమించనుంది లక్నో. అయితే.. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కోచ్‌గానూ పనిచేసిన టామ్ మూడీని లక్నో గ్లోబల్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా నియమించుకుంటే అతడు ఇకపై సిస్టర్ ఫ్రాంఛైజీల వ్యవహారాలను చూసుకోనున్నాడు. అంటే.. ఐపిఎల్‌తో పాటు ఎస్‌ఏ20లోని లక్నో సూపర్ జెయింట్స్, ది హండ్రెడ్ లీగ్‌లో మాంచెస్టర్ ఫ్రాంచైజీ కూర్పు, ఆటగాళ్ల ఎంపిక వంటివి మూడీ కనుసన్నల్లోనే జరుగనున్నాయి.

**మూడోసారి విజేతగా..**

పొట్టి క్రికెట్‌లో టామ్ మూడీ ట్రాక్ రికార్డు గొప్పగా ఉంది. ఈమధ్యే 'ది



హండ్రెడ్ లీగ్‌లో ఓవల్ ఇన్విసిబుల్స్ జట్టును మూడోసారి విజేతగా నిలిపాడు. అలానే ఇంటర్నేషనల్ 20లీగ్‌లో డెజర్ట్ వైపర్స్‌ను రెండుసార్లు ఫైనల్ చేర్చాడీ ఆసీస్ మాజీ ఆల్‌రౌండర్. తమ ఫ్రాంచైజీ కప్ కల నెరవేరుస్తాడని లక్నో యాజమాన్యం ఆశిస్తోంది. డిసెంబర్‌లో జరుగబోయే ఐపిఎల్ వేలానికి ముందే మూడీ టీమ్‌తో కలిసే అవకాశముంది. పంతొమ్మిదో సీజన్‌లో అతడు ప్రధాన కోచ్ జస్టిన్ లాంగర్, వ్యూహాత్మక సలహాదారు విలియమ్సన్‌తో కలిసి లక్నో గెలుపు ప్రణాళికలు రచించనున్నాడు.


# ఫోకస్ — యువతరంగం

## నిద్రలేమితో నష్టాలెన్నో



నిద్రలేమి వల్ల ఎన్నో నష్టాలున్నాయని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రత్యేకించి యువతపై దీని ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. నేటి విద్యా వ్యవస్థలో నెలకొన్న అవాంఛనీయ విధానాల కారణంగా విద్యార్థులకు తగినంత నిద్ర ఉండడం లేదని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. చాలా పాఠశాలలు, కాలేజీలు, విద్యా సంస్థలు తరగతులను ఉదయం చాలా త్వరగా ప్రారంభిస్తాయి. కానీ ఈ సమయాలు టీనేజ్ దశలోని పిల్లల సహజ నిద్ర సమయానికి పూర్తి వ్యతిరేకంగా ఉంటాయి. శాస్త్రీయంగా పరిశీలిస్తే, ఒక టీనేజ్ విద్యార్థిని ఉదయం 7 గంటలకు పాఠశాలకు హాజరయ్యేలా చేయడం అంటే, ఒక వయోజనుడిని ఉదయం 4 గంటలకు లేపి పనిచేయమని బలవంతపెట్టడంతో సమానం. యవ్వన దశలో మెదడు, హార్మోన్లు సహజంగానే మార్పులకు లోనవుతాయి. ఈ వయసులోని పిల్లలకు సహజంగా రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం, ఉదయం ఆలస్యంగా లేవడం అవసరమవుతుంది. అంటే వారి శరీరం ఉదయాన్నే ఎక్కువ విశ్రాంతి కోరుకుంటుంది. కానీ పాఠశాల సమయాలు ఈ అవసరాన్ని పట్టించుకోకపోవడం వల్ల విద్యార్థులు తగినంత నిద్ర పొందలేకపోతున్నారు. ఫలితంగా నిద్రలేమితో బాధపడుతున్న టీనేజ్ విద్యార్థులు అనేక మానసిక, శారీరక సమస్యలను ఎదుర్కొంటారు. వారి జ్ఞాపకశక్తి, ఏకాగ్రతపై ప్రతికూల ప్రభావం పడుతున్నది. చంచల స్వభావం, చిరాకు, డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలు పెరుగుతాయి. శారీరకంగా అధిక బరువు, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి. విద్యా ప్రదర్శనలో వెనకబాటుతనం, పాఠ్యాంశాలను అర్థం చేసుకోవడంలో కష్టాలు ఎదురవుతాయి. ఈ సమస్యలు కేవలం వ్యక్తిగతంగా కాకుండా, మొత్తం సమాజం పైనే ప్రతికూల ఫలితాలను కలిగిస్తాయి. పాఠశాల సమయాలను కనీసం ఒక గంట ఆలస్యంగా ప్రారంభిస్తే ఫలితాలు గణనీయంగా మెరుగుపడతాయని నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికే కొన్ని దేశాలు ఈ విధానాన్ని అమలు చేశాయి. ఫలితంగా విద్యార్థుల హాజరు పెరిగింది, పరీక్షా ఫలితాలు మెరుగుపడ్డాయి, అలాగే విద్యార్థులు ఆరోగ్యంగా, ఉత్సాహంగా పాఠశాలలో పాల్గొంటున్నారు. టీనేజ్ వయసులో మెదడు వయోజనులకన్నా, చిన్నారుల కన్నా వేరుగా పనిచేస్తుంది. ఈ సహజమైన శారీరక, మానసిక తేడాలను గౌరవించడం అవసరం. విద్యార్థుల సహజ నిద్ర పద్ధతిని అర్థం చేసుకొని, పాఠశాల సమయాలను సర్దుబాటు చేయడం ద్వారా వారి దీర్ఘకాలిక ఆరోగ్యం, విద్యా విజయాలు రెండూ మెరుగుపడతాయి. కాబట్టి, యవ్వన దశలో ఉన్న పిల్లల నిద్ర అవసరాలను పాఠశాలలు పట్టించుకోవడం అత్యంత ముఖ్యమైన విషయం. సాంకేతిక పరిజ్ఞానం, బోధన పద్ధతులు ఎంత ఆధునికంగా ఉన్నా, ఒక పిల్లవాడి సహజ శారీరక అవసరాన్ని పట్టించుకోకపోతే విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలు బయటపడతాయి. అందుకే, విద్యార్థుల దీర్ఘకాలిక మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడటానికి పాఠశాల ప్రారంభ సమయాల మార్పు ఒక సరళమైనా, శక్తివంతమైన పరిష్కారం.

## చదువు లేని ప్రతిభావంతుడు..




ఎడ్మండ్ అల్బియస్‌కు చదువులేదు. అయితేనేం అత్యంత ప్రతిభావంతుడు. కానీ, 1841లో, కేవలం 12 సంవత్సరాల వయసులో అతను బానిస బాలుడు కావడంతో చదువుకు నోచుకోలేదు. అయినప్పటికీ వినిల్లా ఆర్చిడ్ పూలను అత్యంత వేగంగా, లాభదాయకంగా పోలినేషన్ (పరాగసంపర్కం) చేసే అద్భుత విధానాన్ని కనుగొన్నాడు. ఆ కాలంలో ప్రముఖ వృక్షశాస్త్ర నిపుణులు ఎదుర్కొంటున్న ఎన్నో ప్రశ్నలకు అంత చిన్న వయసులోనే అల్బియస్ విధానం సమాధానాలనిచ్చింది. వాటిని పరిష్కరించింది. అతని కారణంగానే వినిల్లా అత్యంత వేగంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. 1820 దశకాలలో, ఫ్రెంచ్ వలసదారులు వినిల్లా పండ్లను మెక్సికో నుండి తమ దేశంలోనే రీయూనియన్ దీవికి, అలాగే మరో కొన్ని దీవులకు తీసుకొచ్చారు. అయితే, అడవి తేనెటీగల మాదిరి అక్కడి స్థానిక పురుగులు వినిల్లా పూల పరాగసంపర్కం చేయలేవని స్పష్టమైంది. దీనితో వినిల్లాను అతి కష్టం మీద మెక్సికో నుంచి ఫ్రాన్స్‌కు తీసుకొచ్చినప్పటికీ, పెద్దగా ఫలితం ఉండేది కాదు. 1830 దశకాల్లో బెల్జియం దేశస్థుడు బాటనిస్ట్ చార్లెస్ మోర్రెన్ చేతితో పూలను కాయలుగా మార్చేందుకు కొన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, అవి చాలా ఖర్చుతోనూ, ఎక్కువ శ్రమతోనూ కూడుకున్నవి కావడంతో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. అలాంటి సమయంలో అల్బియస్ గడ్డి ఆకులను ఉపయోగించి పోలినేషన్ ప్రక్రియను వేగంగా పూర్తిచేసే విధానాన్ని కనుగొన్నాడు. అతను కనుగొన్న పద్ధతి చాలా సరళమైనది అయినా, దీనివల్ల వినిల్లా పరిశ్రమలో విప్లవాత్మక మార్పు వచ్చింది. రీయూనియన్ ప్రపంచ ప్రముఖ వినిల్లా సరఫరాదారుగా ఎదిగింది. దురదృష్టవశాత్తు అల్బియస్ విజయం అతను జీవించి ఉండగా గుర్తింపు పొందలేదు. ఫలితంగా, నిరుపేదగా, ఎలాంటి గుర్తింపు లేకుండా జీవితం ముగిసింది. మరణం తరువాత మాత్రమే, అతనిది గొప్ప శాస్త్రీయ విజయం అని ప్రపంచం అంగీకరించింది. ఇప్పటికీ, అల్బియస్ పోలినేషన్ పద్ధతి మడగాస్కర్‌లో వినియోగంలో ఉంది. ఇప్పుడు మడగాస్కర్ ప్రపంచంలోనే ప్రముఖ వినిల్లా సరఫరాదారుగా ఎదిగిందంటే, దాని వెనుక అల్బియస్ కృషి ఉంది.

### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష లను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

### ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కూనంనేనికి వినతి పత్రం



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పెండింగ్‌లో ఉన్న రూ.8500 కోట్ల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి విడుదలకు కృషి చేయాలని, ప్రభుత్వం దృష్టికి విద్యార్థుల సమస్యలను తీసుకెళ్లాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ ఎంతోమంది పేద విద్యార్థులు చదువుకుం టున్న కాలేజీల్లో రూ.8500 కోట్ల బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులకు కాలేజీల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు అనేక పోరాటాలు నిర్వహించామని, ప్రభుత్వం దృష్టికి సమస్య వెళ్లినప్పటికీ కనీసం స్పందించే పరిస్థితి లేదన్నారు. మా ఫీజులు చెల్లించి మా బ్రతుకులకు ఓ దారి చూపండీ అంటూ విద్యార్థులు రోడ్డెక్కుతుంటే రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలపై విజిలెన్స్ దాడులు చేస్తామని బెదిరించడం దుర్మార్గం అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటే ఏఐఎస్‌ఎఫ్ చూస్తూ ఊరుకోదని, తక్షణమే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందిస్తున్న కూనంనేని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షులు కొరిమివిజయ్, నాయకులు ఉమా మహేశ్వరరావు, కళ్యాణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పల్లెలో వందేళ్ల ఉత్సవాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పల్లెపల్లెలో సిపిఐ వందేళ్ల ఉత్సవాలు ఘనంగా నిర్వహించి నవ భారత నిర్మాణంలో సిపిఐ నిర్వహించిన పాత్ర, ప్రజా సంక్షేమం కోసం చేసిన పోరాటాల చరిత్రను వివరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చుంచుపల్లి మండలపరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం విస్తృత ప్ర చారం నిర్వహించారు.గ్రామసెంటర్లలోజరిగిన సమావేశాల్లో సాబీర్ పాషా మాట్లాడుతూ ప్రజలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. స్వాతంత్రానికి పూర్వమే కాన్పూర్‌లో ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ దేశ స్వతంత్ర కోసం అలుపెరగని పోరాటాలు చేసిందని, స్వతంత్రం అనంతరం ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, హక్కులపై పోరాడిందని, పాలకులకు పలు సూచనలు చేసిందన్నారు. అధికారం కోసం కాకుండా ప్రజల కోసం పని చేసే పనిచేసేది కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే అన్నారు. ప్రజలకు నాటి నుండి నేటి వరకు అందిస్తున్న ఫలితంగానే భారతీయరాజకీయ చరిత్రలో సుదీర్ఘంగా మనగలిగిన పార్టీగా సిపిఐ ఉందన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో ముగింపు బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మండల కార్యదర్శివాసిరెడ్డిమురళీ, జిల్లా కార్యవర్గ సభ్యులు జి వీరస్వామి, మండల నాయకులు నీడలా సుధాకర్, వెంకన్న పుల్లయ్య, కట్టా ఉదయ్ ఉన్నారు.

## ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీ పట్టదా?

### సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడి అరికట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐజిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా సమితి ఆధ్వర్యంలోడిఎంహెచ్‌ఓ కార్యాలయంముందు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలు రోగాల బారిన పడి ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తే మందులులేవని టెస్టులు, స్కానింగులు బయటి ప్రైవేట్‌ల్యాబ్‌లకు రెఫర్‌చేస్తూ రోగులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆస్పత్రులకువెళితే టెస్టులు స్కానింగ్‌ల పేరిట వేలకు వేలువసూలు చేస్తున్నారని ఆరోపించారు. వారి దోపిడిని అరికట్టాలన్నారు. ధర్నా అనంతరం వినతిపత్రాన్ని ఏఓకు అందజేశారు. సిపిఐరాష్ట్ర సమితిసభ్యులు కేశవులుగౌడ్, జిల్లాకార్యవర్గ సభ్యులు తన్నీరు నర్సింహ్మా, విజయుడు, యేసయ్య, జిల్లాసమితిసభ్యులు కృష్ణాజి, బొల్లెద్దు లశ్రీనివాస్, రవీందర్, తుమ్మలశివుడు, బండిలక్ష్మి పతి, శివశంకర్, మల్లయ్య, కిరణ్‌కుమార్, దేశమోని అంజి, ప్రేమ్‌కుమార్, గోపాల్, కుర్మయ్య, శివకృష్ణ, విజయుడు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలపై ఉన్న శ్రద్ధ విద్యార్థులపై లేదేమి?






### ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్

ప్రజాపక్షం/ వరంగల్ : పెండింగ్ స్కాలర్‌షిప్ రూ. 8500కోట్ల రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలనిఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్ ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. ఖిల్లా వరంగల్ మండలం గవిచర్ల క్రాస్ దగ్గర ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసనకార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎన్నికల పైన ఉన్న శ్రద్ధ విద్యార్థుల పైన ఎందుకు లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్ పిల్లలకు ఉన్నతమైన చదువులను అందిస్తారని హామీలు ఇస్తూ ప్రస్తుతం విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్స్, ఫీజురియాంబర్స్‌మెంట్స్‌ను ఎందుకు ఇవ్వడంలేదన్నారు. విడుదల చేయాలని లేని పక్షంలో ఉద్యమాలు ఉధృ తం చేస్తామని హెచ్చరించా రు. శివ కుమార్, నిఖిల్, క్రాంతి, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు

### బంద్‌కు ఎఐఎస్‌ఎఫ్ మద్దతు
### పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ప్రీతం

ప్రజాపక్షం/పెద్దపల్లి : ప్రైవేట్ డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు తలపెట్టిన నిరవధిక బందుకు ఏఐఎస్‌ఎఫ్ సంపూర్ణ మద్దతు తెలియజేయడం జరిగిందని ఏఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ బకాయిల విడుదలపై ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల యాజమాన్యాలు కళాశాలలు బంద్ చేయడం వల్ల విద్యార్థుల చదువులకు ఆటంకాలు కలుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు.ఏఐఎస్‌ఎఫ్‌జశ్వంత్,అభిలాష్, మహర్షి డిగ్రీ కళాశాల ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

## సమస్యలు తీర్చకుంటే సమ్మెకు సిద్ధం



### ఎఐటియుసి జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్‌కుమార్

ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : సింగరేణి వ్యాప్తంగా కార్మికుల సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించకపోతే, ఎఐటియుసి యూనియన్‌ఆధ్వర్యంలో ఆందోళనలు, సమ్మె కార్యక్రమాలు తప్పవని యూనియన్ జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం శ్రీరాం పూర్, నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గుర్తింపు సంఘం గా ఎఐటియుసి ఇచ్చిన డిమాండ్లను యాజమా న్యం ఏమాత్రం పట్టించుకోవడం లేదని, అప్లికేషన్ పెట్టుకుని తొమ్మిది నెలలు గడుస్తున్నా మెడికల్ బోర్డుపై స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయమని,మెడికల్‌బోర్డుపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డు పూర్తి చేసుకున్న దాదాపు 375 మంది డిపెండెంట్ ఉద్యోగార్థులు 5, 6 నెలల నుండి విటిసి ఆర్డర్ల కోసం ఎదురు చూస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వెంకటేష్ ఖని, ఇల్లందు ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు, ఓబి తీసే పనులను పూర్తిగా ప్రైవేటు వాళ్ళకే అప్పగించడం, ఎక్సెస్ మ్యాన్ పవర్ ఉందంటూనే కాంట్రాక్టు పద్ధతులను ప్రోత్సహించడం సరైంది కాదన్నారు. ఈ నెల 6న సింగరేణి వ్యాప్తంగా ధర్నాలు చేపట్టి మెమోరాండాలుఅందజేస్తామని, 8న జిఎం కార్యాలయాల ముందుధర్నాచేయనున్నట్టుతెలిపారు. ఉప ప్రధాన కార్యదర్శి ముష్కే సమ్మయ్య పాల్గొన్నారు.

## తుఫాన్ నష్టపరిహారం కోసం వినతి



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : నిర్మల్ జిల్లాలో మొంథా తుఫాను,అకాల వర్షాల వల్ల మొక్కజొన్న,సోయా,వరి,పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు భారీ నష్టాల్లో కూరుకుపోయారని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ అన్నారు.పంట చేతికొచ్చే సమయంలో నేలకొరిగి వడ్లు మొలకెత్తడం,తడవడంతో రైతులు అప్పుల పాలయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తక్షణమే ప్రతి గ్రామంలోనూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి,రైతులు పండించిన పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే,రెవెన్యూ,వ్యవసాయ అధికారులు పారదర్శకంగా నష్టాన్ని అంచనా వేసి,నష్టపోయిన ప్రతి ఎకరానికి 50,000 రూపాయల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.కొనుగోలు కేంద్రాలు ఏర్పాటును వేగవంతం చేయకపోతే,రైతులతో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని భూక్యా రమేష్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి,గంగయ్య,సాయన్న,బాబూలాల్,అనంతరావుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## త్యాగాలతో ముడిపడ్డ కమ్యూనిస్టులను ఆదరించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి




ప్రజాపక్షం / హనుమకొండ: హనుమకొండ సిపిఐ జిల్లా కార్యాలయంలో సోమవారం మద్దెల ఎల్లేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో హనుమకొండ సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడారు.భారతదేశాన్ని బ్రిటిష్ సామ్రాజ్యం వాదులు వందల సంవత్సరాలు అరాచక పాలన చేస్తూ దేశ సంపదను దోచుకెల్లుతున్న సందర్భంలో వారి అరాచక పాలన అంతమొందించడంకోసం దేశ ప్రజలనుయసంపూర్ణ స్వాతంత్ర్యం వైపు నడిపించినదే కమ్యూనిస్టు పార్టీ అని కమ్యూనిస్టు ఉద్యమం ప్రజాపోరాటాలకు పునాది అని గుర్తు చేశారు.1925 డిసెంబరు 26 న భారతదేశంలో సిపిఐ అవిర్భవించిన నాటినుండి అనునిత్యం ప్రజల పక్షాన నిరంతరం అలుపెరుగని పోరాటాలు చేస్తోందని తెలిపారు. డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే సిపిఐ ఉత్సవాలకు దేశం నలుమూలల నుండి నాయకులు కార్యకర్తలు,అలాగే 40 దేశాల ప్రతినిధులు హాజరవనున్నారని ఆయన తెలిపారు. ప్రజలు తమ ఆర్థిక సహకారం అందించాలని కోరారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా సిపిఐ పార్టీ దొరల గడీల పాలనను కూల్చి 3000 గ్రామాలను బంధవిముక్తులను చేసి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందని పేర్కొన్నారు.ఈపోరాటంలో 4500 మంది కమ్యూనిస్టులు రక్తం చిందించి ప్రాణత్యాగం చేశారని స్మరించారు.రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్,సిరబోయిన కరుణాకర్,మండ సదాలక్ష్మి, కర్రె లక్ష్మ ణ్,యషబోయిన శ్రీనివాస్,ఏదునూరి వెంకట్రాజం,కొట్టపాక రవి, నేదునూరి రాజమౌళి,నకీర్త ఓదేలు,బత్తిని సదానందం,మునగాల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తాం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరిత గతిన పరిష్కారం చేస్తామని శామీర్‌పేట సబ్ డివిజన్ ఇంజనీర్ అశోక్‌రావు అన్నారు. సోమవారం శామీర్‌పేట ఎడి కార్యాలయంలో విద్యుత్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల నుంచి 15 ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వినియోగదారుల నుంచి పిర్యాదులను తీసుకున్నామని చెప్పారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎఒ నాగేశ్వర్‌రెడ్డి, ఎఇలు రాఘవేందర్‌రావు, వెంకటనారాయణ, సబ్ ఇంజనీర్లు లక్ష్మన్‌చారి, శ్రీధర్, అభిషేక్, సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, లైన్ ఇన్స్‌పెక్టర్లు జగన్, యాదగిరి, రాంచందర్, వినియోగదారులు పాల్గొన్నారు.



## కార్మికుల పిఎఫ్ వివరాలు తెలపాలి

ఎఐటియుసి మున్సిపల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసు రత్నం

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల మరియు ఉద్యోగాల పిఎఫ్‌లో జమాయినా వాటి వివరాలు తెలపాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్ సుందర్ కు ఎఐటియుసి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి మున్సిపల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసు రత్నం మాట్లాడుతూ, గ్రామ పంచాయతీగా ఉన్నపుడు పిఎఫ్ పాసు బుక్‌లు ఇచ్చేవారు, అందులో అని వివరాలు ఉండేవి. ఇప్పుడు ఆన్‌లైన్ అయినా తరువాత కార్మికులకు పిఎఫ్ సంబంధించిన ఎలాంటి వివరాలు అందుబాటులో లేవు అని గుర్తుచేశారు. అందుకే ప్రతి మూడు నెలలకి పిఎఫ్ వివరాలు నోటిస్ బోర్డుపై పెట్టాలని, తద్వారా కార్మికులకు పిఎఫ్ వివరాలు అందుబాటులో ఉంటాయి అని వారు సూచించారు. ఈ కార్యక్రమం ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్, యాదయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గుంతల రోడ్లను బాగుచేయాలని నిరాహార దీక్ష

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నవాబుపేట మండల పరిధిలో దశాబ్ద కాలంగా మండలం నుండి అన్ని గ్రామాలకు వెళ్లాల్సిన రోడ్లు గుంతల మయంగా మారి నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారని బీజేవైఎం మండల అధ్యక్షుడు దగ్గుల శ్రీహరిగౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో రోడ్ల కోసం పాదయాత్రలు, ధర్నాలు, చేసిన ఎలాంటి ఫలితం లేకపోయింది. అందుకు మండల ప్రజలు రాష్ట్ర ప్రజలు బిఆర్ఎస్ పార్టీని వద్దని కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వం ఇచ్చి 22 నెలలు గడుస్తున్న రాష్ట్రంలో గానీ మన మండలంలో గానీ ఎక్కడ వేసినా గొంగడి అక్కడే ఉన్నది. బిఆర్ఎస్, కాంగ్రెస్, పార్టీల ప్రభుత్వాలలో మండలం ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని దుయ్యబట్టారు. ఈ రోడ్ల దుస్థితి వల్ల మండల పరిధిలో వాహనదారులు నిత్యం నరకం చూస్తున్నారని ఆరోపించారు. రోడ్ల నిర్మాణం పై గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలు ప్రకటనలకే పరిమితం కాగా, కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రోడ్లను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మండల రోడ్లు భాగు కోసం ఉద్యమం చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రభుత్వ తీరుకు బుధవారం రోజు నిరసనగా నిరాహార దీక్ష చేయనున్నట్టు దగ్గుల శ్రీహరిగౌడ్ తెలిపారు.



## జాతీయ సేవా సమితి శిబిరానికి మమత ఎంపిక

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** జాతీయ సేవా సమితి అడ్వెంచర్ శిభిరానికి తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో(జగద్గిరిగుట్ట) చదువుతున్న మూడవ సంవత్సరం విద్యార్థిని మమత ఎంపికైందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ అన్నారు. ఈ సందర్భంగా మమతను కళాశాల ప్రిన్సిపల్ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జాతీయ సేవా సమితి (ఎన్.ఎస్.ఎస్) నవంబర్ 10 నుంచి 19 వరకు హిమచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో నిర్వహించే అడ్వెంచర్ శిభిరంలో పాల్గొంటుందని చెప్పారు. విద్యార్థుల్లో ధైర్యం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతబావం పెంపొందించడంలో సహకరిస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె అనిత మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో అక్టోబర్‌లో 27న నిర్వహించిన ప్రతిష్టాత్మక అడ్వెంచర్ క్యాంప్ సెలెక్షన్‌లో కఠిన సామర్థ్య పరీక్షల్ని ఎదుర్కొని మమత ఎంపికైందని తెలిపారు. ఈ శిభిరంలో దేశ వ్యాప్తంగా వివిద రాష్ట్రాల నుంచి ఎంపికైన వాలంటీర్లు పాల్గొని పర్వాతరోహణ, ట్రెక్కింగ్, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారని తెలిపారు. కళాశాల ఆద్యాపక బృందం, వైస్ ప్రిన్సిపల్ చేతన, అకాడమిక్ ప్రిన్సిపల్ స్రవంతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె అనిత మమతను అభినందించారు.

## పోచమ్మకు ఘనంగా బోనాలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మండలం లాల్‌గడిమలక్‌పేటలో బోనాల పండగను ప్రజలు అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. సోమవారం గ్రామదేవత పోచమ్మ అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ కమిటి ఆహ్వానం మేరకు మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటి సభ్యులు అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అద్యక్షుడు తుంకి రమేష్, ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరక్టర్ బిక్షపతి, మాజి సర్పంచ్ ఎల్ల మల్లేష్. పిట్ల నర్సింలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటిన ఆటో డ్రైవర్ బాధితుడికి మోబైల్ అందజేత

**ప్రజాపక్షం/చర్లపలి :** చర్లపల్లి ఆటో డ్రైవర్ గిరి తన నిజాయితీని చాటుకున్నాడు. లాలాపేట్‌కు ప్రశాంత్ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి చర్లపల్లికి చెందిన గిరి ఆటోలో సికింద్రాబాద్‌లో ఎక్కిన ప్రయాణీకుడు ప్రశాంత్ నగర్‌లోదిగాడు.ఆటోలో ప్రయాణీస్తు మొబైల్ మరచిపోవడంతో చర్లపల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితుడికి పోలీసుల సమక్షంలో ఫోన్‌ను అప్పగించారు.పోయిన ఫోన్ దరకడంతో బాధితుడు సంతోషం వ్యక్తం చేస్తూ ఆటో డ్రైవర్ గిరికి కృతజ్ఞతలు తెలిపారు.ఇందులో హెడ్ కానిస్టేబుల్ చక్రపాణి రెడ్డి,ఆటో యూనియన్ నాయకులు ప్రతాప్‌సింగ్,పాండు,దర్శన్,యాకుబ్ తదితరులు ఉన్నారు.

# భూదేవి హిల్స్‌గుట్ట సక్రమమా, అక్రమమా?

హైడ్రా కూల్చివేతలు.. జీహెచ్ఎంసి అధికారుల అభివృద్ధి పనులు
పేరుకు మాత్రమే ప్రైవేటు స్థలం.. అన్నీ నోటరీ ప్లాట్లే..
సక్రమమైతే ఎందుకు రిజిస్ట్రేషన్‌లకు ఆటంకాలు







**ప్రజాపక్షం/నిజాంపేట్ :** అక్రమాలకు పుట్టగా భూదేవి హిల్స్‌గుట్ట పేరు గాంచింది. పేరుకు మాత్రమే ప్రైవేటు స్థలం, అన్నీ నోటరీ ప్లాట్లే. అన్ని విధాలుగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ యథేచ్ఛగా నోటరీలపై ప్లాట్లను విక్రయిస్తూ పబ్బం గడుపుకుంటున్నాడు ఓ పెద్దమనిషి. ఈ తతంగం మరెక్కడో కాదు నగర శివారు ప్రాంతంలోని మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్, భూదేవి హిల్స్‌లో కొనసాగుతున్నది. వివరాల్లోకి వెళితే.. భూదేవి హిల్స్ బస్తీ పూర్తిగా అక్రమంగా వెలసింది. పేరుకు మాత్రమే ప్రైవేటు స్థలమంటూ చెప్పుకుని నోటరీలపై ఎనభై, వంద, రెండు వందల గజాల చొప్పున విక్రయిస్తూ ఏకంగా లక్షలాది రూపాయలను కొల్లగొడుతున్నారు. గతంలో బాలానగర్ మండల పరిధిలోకి వచ్చిన ఈ భూదేవీ హిల్స్ బస్తీ జగద్గిరిగుట్ట డివిజన్‌కి ఆనుకుని ఉంటుంది. మండలం మాత్రం గతంలో బాలానగర్ మండలానికి వస్తుందంటూ బుకాయిస్తూ అభివృద్ధి పనులతో పాటు ఏకంగా పరికి చెరువు ఎఫ్‌టిఎల్ స్థలంలో డంపింగ్ చేస్తూ ప్లాట్లను ఓ వ్యక్తి విక్రయిస్తున్నారు. ఇటీవల హైడ్రా అధికారులు పరికి చెరువు ఎఫ్‌టిఎల్‌లో నిర్మించిన కట్టడాలను జెసిబితో కూల్చివేసిన సంగతి తెలిసిందే. కాగా గాజులరామారం సర్కిల్ అధికారులు మాత్రం బస్తీ అభివృద్ధికి అన్ని రకాలుగా సహకారం అందిస్తూ ప్రభుత్వ నిధులను వెచ్చిస్తూ రోడ్లను, డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయడం గమనార్హం. హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపడితే మున్సిపల్ సర్కిల్ అధికారులు అభివృద్ధి పనులను చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు ఏ మండలానికి భూదేవీ హిల్స్ బస్తీ వస్తుందో తెలియదు. కానీ గాజులరామారం సర్కిల్ అధికారులు మాత్రం అభివృద్ధి పనులను చేపట్టడం శోచనీయంగా ఉంది. అసలు భూదేవీ హిల్స్ బస్తీ నుండి ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం లేకున్నా అధికారులు అభివృద్ధి పనులను చేపడుతుండడం వెనుక ఆంతర్యమేమిటని పలువురు నిలదీస్తున్నారు. అభివృద్ధికి నోచుకోని బస్తీలు, కాలనీలు ఎన్నో ఉన్నా సర్కిల్ అధికారులు భూదేవీ హిల్స్ బస్తీలో లక్షలాది రూపాయలను వెచ్చించడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. భూదేవీ హిల్స్ బస్తీలో కొద్దిరోజుల నుండి ఇంటి పన్నులను విధిస్తున్నట్లు సమాచారం. ఎన్నో ఏళ్లుగా ఉన్న బస్తీల్లో అసలు ఇంటి పన్నులు విధించాలంటే సర్కిల్ రెవెన్యూ అధికారులు అంతా ఆన్‌లైన్ అయ్యిందని, రిజిస్ట్రేషన్ పత్రాలు ఉంటేనే ఇంటి పన్నులను జారీ చేస్తామని బహిరంగంగా చెబుతుంటారు. కానీ ఎలాంటి రిజిస్ట్రేషన్ లేని, అక్రమ బస్తీలో ఏ విధంగా ఇంటి పన్నులు విధిస్తున్నారని పలువురు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసలు భూదేవి హిల్స్ బస్తీ ప్రైవేటు స్థలమా లేక ప్రభుత్వ స్థలమా తేల్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గాజులరామారం సర్కిల్ పరిధిలోని జగద్గిరిగుట్ట డివిజన్, గాజులరామారం డివిజన్‌లకు ఆనుకుని వెలసిన భూదేవీ హిల్స్ బస్తీ అసలు సక్రమమా, అక్రమమా అన్న అనుమానాలు ప్రజలందరిలో నెలకొంటున్నాయి. ప్రైవేటు స్థలమని చెప్పుకునే ఓ వ్యక్తి ప్రభుత్వ అనుమతులతో లే అవుట్ వేయకుండా, రిజిస్ట్రేషన్ చేయకుండా ఎందుకు నోటరీ పై ప్లాట్లను విక్రయిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేటు స్థలమైతే ఎందుకు ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు కావడం లేదని పలువురు వాపోతున్నారు. ఓ వేళ భూ దేవి హిల్స్ బస్తీ ప్రభుత్వ స్థలమైతే నోటరీల పై కొనుగోలు చేసిన ప్లాట్ల యజమానుల పరిస్థితి ఏంటని అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఓ వేళ ప్రైవేటు స్థలమని అధికారులు తేల్చితే ఎందుకు అనుమతులతో వెంచర్ వేయలేదని ప్రజల్లో నెలకొన్న ప్రశ్నలు. ఉన్నతాధికారులు స్పందించి రెండు మండలాల పరిధిలోకి వచ్చే ఈ భూదేవి హిల్స్ బస్తీ ఏ మండలానికి వస్తుందో తేల్చి అది ప్రైవేటు స్థలమా, ప్రభుత్వ స్థలమా అన్న అనుమానాలకు పులిస్టాప్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**అభివృద్ధి పనులు ఫుల్.. ప్రభుత్వ ఆదాయం నిల్..**

గాజులరామారం సర్కిల్ పరిధిలోని జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవి హిల్స్ బస్తీలో ఇటీవల అధికారులు ప్రత్యేకంగా అభివృద్ధి పనులను చేపడుతున్నారు. భూదేవీ హిల్స్ బస్తీలో సిమెంటు రోడ్లుతో పాటు ఇతర అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నా ప్రభుత్వానికి ఆదాయం ఏ మాత్రం లేదు. ప్రైవేటు బస్తీగా చెప్పుకునే భూదేవి హిల్స్‌లో రిజిస్ట్రేషన్ నుండి కాని, బిల్డింగ్ అనుమతుల నుండి కాని ఎలాంటి ఆదాయం లేదు. కానీ మున్సిపల్ సర్కిల్ అధికారులు మాత్రం ప్రత్యేకంగా లక్షలాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి చేయడంపై సర్వత్రా విమర్శలు సందేహాలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వానికి ఏ విధమైన ఆదాయం లేని భూ దేవి హిల్స్‌లో ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులను చేపట్టడం పై గాజులరామారం సర్కిల్ ఇఇ కిష్టప్పను వివరణ కోరగా డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థ ఉన్నచోట తప్పనిసరిగా రోడ్లు వేస్తామని, అవి లేకపోతే బస్తీవాసుల నుండి ఓ లెటర్ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లింక్ రోడ్లను తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం కోసమే బస్తీలో రోడ్ల అభివృద్ధి చేపడుతామని స్పష్టం చేశారు.

## ప్రభుత్వ భూముల కబ్జాలపై బిఆర్ఎస్ నాయకుల నిరసన హాస్యాస్పదం

సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్




**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** ప్రభత్వ భూముల కబ్జాపై బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పలు ప్రాంతాలలో కాంగ్రెస్ నాయకులు కబ్జా చేశారని దాన్ని హైడ్రా పట్టించుకోవట్లేదని నిరసన చేయడం హాస్యాస్పదమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్ అన్నారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయ్యాయని వాటిపైన కూడా మాట్లాడాలని అన్నారు. టిఆర్ఎస్ నాయకులు చిత్తశుద్ధితో ప్రభుత్వ భూముల పరిరక్షణ కొరకు పనిచేయాలని కేవలం వ్యక్తిగతంగా లేక రాజకీయ ప్రచారం కోసం మాట్లాడితే ప్రజలు నవ్వుకుంటారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రభుత్వ సహాయంలో జరుగుతున్న అక్రమాలపైన కూడా పోరాటం చేయాలని అన్నారు. హైడ్రా అధికారులు కూడా స్పందించి గతంలో కూల్చినచోట్ల మళ్లీ నిర్మాణాలు జరుగుతున్నాయంటే వాటి వెనకాల గల కారణాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత హైడ్రా కమిషనర్‌పై ఉందన్నారు. కుత్బుల్లాపూర్‌లో పరికి చెరువు, చింతల చెరువు, ఏపీఎస్ఎఫ్‌సి భూములు, జగద్గిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ భూములు రక్షిస్తామని కూల్చివేతలు చేపడతామని చెప్పి, నేడు పేద ప్రజల వద్దకు మాత్రమే వెళ్తున్నారని అన్నారు. హైడ్రా వెంటనే కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, మండల కార్యదర్శి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దు



**ప్రజాపక్షం/నాగారం :** కాలనీవాసులు తమ నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో ఉద్రిక్తతకు దారితీసింది.నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీ రోడ్ నంబర్ 1,3 జంక్షన్ వద్ద సత్యనారాయణ కాలనీ అసోసియేషన్ సభ్యులు,మహిళలు జనావాసాల మధ్య వైన్స్‌ను ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వైన్స్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో మహనీయులు ఎన్‌టిరామారావు,దొడ్డి కొమురయ్య,విగ్రహాలు ఉన్నాయని,ఇదే ప్రాంతంలో కృష్ణవేణి స్కూల్,ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయని,ఏర్పాటు చేస్తున్న వైన్స్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో కంటెస్టెంట్ బిజెపి ఎంఎల్ఏ సుదర్శన్‌రెడ్డి,మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,అన్నంరాజు శ్రీనివాస్,రెడ్యానాయక్,నరేష్,నాగరాజు,మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్ ఆఫీసులో ఫిర్యాదు....**

నాగారం ప్రధాన రహదారి సర్వే నంబర్ 133 ప్లాట్ నంబర్ 55,6,7,8,9లో గల 1600 గంజాలలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతున్న మున్సిపల్ అధికారులు,హెచ్ఎండిఏ అధికారులు పట్టించుకోవడం లేదని తక్షణమే అనుమతులు లేని నిర్మాణాన్ని నిలిపివేయాలని కాలనీవాసులు,నాయకులు జిల్లా కలెక్టర్ ఆఫీసులో ఫిర్యాదు చేశారు.

## ఇళ్లులేని ప్రతి నిరుపేదకు ఇళ్లు కట్టిస్తాం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో ఇళ్లులేని ప్రతి ఒక్కరికి ఇళ్లు కట్టిస్తామని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. సోమవారం కేశవరంలో రాగుల అర్చన యాదగిరిల ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశానికి విచ్చేసి రిబ్బన్ కట్‌చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలోని పాలకులు ఏ ఒక్కరికి ఇళ్లు కట్టించిన పాపన పోలేదని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో ఇళ్లు లేని వారిని గుర్తించి ఇళ్లు కట్టిస్తున్నామని చెప్పారు. మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ ఆద్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గంలో సుమారు 3 వేల ఇండ్లు మంజూరు అయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డి, మేడ్చల్ ఎ బ్లాక్ అద్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అద్యక్షుడు దోసకాయల వెంకటేష్, మాజి ఎంపిటిసిలు గౌనె హన్మంతరెడ్డి, రవీందర్‌రెడ్డి, గడ్డం రమేష్, వీరేషం, బస్వారెడ్డి, యాదగిరి,విశ్వేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## మీర్జాది గూడా ప్రమాద ఘటన చాలా బాధాకరం

బాధిత కుటుంబాలకు రూ.50లక్షలు, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్



**ప్రజాపక్షం/తాండూరు :** చేవెళ్ళ మండల పరిధి మిర్జాదిగూడా వద్ద జరిగిన ఆర్టిసి ప్రమాదం ఘటనలో జిల్లాకు వారు మృతి చెందడం చాలా బాధాకరమని సిపిఐ వికారాబాద్ జిల్లా సిపిఐ కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ పేర్కొన్నారు. వారి మరణం పట్ల సిపిఐ రాష్ట్ర పార్టీ తరపున తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపాన్ని,సానుభూతిని తెలియజేశారు. సోమవారం ఘటన స్థలానికి చెరుకున్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, చేవెళ్ళ సిపి నాయకులు రామస్వామి, ప్రభులింగ, మహిళా సమాఖ్య నాయకురాలు మంజుల తదితరులు చేవేళ్ళ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి మృతి చెందిన కుటుంబాల సభ్యులను పరమార్శించారు. చనిపోయిన కుటుంబ సభ్యులకు ప్రభుత్వం వెంటనే రూ.50లక్షలు, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం అందించాలని డిమాండ్ చేశారు. అనాథలైన పిల్లల చదువు బాధ్యత పూర్తిగా ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. తాండూరుహైదరాబాద్ రోడ్డును నాలుగు లైన్ల రోడ్డు చేయాలని ఎన్నో సార్లు పార్టీ తరుపున విజ్ఞాప్తి చేసిన పెడచెవ్విన పెట్టారని దుయ్యబట్టారు. ఈ రోడ్డును నాలుగు లైన్ల రోడ్డు చేయక పోవడంతోనే ప్రమాదాలు పెరిగిపోతున్నాయని, ఈ రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా నిర్మించాలని డిమాండ్ చేశారు.



## బస్సు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం /వికారాబాద్ :** బస్సు ప్రమాదంలో గాయపడిన వారందరికీ మెరుగైన వైద్యం అధించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ డాక్టర్లను అదేశించారు. బస్సు ప్రమాదంలో గాయలైన వారిని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు . జరిగి సంఘనతో జిల్లా కలెక్టర్ ఆసుపత్రికి వచ్చి బాధితలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అదేశించారు. అవసరమైన చికిత్సలు అందించాలని చికిత్స పొందుతున్న ప్రయణికులను పరామర్శించి భారోసా కల్పించారు. కలెక్టర్‌తో పాటు ఆర్‌డిఒ వాసుచంద్ర,సిఐ భీంకుమార్ , వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**సకాలంలో పరిష్కరించాలి :** ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంమంధిత అధికారులను అదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతీసొమావారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వికారాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతలనుండి ప్రజావాణికి 86 ఫిర్యాదులు స్వీకరించడం జరిగింది అని కలెక్టర్ తెలిపారు.

## బస్సు ప్రమాదం చాలా బాధాకరం

మృత్యుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/తాండూరు :** చేవెళ్ళ బస్సు ప్రమాదం చాలా బాధాకరమని తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం జరిగిన బస్సు ప్రమాద ఘటన స్థలానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డిలతో కలిసి తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి చేవెళ్ళ ప్రభుత్వ ఆసుపత్రిలో క్షతగ్రాతులను పరమార్శించారు. రోడ్డు ప్రమాదంలో ఇంత మంది మృతి చెందడం చాలా బాధకరమని అన్నారు. ప్రభుత్వం తరపున మృత్యుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. అనంతరం బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి కటుంబ సభ్యులకు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. తాండూరు ప్రాంతానికి చెందిన 12మంది మృతి చెందిన విషయం తెలిసిందే, వారి అంత్యక్రియల నిమిత్తం ఒక్కోకక్కరి కుటుంబ సభ్యులకు తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.

## బిహార్‌లో 20 ఏళ్ల పాలనలో బిజెపి-జెడియు 'వలస పరిశ్రమ'ను స్థాపించింది

కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాం రమేశ్ ధ్వజం

**న్యూఢిల్లీ :** బిహార్‌లో 20ఏళ్ల పాలనలో బిజెపిజెడియు 'వలస పరిశ్రమను' స్థాపించారని, క్రమపద్ధతిలో, ఉద్దేశపూర్వకంగా బలహీనపరిచాయని కాంగ్రెస్ ఆరోపించింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరాం రమేశ్ ఈ విషయమై స్పందిస్తూ బిహార్ పరిశ్రమ సాంప్రదాయాన్ని పునరుద్ధరించడానికి, బలోపేతం చేయడానికి తన పార్టీ సంకల్పాన్ని పునరుద్ఘాటించారు. బిహార్ రాష్ట్రానికి వలసలు కాదు, పునర్నిర్మాణం అవసరమని నొక్కిచెప్పారు. '20ఏళ్ల పాలనలో బిహార్‌లో బిజెపిజెడియు బిహార్‌లో కేవలం వలస పరిశ్రమను మాత్రమే స్థాపించింది. ఈ రాష్ట్రం అపరిమిత పారిశ్రామిక సామర్థ్యంతో నిండి ఉంది. జాతీయ అభివృద్ధి, పరిశ్రమల పటం నుండి బిహార్ దాదాపు తుడిచిపెట్టుకుపోయింది' అని సోమవారం జైరాం రమేశ్ తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. ఒకప్పుడు పంచదార, కాగితం, జనపనార, పట్టు, పాల ఉత్పత్తులకు ప్రసిద్ధిగాంచిన బిహార్ ఇప్పుడు నిరుద్యోగం, వలసదారుల డిమాండ్‌కు పర్యాయపదంగా మారిందన్నారు. స్వాతంత్ర్యం తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వాలు అవిభక్త బిహార్‌లో అనేక పారిశ్రామిక యూనిట్లను ఏర్పాటు చేశాయని, ఇవి దేశ పారిశ్రామిక పటంలో బిహార్ రాష్ట్రాన్ని దృఢంగా స్థాపించాయన్నారు. ఆకాలంలో బిహార్ అభివృద్ధి చక్రం భారీ పరిశ్రమలు, ఇంధనం, పాడి పరిశ్రమ, రైలు ఉత్పత్తులు శరవేగంగా అభివృద్ధి చెందాయని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో బిహార్ రాష్ట్రంలో స్థాపించిన కీలక పారిశ్రామిక యూనిట్లు జాబితాను జైరాం రమేశ్ ప్రస్తావించారు. బరౌనీ ఆయిల్ రిఫైనరీ బిహార్‌ను ఉత్తత్తి కేంద్రంగా మార్చిందని పేర్కొన్నారు. సింద్రీ, బరౌనీ ఎరువుల కర్మాగారాలు దాని ఎరువుల భద్రతను బలోపేతం చేశాయని వివరించారు. బరౌనీ డెయిరీ సుధా డెయిరీకి పునాది వేసిందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాం రమేశ్ గుర్తుచేశారు. బేలాలోని రైల్ వీల్ ప్లాంట్, మర్హౌరాలోని డీజిల్ లోకోమోటివ్ ప్లాంట్, నేబీ నగర్‌లోని థర్మల్ ప్రాజెక్ట్ సుధా కోఆపరేటివ్ డెయిరీ నెట్‌వర్క్‌లను రమేశ్ ఈ సందర్భంగా ఉదాహరణలుగా వివరించారు.బిహార్ శాసనసభ ఎన్నికలు రెండు దశలలో నవంబరు 6, నవంబరు 11న జరుగనున్నాయి.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## రోడ్డు వెడల్పు చేయకపోవడం వల్లే ప్రమాదం
### మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి: చేవెళ్ల బస్సు ప్రమాదంలో క్షతగాత్రులను,మృతుల కుటుంబాలను మాజీ మంత్రి,మహేశ్వరం ఎం ఎల్ ఎ పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. క్షతగాత్రులను,మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా పనులు చేపట్టలేదని విమర్శించారు.రోడ్డు పూర్తిగా గోతులతో నిండిపోయిందన్నారు.రోడ్డు వెడల్పు లేకపోవడం వల్ల తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతంలో రోడ్డు వెడల్పు చేయాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి తెలిపారు.

## ప్రమాదం దురదృష్టకరం.. ఆదుకుంటాం
### శాసన సభాపతి, శాసనసభ్యులు గడ్డం ప్రసాద్‌కుమార్



ప్రజాపక్షం/రంగారెడ్డి: చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద సంఘటన స్థలాన్ని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి,వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్‌కుమార్ పరిశీలించారు. రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, శాసనసభ్యులు కాలే యాదయ్య, రాంమోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి,కుమార్తె గడ్డం అనన్యతో కలిసి బస్సును టిప్పర్ లారీ ఢీకొన్న సంఘటన స్థలాన్ని పరిశీలించిన స్పీకర్ ప్రసాద్ కుమార్ అధికారులను అడిగి దుర్ఘటన వివరాలను తెలుసుకున్నారు. ప్రసాద్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఉదయం మీర్జాగూడ వద్ద బస్సును టిప్పర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం అన్నారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, రాష్ట్ర పరిశ్రమలు, జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు క్షేత్ర స్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతి చెందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం, ఆర్ టి సి తరుపున 7 లక్షల రూపాయలు, గాయపడినవారికి 2లక్షలరూపాయలు నష్టపరిహారం ప్రకటించిందని చెప్పారు. హైదరాబాద్ బీజాపూర్ హైవే లో భాగమైన పోలీసు అకాడమీ నుండి మన్నెగూడ వరకు ఉన్న జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసి, టెండర్ ప్రాసెస్ పూర్తి చేసినా గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రోడ్డు విస్తరణ జరుగలేదన్నారు.

## మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు ఇవ్వాలి
### సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



ప్రజాపక్షం/రంగారెడ్డి: హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి మిర్జాగూడ సమీపంలో ఆర్‌టిసి బస్సును టిప్పర్ ఢీ ప్రమాద సంఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు.చేవెళ్ల ఆసుపత్రి వద్ద బాధిత కుటుంబాలను పరామర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ బస్సు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబా లకురూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభు త్వం వెంటనే చెల్లించాలని, మృతుల కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, క్షతగాత్రులకు రెండు లక్షల రూపాయలు ఇవ్వాలి అని వారికి మెరుగైన వైద్య సౌకర్యము చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్,బీజాపూర్ జాతీయ రహదారి పైన గతంలో కూడా చాలా ప్రమాదాలు చోటుచేసుకున్నాయని,ఎంతోమంది చనిపోయారని, ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్ర భుత్వం, మంత్రులు,ఎమ్మెల్యేలు, అధికారులు,ఎన్ని ప్రమాదాలు జరిగినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రమాదం జరిగినప్పుడు పరామర్శించడం తప్ప, ప్రమాదాలు నివారించడానికి మాత్రం ఎలాంటి మౌలిక చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని, ప్రజలు ప్రభుత్వానికి రోడ్డు టాక్స్‌లు కట్టాలి,ప్రాణాలు పోగొట్టుకోవాలి, ప్రభుత్వానికి మాత్రం ప్రజల ప్రాణాలు అంటే లెక్క లేకుండా పోయిందని వాపోయారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏ రామస్వామి,ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏం ప్రభులింగం, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

## మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారమివ్వాలి : ఆప్



ప్రజాపక్షం / ఖైరతాబాద్ : రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంమీర్జాగూడ బస్సు ప్రమాద దృశ్యాలు పలు హృదయాలను కలిచివేశాయని, ఈ ఘటనలో 19 మంది మృతిచెందడంపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. జిల్లాల్లో రోడ్లు గుంతలుగా మారి, కంకర తేలి అత్యంత ప్రమాదకరంగామారాయన్నారు.రోడ్లుబాగు చేయడంలో ప్రభు త్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, మృతుల బాధిత కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్‌చేశారు.గాయపడ్డ వారికి రూ.25 లక్షల తక్షణ సాయం అందించి, కార్పొరేట్ వైద్యం అందించాలని దిడ్డి సుధాకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## మృతుల కుటుంబాలకు అండ

ప్రజా పక్షం/గండిపేట: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ దగ్గర ఆర్టీసీ బస్సు టిప్పర్ ఢీకొన్న ఘోర ప్రమాదంలో 20 మందికి పైగా దుర్మరణం పాలైన ఘటనపై రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన వారి కుటుంబాలకు సంతాపాన్ని ప్రకటించారు.

## తీవ్ర దిగ్భ్రాంతి

ప్రజాపక్షం/శంకర్ పల్లి: రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంపై రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీంభరత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## కంప్యూటర్ విద్యపై దృష్టి

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు కంప్యూటర్ విద్యపై దృష్టి కేంద్రీకరించేందుకు కృషి చేయాలని ఫరూఖ్‌నగర్ మండల విద్యాధికారి మనోహర్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని చించోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైద్రాబాద్ ఇన్ఫోసిస్ డెస్క్ టాప్‌లు సంస్థ ఫైనాన్స్ మేనేజర్ వంశీకృష్ణ కులకర్ణి ఎంఇఓ మనోహర్ ద్వారా పాఠశాలకు 20డెస్క్‌టాప్‌లు అందజేశారు. ఎంఇఓ మనోహర్ మాట్లాడుతూ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తామన్నారు.

## 42శాతం రిజర్వేషన్లకు మిలిటెంట్ ఉద్యమాలు : ఆర్.కృష్ణయ్య



ప్రజాపక్షం /ఖైరతాబాద్ : స్థానిక సంస్థలలో బిసిలకు 42శాతం రిజర్వేషన్ల సాధనే ధ్యేయంగా బిసి సమాజమంతా మిలిటెంట్ ఉద్యమాలకు సిద్ధంకావాలని బిసి జెఏసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. 42శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికెళ్లాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ప్రభుత్వం ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి యెత్తరి బీమ్‌రాజు అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ, చట్టబద్ధత, న్యాయబద్ధతమైన రిజర్వేషన్లను స్థానిక సంస్థల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిసి బంద్ నేపథ్యంలో వందల మంది నేతలపై కేసులు పెట్టారని, అయినా వెనక్కి తగ్గేది లేదన్నారు. బిసి నేతలను జైల్లో వేస్తే జైల్‌భరోకు పిలుపునిస్తామన్నారు. ప్రభుత్వం సీనియర్ అడ్వకేట్లను తీసుకొచ్చి కోర్టులో బిసి రిజర్వేషన్లపై కేసు గెలిచేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. బిసి నేతలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా బిసి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని కోరారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాలు,జిల్లాలు,మండలకేంద్రాల్లోరిలే నిరాహారదీక్షలుచేపట్టాలని బిసి సమాజానికి కృష్ణయ్య పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్ , నేతలు నగేశ్, లక్ష్మ ణ్, మోదీ రాందేవ్, లక్ష్మ ణ్, బోయ గోపి, నరేశ్ గౌడ్, కిశోర్ యాదవ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ యుగంలోనూ పుస్తకాలపై మరింత ఆదరణ
### బుక్‌ఫెయిర్ లోగో ఆవిష్కరణలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, టిజెఎస్ అధ్యక్షుడు కోదండరామ్




ప్రజాపక్షం/ఖైరతాబాద్: డిజిటల్ యుగమని పేర్కొంటున్న ప్రస్తుత కాలం లో పుస్తకాల ప్రచురణ, పాఠకులు పెరగటం ఆనందదాయకమని హైదరాబాద్ బుక్ ఫెయిర్(హెచ్‌బిఎఫ్) గౌరవ సలహాదారులు జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సుదర్శన్‌రెడ్డి, హెచ్‌బిఎఫ్ సలహాదారులు టిజెఎస్ అధినేత కోదండరామ్, పూర్వ సంపాదకులు కె.రామచంద్రమూర్తిలతో కలిసి డిసెంబర్ 19 నుంచి 29 వరకు జరిగే 38వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ లోగోను నిర్వాహకులు ఆవిష్కరించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా బుక్‌ఫెయిర్‌లో సందర్శకులకు, స్టాల్ నిర్వాహకులకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. కోదండరామ్ మాట్లాడుతూ పుస్తకాల పట్ల అవగాహన పెంచడమే కాకుండా పుస్తకాలను పాఠకులకు అందుబాటులోకి తీసుకొని రావటానికి హైదరాబాద్ బుక్ ఫెయర్ లాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. హెచ్‌బిఎఫ్ అధ్యక్షులు డా.యాకుబ్, కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరాపార్కు వద్ద జరిగే హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను సందర్శకుల కోసం మధ్యాహ్నం 1గంటనుంచి రాత్రి 9 గంటలకు అందుబాటులో ఉంచుతామన్నారు. స్టాళ్ల నిర్వాహకుల నుంచి ఈ నెల 30 వరకు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి, ఎంహెచ్ భవన్ లోని బుక్ ఫెయిర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. తర్వాత స్టాళ్ల కేటాయింపునకు డ్రా తేదీని ప్రకటిస్తామన్నారు. మొత్తం 260 స్టాళ్లకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. సమావేశంలో హెచ్‌బిఎఫ్ కోశాధికారి పి.నారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులు బి.శోభన్ బాబు, కె.సురేశ్, ఎ.జనార్దన్ గుప్త, యూ.శ్రీనివాస్‌రావు, టి.సాంబశివరావు, స్వరాజ్ కుమార్ పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్‌రావుకు పరామర్శ

ప్రజా పక్షం/హయత్‌నగర్ : బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సోమవారం అయన నివాసంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల పరామర్శించారు.హరీష్ రావు తండ్రి సత్యనారాయణరావు మృతి చెందిన విషయం తెలుసుకొని మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్ రెడ్డి సాగర్ రెడ్డి తో కలిసి వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమములో బిఆర్ఎస్ నాయకులు సిద్దగోని నర్సింహాగౌడ్, మర్రి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## సునీత గెలుపు కోసం సుదీర్‌రెడ్డి ప్రచారం



ప్రజాపక్షం/హయత్ నగర్ : ఎల్ బి నగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ఎలక్షన్ తన అనుచరులు బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటి ఇంటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి సునీతను భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు.మాజీ కార్పొరేటర్లు కొప్పుల విట్టల్ రెడ్డి జిట్టా రాజశేఖర్ రెడ్డి సామ తిరుమల్ రెడ్డి భవాని ప్రవీణ్ బిఆర్‌పార్టీ సీనియర్ నాయకులు చిన్నగొని శ్రీధర్ గౌడ్ పట్నాల విశ్వేష్ రావు చెరుకు ప్రశాంత్ గౌడ్ లింగాల రాహుల్ గౌడ్ భాస్కర్ యాదవ్ ప్రవీణ్ రెడ్డి నర్సింహా గౌడ్ ఏర్పుల గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## యువతలో నిబద్ధత, సృజనాత్మకత ఉండాలి
### ఇస్కీ డైరక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్: యువతలో ప్రజలకు సేవచేసే భావన, నిబద్ధత, సృజనాత్మకతఉండాలనిఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఈస్కీ ) డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు పిలుపునిచ్చారు. గచ్చిబౌలిలోని ఈస్కీ స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ నిర్వహించిన రెండు రోజుల 'యువ ఉత్సవ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అసోసియేషన్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూషన్స్ ఇన్ సౌత్ ఏషియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. రామకృష్ణ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామేశ్వర్ రావు మాట్లాడుతూ యువత మేధస్సుకు పనికల్పిస్తే అద్భుతమైన ఆవిష్కరణలు సాధ్యమవుయన్నారు. నిజాయితీతో, నిబద్ధతతో పనిచేయడం యువత నేర్చుకోవాలన్నారు. హైదరాబాద్ యువత డ్రోన్ టెక్నాలజీ, స్కైరూట్ ఏరోస్పేస్, అర్బన్ కిసాన్, బ్లైండ్ ఐ వంటి ఆవిష్కరణలతో దేశానికి గుర్తింపు తెచ్చారన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ యువ ఉత్సవ్ ఒక వేడుక మాత్రమే కాదు, ఇది ఆలోచనలను పంచుకునే, ప్రతిభను ప్రదర్శించే వేదిక అన్నారు. తాను పనిచేస్తున్న సంస్థ సార్క్ దేశా ల మధ్య మేనేజ్‌మెంట్ విద్యా నాణ్యత పెంపొందించడానికి కృషి చేస్తోందన్నారు. కాలేజ్ ప్రిన్సిపాల్‌డాక్టర్‌కె.అశోక్ మాట్లాడుతూ యువఉత్సవ్ ద్వారా విద్యార్థుల్లో ఉత్సాహాన్నిపెంపొందించి, భవిష్యత్తుకు సన్నద్ధం చేసే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రెండు రోజుల ఈవెంట్‌లో బిజినెస్ క్విజ్, జస్ట్ ఎ మినిట్, బెస్ట్ మేనేజర్, స్పాట్ చిత్రాంకన్, ర్యాంప్ వాక్, ట్రెజర్ హంట్ వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎస్. లక్ష్మి కాంతరావు, డాక్టర్ పి.రాజారావు, అలిగ్ రాజు, డాక్టర్ సింధు, డాక్టర్ రాజేశ్వరి, ఛాయా పద్మకుమారి, దాసరి మురళి, రమావత్ కిషన్, రఘువీరారెడ్డి పాల్గొన్నారు.

## ప్రతి గింజను కొంటాం..రైతులను ఆదుకుంటాం
### షాద్‌నగర్ శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడంతోపాటు అన్నదాతలను ఆదుకునేందుకు కృషి చేస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. సోమవారం షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని, వచ్చిన హామీలను ప్రణాళికబద్దంగా పని చేస్తుందని వివరించారు. ఆరుగాలం కష్టపడి పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని, గిట్టుబాటు ధర కల్పించి ఆర్థికంగా ఆదుకుంటామని తెలిపారు. రైతులకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు సిద్దంగా ఉంటుందని, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ఇవ్వడంతోపాటు యంత్రాలను సైతం అందిస్తున్నామని పేర్కొన్నారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని రైతులు నాణ్యత ప్రమాణాలు ఉండే విధంగా ధాన్యం సరి చేసుకొని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మద్యదళారీలకువిక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే నేరుగా మీ బ్యాంకుఖాతాలో జమ చేసేందుకు వీలు ఉంటుందని, అందులో ఎలాంటి మోసం ఉండదని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా రైతుల పట్ల సానుకూలంగా ఉందని, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఇబ్బందులు రాకుండా కృషి చేస్తామని వివరించారు. వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలో 37మెట్రిక్ టన్నుల వరిధాన్యం సాగుచేయడం జరిగిందని, 14వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ధాన్యం సాగు చేశారని వివరించారు. రైతులు ఆరబెట్టి నాణ్యతతో ధాన్యం తీసుకువస్తే గిట్టుబాటు ధర వచ్చేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. రైతులకు ఎలాంటి అటంకాలు రాకుండా అధికారులు ధాన్యం కొనుగోలు చేసేందుకు కృషి చేయాలని సింగిల్ విండో చైర్మెన్ బక్కన్న యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్లు కరుణాకర్, భరత్ లహుటి, నేతలు చెంది తిరుపతిరెడ్డి, క్యాసెట్ శ్రీనివాస్, పాండురంగారెడ్డిలతోపాటు రైతులు ఉన్నారు.

### 74మంది లబ్ధిదారులకు చెక్కులు

ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన చెక్కులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిణీ చేశారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాలకు చెందిన 74చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సిఎం సహాయ నిధి నిజమైన వరప్రసాదమని అన్నారు. ధరఖాస్తులు చేసుకున్న ప్రతి అర్హుడికి సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని, చెక్కులు అందుకున్న లబ్దిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజు, నేతలు చెంది తిరుపతిరెడ్డి, లింగారెడ్డిగూడ అశోక్, రఘునాయక్, ముబారక్, ఖదీర్‌లు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

బస్సు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల అదుకుంటామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. కంకర టిప్పర్ ఆర్‌టిసి బస్సు ఎదురెదురుగా వచ్చి రోడ్డు ప్రమాదం చోటు చేసుకోవడం దురదృష్ట కరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేయడంతోపాటు సంతాపం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అంధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ సంఘటన చోటు చేసుకోవడం బాధాకరమని, బస్సు ప్రమాదంలో మరణించిన నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

## రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి



ప్రజాపక్షం/కేశంపేట/కొందుర్గు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొవాలని మండల డిఎస్‌పి అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. సోమవారం కేశంపేట మండల తహశీల్దార్ రాజేందర్‌రెడ్డికి 42శాతం బీసి రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. మహిపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అఖిల పక్షాన్ని ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కొందుర్గు తహశీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. బీసి నాయకులు కారుకొండ యాదగిరి ముదిరాజ్, కూచూరి అనంతయ్య, జేఏసి నేతలు పెంటయ్య, డప్పు రవీందర్, సంజీవ, రాములు, నర్సింలు, ప్రశాంత్, కృష్ణయ్య, గోపాల్, డిఎస్‌పి నాయకులు రమేష్, రమేష్ గౌడ్, నరేష్, జావీద్, నరేష్ యాదవ్, యాదగిరి యాదవ్, శ్రీరాములు, జగన్, రవి, శివ, శ్రీకాంత్, పురుషోత్తం, కృష్ణ, నవీన్‌కుమార్, తిరుపతిలు పాల్గొన్నారు.

## మియాపూర్‌లో విద్యుత్ శాఖ వినియోగదారుల దినోత్సవం

ప్రజాపక్షం/మియాపూర్:విద్యుత్ శాఖ వినియోగదారుల దినోత్సవం మియాపూర్ డివిజన్ పరిధిలోని టీజీఎస్‌పీడీసీఎల్ సబ్ స్టేషన్ లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ సేవల కోసం వచ్చే విద్యుత్ వినియోగదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని, విద్యుత్ కోతలపై ముందస్తు సమాచారం ఇవ్వాలని అన్నారు.డివిజన్ లోని పలు కాలనీలలో విద్యుత్ సరఫరా, కొత్త లైన్ ల ఏర్పాటు, కొత్తగా ఏర్పాటు చేవలసిన ట్రాన్స్ ఫార్మర్ ల సంఖ్యను పెంచాలని, వినియోగదారులకు అంతరాయం లేకుండ విద్యుత్ సరఫరా చేయాలనీ సూచించారు.ఈ కార్యక్రమంలో చందానగర్ డివిజన్ సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి,విద్యుత్ అధికారులు ఎస్‌ఈ రవికుమార్,డి ఇ జనప్రియ,ఎ డి ఇ హరికృష్ణ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం పెట్టాలి
### గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ సస్పెన్షన్
### తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి



ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రభుత్వం నిర్ణయించిన మెను ప్రకారమే విద్యార్థులకు భోజనం అంధించాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మెన్, ముఖ్యమంత్రి ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి హెచ్చరించారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం వద్ద ఉన్న నాగర్‌కర్నూల్ సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను ఆకస్మీకంగా తనిఖీ చేశారు. విద్యార్థినీలతో అదివారం జరిగిన ఘటనపై చర్చించి వంటశాలను సందర్శించి భోజన శాలలో విద్యార్థినీలతో కలిసి భోజనం చేశారు. గురుకుల కళాశాలలో ప్రిన్సిపల్ శైలజవ్యవరిస్తున్న తీరుపై అధ్యాపకులు, విద్యార్థినీల నుండి వివరాలు సేకరించారు.జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పేద విద్యార్థుల శ్రేయస్సు కోసమే గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశామని వివరించారు. త్వరలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను సైతం అందుబాటులోకి తీసుకువస్తున్నామని గుర్తు చేశారు. గ్రామీణ పేద విద్యార్థులకు కార్పోరేట్ తరహాలో విద్యను అందిస్తున్నామని, కొంతమంది ప్రిన్సిపాల్, అధ్యాపకుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. ఆదివారం సాంఘీక గురుకుల కళాశాలలో చోటు చేసుకున్న సంఘటనపై ప్రిన్సిపాల్ శైలజను సస్పెండ్ చేశారని, పూర్తి స్థాయిలో విచారణ చేసి శాఖ పరమైన చర్యలు ఉంటాయన్నారు.మెను ప్రకారమే నిత్యం భోజనం అంధించాలని సూచించారు. గురుకుల కళాశాలలో ప్రిన్సిపల్ వ్యవహరిస్తున్న తీరును విద్యార్థినీలు డాక్టర్ జి.చిన్నారెడ్డికి వివరించారు. అనునిత్యం ఎలా వ్యవహరిస్తుందో కులంకుశంగా విద్యార్థినీలు తెలియజేశారు. విద్యార్థినీల నుండి పూర్తి సమాచారం సేకరించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివేధిక ఇవ్వనున్నట్లు తెలిపారు. తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

## ఉడకని అన్నం..నీళ్లచారుపై మండిపాటు
### కళాశాల ప్రిన్సిపాల్ తీరుపై ఆగ్రహించిన ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణ



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటేఅధికారులుమాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటి నిర్వాహణ కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణ ఆరోపించారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం వద్ద ఉన్న నాగర్‌కర్నూల్ సాంఘీక గురుకుల కళాశాలను తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటి నిర్వహణ కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణ, డిటిఎఫ్ డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ప్రజా సంఘాల నేతలు సందర్శించారు. విద్యార్థులతో వేరువేరుగా కలిసి ఘటనకు సంబంధించిన వివరాలు, కళాశాల ప్రిన్సిపల్ శైలజ వ్యవహరిస్తున్న తీరుపై ఆరా తీశారు.ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ గురుకుల కళాశాలలో విద్యార్థినీలకు ఉడకనిఅన్నం..నీళ్లచారు పెట్టడంపై ఆగ్రహించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెను ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టకుండా, గొడ్డుకారంతో భోజనం పెట్టడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు.నిత్యావసరవస్తువులతో భోజనం చేసి ఇవ్వకుండా వాటిని పక్కదారి పట్టించడం విడ్డూరంగా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ శైలజవిద్యార్థినీలపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అక్రమంగా డబ్బులు వసూళ్లు చేయడం, కళాశాలలోనే మద్యం సేవించడం క్షమించరాని పనులని వివరించారు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడురవీందర్‌గౌడ్,తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ అర్జునప్ప, పాలమూరు అధ్యాయన వేధిక జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్‌లు ఉన్నారు.

# రీల్



ఓ వ్యక్తి జీవిత చరిత్రను తెరపైకి తీసుకు రావడం అంటే అంత సాధారణమైన విషయమేమీ కాదు. పైగా ఓ రాజకీయ నాయకుడు.. అజాత శత్రువు.. నిజాయితీ పరుడు.. ప్రజల కోసం బతికే

## 'గుమ్మడి నర్సయ్య' దర్శకుడిని ప్రశంసించిన శ్యామలా దేవీ



నాయకుడైన గుమ్మడి నర్సయ్య లాంటి వ్యక్తి చరిత్రను తెరపైకి తీసుకు వస్తుండటం సాహసం అనే చెప్పాలి. ఆ సాహసాన్ని యంగ్ డైరెక్టర్ పరమేశ్వర్ హివ్రాలే చేస్తున్నారు. ఈ సాహసానికి ప్రవల్లిక ఆరట్స్ క్రియేషన్స్ బ్యానర్ తరుపున ఎన్.సురేష్ రెడ్డి అండగా నిలబడ్డారు. ఇక 'గుమ్మడి నర్సయ్య'గా కన్నడ హీరో శివ రాజ్ కుమార్ కనిపించబోతోన్నారు.

కొన్ని రోజుల క్రితం రిలీజ్ చేసిన 'గుమ్మడి నర్సయ్య' మోషన్ పోస్టర్ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. గుమ్మడి నర్సయ్య పాత్రలో శివ రాజ్ కుమార్ ఎలా కనిపిస్తారు? ఏ మేరకు ఆకట్టుకుంటారు? చిన్న మోషన్ పోస్టర్తోనే దర్శకుడు పరమేశ్వర్ తన టాలెంట్ ఏంటో చూపించారు. ఇక ఈ మోషన్ పోస్టర్ను చూసిన శ్యామలా దేవీ దర్శకుడిని ప్రశంసలతో ముంచెత్తారు. మోషన్ పోస్టర్ గురించి శ్యామలా దేవీ మాట్లాడుతూ 'ఎక్సలెంట్‌గా ఉంది.. ఈ మోషన్ పోస్టర్ చూస్తేనే సినిమా ఎలా ఉండబోతోందో అర్థం అవుతోంది. ఎన్ని అవార్డులు వస్తాయో తెలుస్తోంది. గుమ్మడి నర్సయ్యగా శివ రాజ్ కుమార్ ప్రాణం పెట్టి నటిస్తున్నట్టుగా కనిపిస్తోంది చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్' అని అన్నారు.

## 'దీక్ష' కోసం ప్రత్యేక పాట



డిఎస్ రెడ్డి సమర్పణలో ఆర్‌కె ఫిలిమ్స్ బ్యానర్‌లో డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ నిర్మాణ, దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం దీక్ష. కిరణ్, ఆలేఖ్యరెడ్డి హీరో హీరోయిన్స్‌గా ఆక్స ఖాన్, తులసి, అనూష,కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ ప్రధాన పాత్రలలో నటించిన చిత్రం 'దీక్ష'. ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. అయితే ఈ సినిమా కోసం ప్రత్యేకంగా ఒక పాటను చిత్రీకరించామని దర్శక, నిర్మాత డాక్టర్ ప్రతాని రామక్రిష్ణ గౌడ్ చెప్పారు. ఈ పాటను మధు ప్రియా పాడారు. 'బులెట్'అనే పాటను హీరో కిరణ్, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయేన్సర్ లాస్య, అనూహ్యలపై చిత్రీకరించామని ఆయన అన్నారు. సంక్రాంతికి వస్తున్నాం అనే సినిమాలో గోదారి గట్టుమీద పాటను పాడిన గాయని మధుప్రియ ఇందులో మూడు సినిమాలు పాడారని చెప్పారు. ఈ సినిమాలో పాడీన బుల్లెట్టు అనే పాట సూపర్ సూపర్ హిట్ అవుతుందని తెలిపారు.

## కెరీర్‌లోనే బెస్ట్ ఫిల్మ్



**దీక్షిత్ శెట్టి**

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇంటెన్స్, ఎమోషనల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. సరికొత్త ప్రేమ కథగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఈ నెల 7న హిందీతో పాటు తెలుగులో.. ఈ నెల 14న, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో వరల్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు హీరో దీక్షిత్ శెట్టి. దసరా మూవీ తర్వాత నాకు వచ్చిన అవకాశమిది. 'ది గర్ల్ ఫ్రెండ్' మూవీ కోసం దర్శకుడు రాహుల్ రవీంద్రన్ నన్ను అప్రోచ్ అయ్యారు. రశ్మిక హీరోయిన్‌గా 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా చేస్తున్నాం. మీరు ఈ మూవీలో బాయ్ ఫ్రెండ్ రోల్ కోసం అనుకుంటున్నామని చెప్పి స్క్రిప్ట్ పంపారు. స్క్రిప్ట్ చదివాక నన్ను ఈ క్యారెక్టర్ కోసం ఎందుకు అనుకుంటున్నారో అర్థమైంది. నేను వివిధ భాషల్లో సినిమాలు చేస్తున్నాను. తెలుగుతో పాటు తమిళ, మలయాళంలో స్క్రిప్ట్స్ వింటుంటా. 'ది గర్ల్ ఫ్రెండ్' లాంటి స్క్రిపట్స్ చాలా అరుదుగా వస్తుంటాయి. అందుకే ఈ సినిమాను తప్పకుండా చేయాలని అనుకున్నా.

ఈ సినిమాలో విక్రమ్ క్యారెక్టర్ ఎలా ఉండాలో దర్శకుడు రాహుల్‌కు పూర్తి క్లారిటీ ఉంది. విక్రమ్ ఎలా ఉంటాడు, అతని బాడీ లాంగ్వేజ్ ఏంటి, ఎలా మాట్లాడుతాడు అనేది రాహుల్ వివరంగా చెప్పేవారు. ఆయనకు ఉన్న క్లారిటీ వల్ల విక్రమ్ క్యారెక్టర్‌ను పర్ ఫార్మ్ చేయడం నాకు ఈజీ అయ్యింది. అనేక లేయర్స్ ఉన్న ఈ పాత్ర కోసం చాలా ప్రిపేర్ అయ్యాను. విక్రమ్ క్యారెక్టర్‌లో ఏదో నెగిటివ్ ఉంది, ఇతను టాక్సిక్ బాయ్ ఫ్రెండ్ అనే ఇంప్రెషన్ ట్రైలర్ రిలీజ్ తర్వాత అందరిలో కలుగుతోంది. అయితే విక్రమ్ నెగిటివ్ క్యారెక్టర్ అనేది ఎప్పుడూ ఫీల్ కావొద్దని రాహుల్ చెప్పేవారు. నేను స్టేజ్, ఫిలిం స్కూల్ బ్యాక్ గ్రౌండ్ నుంచి వచ్చాను కాబట్టి ఈ పాత్రకు ఎలా సన్నద్ధమవ్వాలో అలా అయ్యాను.

'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా షూటింగ్ టైమ్‌లో అరవింద్ రశెస్ చూసి పిలిచారు. నేను సరిగ్గా నటించడం లేదేమో, ఏమంటారో అని వెళ్లా. ఆయన అప్రిషియేట్ చేసి నెక్ట్స్ మూవీకి అడ్వాన్స్ ఇచ్చారు. సుదీర్ఘ అనుభవం ఉన్న అలాంటి గొప్ప ప్రొడ్యూసర్ నుంచి ప్రశంసలు రావడం, మరో సినిమాకు అడ్వాన్స్ ఇవ్వడం చాలా హ్యాపీగా అనిపించింది. అరవింద్ గారి ప్రశంసలు కెరీర్ బిగినింగ్ లో ఉన్న నాలాంటి యాక్టర్ కు ఎంతో ఆత్మవిశ్వాసం ఇచ్చాయి. ఈ మూవీ ప్రొడ్యూసర్స్ విద్య, ధీరజ్ మా అందరికీ కావాల్సినంత సపోర్ట్ ఇచ్చారు. హేషమ్ ఇచ్చిన మ్యూజిక్ 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాకు హైలైట్ అవుతుంది. ఏం జరుగుతుంది అనే పాట నా ఫేవరేట్ సాంగ్. ఈ సినిమా నా కెరీర్‌లో చేసిన బెస్ట్ ఫిలిం అని చెప్పగలను.

నేను కన్నడలో చేసిన బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి సినిమాను తెలుగులో ఈ నెల 21న విడుదల చేయబోతున్నాం. తెలుగులో షబనా అనే సినిమా చేస్తున్నా. ఇది కాకుండా కేజేక్యూ సినిమా రిలీజ్ కు రెడీ అవుతోంది. టైటిల్ ఖరారు కాని ఇంకో ప్రాజెక్ట్ లోనూ నటిస్తున్నా. కన్నడలో శివన్నతో కలిసి ఓ సినిమాలో నటిస్తున్నా, మలయాళంలో చేస్తున్న ఏంజెల్ నెం.16 రిలీజ్‌కు రెడీ అవుతోంది. తమిళంలో ఒక మూవీ షూటింగ్‌లో ఉంది.

## 21న 'ప్రేమంటే' విడుదల




ప్రియదర్శి, ఆనంది, సుమ కనకాల, నవనీత్ శ్రీరామ్, రానా దగ్గుబాటి, పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వి నారంగ్ 'ప్రేమంటే' ఫన్ ఫుల్ టీజర్ లాంచ్ చేశారు. ఈ సినిమా ఈ నెల 21న థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఈ సినిమాలో సుమ కనకాల ఒక ముఖ్యమైన పాత్ర చేస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్‌గా అరంగేట్రం చేస్తున్నారు. పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నరంగ్ నిర్మాణంలో, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ ఎల్పీ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సమర్పిస్తోంది. దివంగత నారాయణ్ దాస్ నారంగ్ గారికి ట్రిబ్యుట్‌గా నిలిచే ఈ చిత్రానికి ఆదిత్య మెరుగు సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

## నేడు శివ ట్రైలర్ విడుదల




నాగార్జున హీరోగా అమల హీరోయిన్‌గా రామ్ గోపాల్ వర్మను దర్శకుడిగా పరిచయం చేస్తూ అన్నపూర్ణ స్టూడియోలో బ్యానర్‌పై నిర్మించిన చిత్రం శివ. కాలేజీ గొడవల నేపథ్యంలో యాక్షన్ ప్రధానంగా తెరకెక్కిన శివ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించి యాభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా విడుదల చేయనున్నారు. అయితే ఈసినిమా ట్రైలర్‌ను ఈనెల అమీర్ పేటలోని ఏఏఏ థియేటర్‌లో విడుదల వేడుకను నిర్వహిస్తున్నారు. ఈ ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్రంలోని ప్రధాన తారాగణం హాజరయ్యే అవకాశం ఉంది.

## సోనాలి కులకర్ణి పోస్టర్ విడుదల




నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్యారడైజ్ సినిమా నుంచి హీరో హీరోయిన్ సోనాలి కులకర్ణి పోస్టర్ విడుదల చేశారు. సోనాలి జన్మదినం సందర్భంగా ఈ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. సోనాలి జాతీయ అవార్డు కూడా అందుకున్నారు. ఈ సినిమా షూటింగ్ రెగ్యులర్‌గా జరుగుతోంది. యాక్షన్ నేపథ్యంలో సాగే ఈ సినిమా దాదాపుగా పూర్తి కావచ్చింది. ఈ చిత్రాన్ని వచ్చే యేడాది మార్చి 26న విడుదల చేయనున్నారు. తెలుగు, హిందీ, తమిళ్, మళయాళం, కన్నడ, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానీష్ భాషల్లో రిలీజ్ కానుంది. అనిరుధ్ ఈ సినిమా కు సంగీతం అందిస్తున్నారు.

## 'కృష్ణ లీల' కథనే నమ్ముకున్నా

**- హీరో, డైరెక్టర్ దేవన్**



యంగ్ హీరో దేవన్ హీరోగా, ఆయన స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న సూపర్ నేచురల్ లవ్ స్టోరీ 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ట్యాగ్ లైన్. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తోంది. బేబీ వైష్ణవి సమర్పణలో మహాసేన్ విజువల్స్ బ్యానర్‌పై జ్యోత్స్న జి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కృష్ణ లీల' ఈ నెల 7న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో, డైరెక్టర్ దేవన్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. నేను సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తూనే సినిమా ప్రయత్నాలు చేసేవాడిని. రెండు సినిమాల్లో మంచి పాత్రలు చేశాను. ఆ తర్వాత అదే తరహా పాత్రలు రావడంతో కొత్త క్యారెక్టర్స్ కోసం ఎదురు చూస్తున్నప్పుడు నిర్మాత జోష్న, రైటర్ అనిల్ ఈ కథ చెప్పారు. కథ విని ఒక వారం రోజుల తర్వాత ఈ జనరేషన్‌కి ఈ కథని ఎలా చెప్పొచ్చో కొన్ని మార్పులు చేసి ఒక కొత్త రకం స్క్రీన్ ప్లేతో చెప్పాను. అది వారికి చాలా నచ్చింది.

ఎవరు డైరెక్ట్ చేస్తారు అన్నప్పుడు నేనే డైరెక్ట్ చేస్తానని చెప్పాను. వాళ్లు చాలా హ్యాపీగా ఫీలయ్యారు. నాకు డైరెక్షన్లో అనుభవం లేదు. కానీ కథ, స్క్రీన్ ప్లే మీద చిన్నప్పటి నుంచి మంచి అవగాహన ఉంది అదే నమ్మకంతో డిఓపి చోటా కె.నాయుడు కలిశాను. నేనే డైరెక్ట్ చేస్తానని ఆయనకు చెప్పాను ఆయన కథ విన్నారు. అలా ఈ సినిమా ప్రారంభమైంది.

కృష్ణ లీల.. తిరిగి వచ్చిన కాలం .. లీల అంటే ఆట. ఆయన ఒక ప్రేమ కథని ఎలా ఆడారు? ఎలా ఆడించారనేది కృష్ణ లీల.

మనిషి కాలాన్ని వెనక్కి తిరిగి తీసుకురాలేడు. కానీ ఒక దైవత్వంతో కాలం మళ్ళీ తిరిగి వస్తే ఎలా ఉంటుంది అనేది చాలా ఆసక్తికరంగా చూపించడం జరిగింది.

కృష్ణ తత్వం అనేది ఒక మహా సముద్రం. భగవద్గీతలో చెప్పే వాక్యాలు ఈ కథకి చాలా అద్భుతంగా కనెక్ట్ అయ్యాయి. నేను గంగాధర శాస్త్రి గారి ప్రవచనాలు ఎక్కువగా వినేవాడి. ఆయనకి కథ చెప్పినప్పుడు నాకున్న చాలా సందేహాల్ని ఆయన నివృత్తి చేశారు. ఈ కథ విషయంలో హెల్ప్ చేశారు. భీమ్స్ చాలా వండర్ ఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. ఆర్ ఆర్ కూడా చాలా అద్భుతంగా వచ్చింది.

---

## స్కేటింగ్‌లో అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ యాప్రల్‌లోని కారా స్పోర్ట్స్ అకాడమీలో 5 సంవత్సరాల నుండి 14 సంవత్సరాల లోపు ఉన్న 25మంది చిన్నారులు 5 గంటలు నాన్‌స్టాప్‌గా స్కేటింగ్ చేసి.. అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా, సే నో టూ డ్రగ్స్ అనే స్ఫూర్తితో ఆదివారం హైదరాబాద్ యాప్రల్ లోని కారా స్పోర్ట్స్ అకాడమీలో హెడ్ కోచ్ గంజి రాజిరెడ్డి ఆధ్వర్యంలో 25మంది చిన్నారులతో స్కేటింగ్ అటెంప్టను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేజర్ డా. దర్శన్, అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియన్ చీఫ్ కో ఆర్డినేటర్ డా.బింగి నరేందర్ గౌడ్ ఆర్ఆర్‌ఎస్ సంబాఫ్ సహ సంపార్క్ ప్రముఖ్ భరతుల మహేష్ కుమార్‌లు హాజరయ్యారు. అనంతరం జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా డా. బింగి నరేందర్ గౌడ్ మాట్లాడుతూ, ఎంతో కృషి, పట్టుదల, శ్రమ ఉంటే గానీ ఇలాంటి రికార్డులు సాధ్యం కావని తెలిపారు. స్కేటింగ్‌లో రికార్డు సృష్టించిన 25మంది విద్యార్థులను, కోచ్‌లను, సిబ్బందిని ఈ సందర్భంగా వారు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం హెడ్ కోచ్ గంజి రాజిరెడ్డి మాట్లాడుతూ, దాయాది దేశం పాకిస్థాన్‌పై ఇండియన్ ఆర్మీ చేసిన 'ఆపరేషన్ సింధూర్'కు మద్దతుగా, సే నో టు డ్రగ్స్ అనే నినాదాల స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కోచ్ రాజారెడ్డి, కోచ్ తరుణ్, పృథ్వీ, గౌతమి, సూర్యతేజ, ఆంజనేయులు, బాల సాయి కుమార్, తేజ, నటరాజ్ పాల్గొన్నారు

## లక్ష్యం 120 జిసిసిలు... 1.2 లక్షల ఉద్యోగాలు

### 'వాన్ గార్డ్ జివిసి ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వచ్చే ఏడాదిలో 120 గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల(జిసిసి)ను ప్రారంభించి... కొత్తగా 1.2 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ ఉద్యోగాలను అందిపుచ్చుకునేలా కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ లో అత్యుత్తమ నైపుణ్య శిక్షణ అందిస్తామన్నారు. హైటెక్ సిటీలోని నాలెడ్జ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన 'వాన్ గార్డ్ న్యూ ఇండియా ఆఫీస్ (గ్లోబల్ వాల్యూ సెంటర్)'ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ ప్రస్తుతం విశ్వసనీయత, సమగ్రత, ఇన్నోవేషన్‌కు చిరునామాగా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పెట్టుబడి నిర్వహణ సంస్థల్లో ఒకటైన వాన్‌గార్డ్ తమ 'గ్లోబల్ వ్యాల్యూ సెంటర్(జివిసి)'ను ప్రారంభించేందుకు హైదరాబాద్‌ను ఎంచుకోవడం ఈ నగర సామర్థ్యానికి నిదర్శనమన్నారు. వాన్ గార్డ్ ప్రపంచవ్యాప్తంగా 6.4 ట్రిలియన్ డాలర్ల ఆస్తులను నిర్వహిస్తోందని, అలాంటి సంస్థ మన దగ్గర కార్యకలాపాలు ప్రారంభించడం మనకు గర్వకారణమన్నారు. ప్రపంచ ఆర్థిక, సాంకేతిక పటంలో 'తెలంగాణ' బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అవుతుందన్నారు. ప్రస్తుతం వరల్డ్ టాప్7 అస్సెట్ మేనేజ్మెంట్ కంపెనీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు.

ఈ కంపెనీలు 30 ట్రిలియన్ డాలర్ల ఆస్తులను నిర్వహిస్తున్నాయని వివరించారు. ఈ కొత్త జీవీసీ ఇంజనీరింగ్ ఎక్స్‌లెన్స్, క్లౌడ్ మోడ్రనైజేషన్, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీకి ఒక హబ్‌గా సేవలు అందిస్తుందన్నారు. ఇది వాన్‌గార్డ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్‌లో నూతన ఆవిష్కరణలకు మార్గ నిర్దేశం చేస్తుందన్నారు. వాన్ గార్డ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పట్టి 'రైజింగ్ తెలంగాణ'లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

## టిప్పర్ బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. అధికవేగంతో వచ్చిన టిప్పర్ ముందుగా కారును ఢీకొట్టిందని, అనంతరం మరో మూడువాహనాలను ఢీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అయితే ప్రమాదానికి సమీపంలో పార్కింగ్ చేసిన బైక్‌లు ఉన్నాయని, టిప్పర్ వాటిపై బోల్తా పడడంతో దాని కింద నలిగిపోయాయని చెప్పారు. దీంతో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడిందన్నారు. అయితే ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా పోలీసుల ప్రత్యామ్నాయ మార్గం ద్వారా వాహనాలను దారి మళ్లించారని పేర్కొన్నారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి సమాచారం తెలుసుకోవడానికి పోలీసులు ఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. 'ట్రక్కు లోహామండీ వైపు నుంచి చాలా వేగంగా వస్తోంది. డ్రైవర్ మద్యం తాగి ఉన్నాడు. దారిలో ఉన్న ప్రతి ఒక్కరినీ తొక్కించాడు. నా కారును పక్కన పార్క్ చేసి ఉంచాను' అని ప్రత్యక్ష సాక్షి తెలిపారు. సంఘటనా స్థలంలో ఉన్న అదనపు పోలీసు కమిషనర్ రాజీవ్ పచార్ మాట్లాడుతూ డంపర్‌ను డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతున్నారని చెప్పారు. కారును ఢీకొట్టడంతో స్థానికులు అతన్ని వెంబడించగా, అతను మరింత వేగం పెంచి, రోడ్డు వెంట పాదచారులను, బైకర్లను ఢీకొట్టాడన్నారు. ఢిల్లీ–అజ్మీర్ హైవేపై ట్రెయిలర్ ట్రక్కుష కారును ఢీకొట్టిన తర్వాత అతను ఆగిపోగా, స్థానికులు డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారని చెప్పారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడా లేదా అనే దానిపై స్పందిస్తూ 'నిందితుడు డ్రైవర్ గాయపడ్డాడు కాబట్టి, వైద్య పరీక్ష తర్వాత మాత్రమే పరిస్థితి స్పష్టమవుతుందని, అయితే, ప్రమాద తీరును చూస్తే కచ్చితంగా మద్యం మత్తులో ఉండటం లేదా వైద్యపరమైన కారణాల వల్ల జరిగి ఉండవచ్చని తెలుస్తుందన్నారు. రాజస్థాన్‌లో చాలా రోజుల్లో జరిగిన రెండవ పెద్ద రోడ్డు ప్రమాదం ఇది. ఆదివారం సాయంత్రం ఫలోడి ప్రాంతంలో టెంపో ట్రావెలర్ నిలబడి ఉన్న ట్రైలర్ ట్రక్కును ఢీకొట్టడంతో 10 మంది మహిళలు, నలుగురు పిల్లలు సహా కనీసం 15 మంది మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు.

## 'సర్'

(మొదటి పేజీ తరువాయి)

జరగనున్నాయి. ఇదే ఏడాదిలో ఎన్నికలు జరగనున్న మరో రాష్ట్రమైన అసోంలో సుప్రీంకోర్టు పర్యవేక్షణలో పౌరసత్వాన్ని ధృవీకరించే ప్రక్రియ రాష్ట్రంలో జరుగుతున్నందున ఓటర్ల జాబితాల సవరణను విడిగా ప్రకటిస్తారు. కాగా, సర్ ఈనెల 4న గణన దశతో ప్రారంభమై డిసెంబర్ 4 వరకు కొనసాగుతుంది. డిసెంబర్ 9న ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేయనుండగా, తుది ఓటర్ల జాబితాను ఫిబ్రవరి 7న ప్రచురించనుంది. ప్రస్తుతం చేపట్టే సర్ స్వాతంత్ర్యం తరువాత తొమ్మిదవ ప్రక్రియ. చివరిసారిగా 2002–04లో నిర్వహించారు. అర్హత కలిగిన ఓటర్లను వదిలివేయకుండా, ఓటర్ల జాబితాలో అనర్హులు ఎవరూ చేరకుండా కూడడమే సర్ ఉద్దేశమని ఇసి అభిప్రాయపడింది. రాష్ట్రాలలో చివరి సర్ కటాఫ్ తేదీగా పనిచేస్తుంది. బిహార్‌లో 2003 ఓటర్ల జాబితాను ఇసి ఇంటెన్సివ్ సవరణ కోసం ఉపయోగించింది. చాలా రాష్ట్రాలు 2002–2004 మధ్య చివరి సర్‌ను కలిగి ఉన్నాయి. అవి ప్రస్తుత ఓటర్ల మ్యాపింగ్‌ను దాదాపు పూర్తి చేశాయి. కాగా, జూన్‌లో బిహార్‌లో సర్ ప్రారంభించినప్పుడు, పత్రాల కొరత కారణంగా కోట్లాది మంది అర్హతగల పౌరుల ఓటు హక్కును కోల్పోతున్నారని అనేక రాజకీయ పార్టీలు పేర్కొన్నాయి. ఈ విషయం సుప్రీంకోర్టుకు చేరినప్పుడు, ఓటర్ల జాబితాను శుభ్రపరచాలనే తన నిర్ణయాన్ని ఇసి సమర్థించుకుంది. భారతదేశంలో అర్హత కలిగిన ఏ పౌరుడిని కూడా వదిలివేయమని హామీ ఇచ్చింది. 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో సర్ చేపట్టే కంటే ముందు తమిళనాడులోని అనేక రాజకీయ పార్టీలు రాష్ట్రంలో ఈ ప్రక్రియకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించాయి.

## రూ.3వేల కోట్ల దోపిడీ!

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాల ద్వారా మన సంస్థల చేతులను బలోపేతం చేయాలి. ఈ నేరాలను ఉక్కు హస్తంతో ఎదుర్కోవాలని మేం నిశ్చయించుకున్నాం' అని ధర్మాసనం గమనించింది. ఈ కేసు విచారణ నవంబరు 10కి వాయిదా వేసిన సుప్రీంకోర్టు అమికస్ సూచనల ఆధారంగా కొన్ని ఆదేశాలను జారీ చేస్తామని తెలిపింది. నేర సిండికేట్లు విదేశీ ప్రాంతాలనుండి పనిచేస్తున్నాయని, అక్కడి వారికి ఆర్థిక, సాంకేతిక, మానవ సంబంధాలు కలిగిన 'స్కామ్ కాంపౌండ్స్' ఉన్నాయని సిబిఐ ఎత్తి చూపిందని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం, సిబిఐ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తా మాట్లాడుతూ హోం మంత్రిత్వ శాఖలోని సైబర్ క్రైమ్ విభాగం ఈ అంశాలను పరిష్కరిస్తుందని తెలిపారు. హర్యానాలోని ఒక వృద్ధ మహిళ తనను, తన భర్తను డిజిటల్ అరెస్ట్ కింద ఉంచారని ఫిర్యాదు చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌కు రాసిన లేఖను సుప్రీంకోర్టు పరిగణనలోనికి తీసుకుంది. కోర్టు, దర్యాప్తు సంస్థల నకిలీ ఆదేశాల ఆధారంగా మోసగాళ్లు అరెస్ట్ చేశారు. వారు సెప్టెంబరులో వారి నుండి రూ.1.05 కోట్లు దోపిడీ చేశారు. సిబిఐ, ఇడి, జ్యుడీషియల్ ఆఫీసర్లుగా నటించి, తమను అరెస్ట్ చేయడానికి అనేక ఆడియో, వీడియో కాల్స్ ద్వారా కోర్టు ఆదేశాలను చూపించారని ఆ మహిళ తెలిపింది. భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని వివిధ నిబంధనల కింద అంబాలాలోని సైబర్ క్రైమ్ విభాగంలో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు సుప్రీంకోర్టుకు సమాచారం అందింది. అక్టోబరు 17న దేశంలో పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల సంఘటనలను ముఖ్యంగా న్యాయపరమైన ఆదేశాలను నకిలీగా రూపొందించి పౌరులను మోసగించడానికి, డిజిటల్ అరెస్ట్‌లను పరిగణనలోనికి తీసుకున్న సుప్రీంకోర్టు కేంద్రం, సిబిఐ నుంచి ప్రతిస్పందనలను కోరింది. ఇటువంటి నేరాలు 'వ్యవస్థపై ప్రజల నమ్మకం' పునాదిని దెబ్బతీస్తాయని పేర్కొంది.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com